www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 23-2-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 309 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: దశమి మ. 1.56 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మూల రా. 6.43 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: సా. 5.02-6.43, తె. 4.25-6.02; దుర్ముహూర్తం: సా.4.43-5.29; అమృతఘడియలు: మ. 12.02-1.42; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వికటించిన వీధి నాటకం!

జాతీయ స్థాయి పరిణామాలను, కేంద్రంలో పెరిగిన చంద్రబాబు ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి దాడిని ఉధృతం చేశారు. ఈ క్రమంలో ఆయన ఎంచుకున్న రెండు కార్యక్రమాలూ బెడిసికొట్టాయి.

చంద్రబాబు, లోకేశ్ కంటే అందంగా ఉంటారు కనుక కొడాలి నాని, దేవినేని అవినాశ్‌ను కూడా త్వరలో అరెస్టు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రోతగా ఉన్నాయి. నీకంటే చంద్రబాబు అందంగా ఉంటారని అప్పట్లో ఆయనను అరెస్టు చేయించావా? అని ఎవరైనా ప్రశ్నిస్తే జగన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారు?

8వ తరగతి చదువుతున్న ఒక చిన్న పిల్లను తీసుకొచ్చి 'జగన్ మామయ్యా నాకు అమ్మ ఒడి రావడం లేదు' అని విలపింపజేశారు. జగన్ రెడ్డిని హత్తుకుని విలపించిన ఆ పాప తండ్రి, మేనమామ కరుడుగట్టిన వైసీపీ అభిమానులు. అమ్మ ఒడి రావడం లేదని ఆ పిల్ల ఏడుస్తూ చెబుతున్నప్పుడు తండ్రి, మేనమామ నవ్వడం కనిపించింది.

జగన్ రెడ్డి కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఒడి అమలు చేయలేదు. 2020 నుంచే అమలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని ఈ ఏడాది జూన్ నుంచి అమలు చేస్తామని ప్రకటించారు.

2014-19 మధ్య కాలంలో ప్రదర్శించిన వంచనతో కూడిన వీధి నాటకాలనే మళ్లీ ప్రదర్శించాలని జగన్ అండ్ కో అనుకోవడమే ఇప్పుడు చేస్తున్న తప్పు. వల్లభనేని వంశీపై మెజారిటీ ప్రజల్లో సదభిప్రాయం లేదు. అలాంటి వంశీ కోసం జగన్ అండ్ కో వీధి నాటకాలకు తెర తీయడం పొరపాటు.

ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణలో కూడా, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా ఈ ఏడాది మిర్చి పంటకు ధర పడిపోయింది. ఎన్నికల నియమావళి కారణంగా మిర్చి యార్డు సందర్శనకు అధికారులు అనుమతులు నిరాకరించినా జగన్ అండ్ కో లెక్కలేనితనంతో వ్యవహరించారు. దీంతో ఎన్నికల కమిషన్ అధికారులు జగన్ అండ్ కోపై కేసు పెట్టారు.



కేంద్రం వద్ద తనకు ఉన్న పలుకుబడిని స్వప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం ఉపయోగించడంలో చంద్రబాబుకు ట్రాక్ రికార్డు ఉంది. ఎన్డీయే బలపడటం ఇప్పుడు ప్రధాని మోదీకి ముఖ్యం. ఈ మార్పును అర్థం చేసుకోకుండా జగన్ రెడ్డి ట్రిక్కులు ప్రదర్శిస్తే వాటిని తనకు అనుకూలంగా మలచుకోకుండా చంద్రబాబు ఉంటారా?

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4వ పేజీలో..

గ్రూప్-2 మెయిన్స్ నేడే



మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలంటూ విశాఖలో రహదారిపై బైఠాయించిన గ్రూప్-2 అభ్యర్థులు

పరీక్ష నిర్వహణకే ఏపీపీఎస్సీ నిర్ణయం

'వాయిదా' అంటూ రోజంతా హైడ్రామా

- అభ్యర్థుల ఆందోళనలపై సర్కారులో చర్చ
- సీఎం ముందు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రస్తావన
- వాయిదా వేయాలని కమిషన్‌కు ప్రభుత్వ లేఖ
- కోడ్ నేపథ్యంలో వాయిదా వేయలేమని జవాబు

నేటి మెయిన్స్ పరీక్ష యథాతథం

గ్రూప్-2 మెయిన్స్‌పై శనివారం రోజంతా హైడ్రామా నడిచింది. పరీక్షలు ఉంటాయా? లేవా? అని అభ్యర్థులు గంటగంటకూ అయోమయానికి గురయ్యారు. వాయిదా వేయాలన్న అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో పెట్టుకుని పరీక్షలు రీషెడ్యూలు చేయాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి సర్వీస్ కమిషన్‌కు లేఖ రాసింది. శనివారం ఉదయం ఇది వెలుగులోకి రావడంతో మొదలైన గందరగోళం... చివరికి వాయిదా వేయడం సాధ్యం కాదని సాయంత్రం ఏపీపీఎస్సీ ప్రభుత్వానికి లేఖ రాయడంతో ముగిసింది. దీంతో షెడ్యూలు ప్రకారం ఆదివారం పరీక్షలు యథావిధిగా జరగనున్నాయి.



అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 2023లో జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్ రోస్టర్‌లో తప్పులున్నాయని, ఈ నోటిఫికేషన్ సరైన విధానంలో లేదని అభ్యర్థులు మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నారు. జీవో 77 ప్రకారం హారిజాంటల్ రోస్టర్ అమలు చేయాలని, కానీ పోస్టులకు అందుకు విరుద్ధంగా పాత రోస్టర్ అమలు చేశారని ఆరోపిస్తున్నారు. ఆదివారం మెయిన్స్

మిగతా 2వ పేజీలో...



'టెస్లా' రేసులో ఏపీ

- కార్ల తయారీ యూనిట్‌ను రాష్ట్రానికి తెచ్చేలా ముమ్మర ప్రయత్నాలు
- అవసరమైన భూమిని సిద్ధం చేస్తున్న ఈడీబీ
- ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలకు రెడీ
- తయారీ యూనిట్ ఆలస్యమైతే రెడీమేడ్ కార్ల దిగుమతి!
- టెస్లాను రప్పించడానికి గతంలోనే సీఎం చంద్రబాబు గట్టి ప్రయత్నాలు
- లోకేశ్ అమెరికా పర్యటనలోనూ చర్చలు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ప్రముఖ విద్యుత్తు కార్ల కంపెనీ టెస్లా తయారీ యూనిట్‌ను ఏపీకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం రేసులోకి దిగింది. ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అనంతరం టెస్లా కార్ల తయారీ యూనిట్‌ను భారత్‌లో నెలకొల్పడానికి ఆ కంపెనీ కసరత్తు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో ఆ ఈవీ కార్ల తయారీ యూనిట్‌ను ఏపీలో నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం

మిగతా 14వ పేజీలో...

క్లీన్ చీట్!

సెకీ ఒప్పందంపై జగన్ రోత పత్రిక యవ్వారం

అంతా సక్రమమే అని ఈఆర్సీ పేరిట అబద్ధాలు


The Officers from the forum secretariat comprising Sri Dr. S.K. Chatterjee, Chief, Regulatory Affairs CERC and his team of officers, Smt. Shilpa Agarwal, Joint Chief, Engineering Division, CERC, and others attended the meeting. In the WG meeting, the CERC officers apprised the WG that the application of GNA-RE by any agency exclusively involved in supply of RE power is one of the possible options for drawal of 7000 MW solar power from Rajasthan with 100 per cent waiver of ISTS charges as per the GNA Regulations. Hence, taking note of the importance of the issue, the Commission is of the view that if the SECI does not undertake the responsibility of waiver of ISTS charges, the APRAPSCOM may apply for GNA RE under clause 20.4 of GNA Regulations duly obtaining the NOC from STU to schedule 7000 MW solar power from Rajasthan to get 100 per cent waiver of ISTS charges for the agreement period as envisaged in the scheme of things.

(By Order of the Hon'ble Commission)

ప్రసార నష్టాల చార్జీల నుంచి మినహాయింపు బాధ్యత సెకీదే అని తెలుపుతూ గత ఏడాది ఆగస్టు 13న ఏపీఈఆర్సీ ఇచ్చిన ఉత్తర్వు

- చౌకధర, రాష్ట్రానికి ఆదా అంటూ మాయ మాటలు
- ప్రసార చార్జీలు వర్తించవని చెప్పినట్లు కల్పితాలు
- ఈఆర్సీ ఉత్తర్వులకు వక్రభాష్యంతో కథనం
- 'సక్రమం' అని ఎక్కడా చెప్పని నియంత్రణ కమిషన్
- హైకోర్టు పరిధిలో ఉందని.. తాము సొంతంగా రద్దు చేయలేమని మాత్రం వెల్లడి
- అందుకే... ఏఆర్ఆర్‌లో కొనుగోలు ప్రస్తావన

జగన్ రోత పత్రిక మరోసారి తన నైజాన్ని చాటుకుంది! 'సెకీ'తో కుదుర్చుకున్న అడ్డగోలు ఒప్పందాన్ని సమర్థించుకునేందుకు అబద్ధపు రాతలు రాసేసింది! ఏకంగా... ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) ఉత్తర్వులు, వ్యాఖ్యలకే వక్ర భాష్యాలు చెప్పింది. 'సెకీ ఒప్పందం సక్రమమే' అని ఈఆర్సీ చెప్పిందంటూ కల్పిత కథనాన్ని వండి వార్చింది. పనిలోపనిగా ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా అక్కసు వెళ్లగక్కింది. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా సాగిన జగన్ రోతపత్రిక అచ్చోసిన అబద్ధాలు, అసలు వాస్తవాలు ఇవీ..



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు 2021లో సెకీతో 7,000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. పేరుకే 'సెకీ'! అసలు సరఫరాదారు మాత్రం అదానీ! ఈ ఒప్పందం రాష్ట్రానికి పెనుభారంగా పరిణమిస్తుందని... పాతికేళ్లపాటు జనానికి షాకులు తప్పవని నిపుణులు హెచ్చరించారు. అంతర్రాష్ట్ర ప్రసార చార్జీల (ఐఎస్టీఎస్) రూపంలో చాలా భారం పడుతుందని తెలిపారు. భవిష్యత్తులో సౌర విద్యుత్తు ధర మరింత తగ్గే అవకాశమున్నా... ముందుచూపులేకుండా దీర్ఘకాలిక ఒప్పందం చేసుకోవడం సరికాదన్నారు. ఈ అభ్యంతరాలేవీ నాటి జగన్

మిగతా 3వ పేజీలో...



ఓఆర్ఆర్‌కు రాజముద్ర

- అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుపై కేంద్రం గజిట్ నోటిఫికేషన్ విడుదల
- 189.9 కిలోమీటర్ల అలైన్‌మెంట్‌కు ఓకే.. 5 జిల్లాల పరిధిలోని 23 మండలాలు, 121 గ్రామాల మీదుగా సాగనున్న నిర్మాణం
- త్వరలోనే భూ సేకరణ నోటిఫికేషన్ విడుదల


2

టన్నెల్‌లో ప్రాణాలు

కూలిన ఎస్ఎల్‌బీసీ సొరంగం

చిక్కుకుపోయిన 8 మంది కార్మికులు, ఉద్యోగులు

- టీబీఎం తవ్వకం జరుపుతుండగా కూలిన పైకప్పు
- ప్రాణాలతో బయటపడ్డ 46 మంది సిబ్బంది
- సొరంగంలోకి 8 మీటర్ల మేర చేరిన నీళ్లు, రాళ్లు
- 124 మీటర్ల దూరం వరకు ఊడి పడిన పెచ్చులు
- నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట సమీపంలో.. టన్నెల్ ఇన్‌లెట్ వైపు 14వ కిలోమీటర్ వద్ద ఘటన
- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- సహాయక చర్యలు ప్రారంభం.. టన్నెల్‌లోకి ఆక్సిజన్



నాగర్‌కర్నూల్/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో భారీ ప్రమాదం సంభవించింది. టన్నెల్ బోరింగ్ మెషిన్(టీబీఎం)తో సొరంగం తవ్వుతుండగా పైకప్పు కూలిపోయింది. శ్రీశైలం

మిగతా 14వ పేజీలో...

ఖాతాదారుల నగలు కొల్లగొట్టి..

14

- కుదువ అంగళ్లలో తనఖా పెట్టి..
- యూబీఐలో రూ.2.35 కోట్లు లూటీ
- తిరుపతి జిల్లా నాగలాపురంలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ ఘరానా మోసం

గుంటూరులో మరో 3 జీబీఎస్ కేసులు

14

- బాధితుల్లో గర్భిణి.. 13కు చేరిన కేసులు
- ప్రకాశం జిల్లాలో ఏఎన్ఎంకు వైరస్ లక్షణాలు

వైసీపీ అకృత్యాలకు బలైన

దళితుల కేసులు పునర్విచారణ

13

హోం మంత్రి వంగలపూడి అనిత హామీ



మిర్చి ధర సమస్యపై రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్ తదితరులు

మిర్చి పూచీ మాదే

క్వింటా రూ. 11,781 తగ్గితే కేంద్రంతో కొనిపిస్తాం: సీఎం

- రైతుల రక్షణకు సిద్ధంగా ఉన్నాం
- కోల్డ్ స్టోరేజీల్లోని మిర్చికి బ్యాంక్ రుణాలు
- కృష్ణపట్నం పోర్ట్ ద్వారా కంటైనర్ల రవాణా
- రైతులు, ఎగుమతిదారులకు సీఎం హామీ
- 4 గంటలపాటు అన్ని అంశాలపైనా చర్చ

మిర్చి రైతులను ఆదుకుంటాం

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి

అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్వింటా మిర్చి ధర రూ.11,781 కన్నా తక్కువ ఉంటే మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద కేంద్రం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కోల్డ్ స్టోరేజీల్లో

మిగతా 13వ పేజీలో...



13

పీఛేముడ్!

రేపు అసెంబ్లీకి జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు

- విపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తానని ఇన్నాళ్లూ భీష్మించిన మాజీ సీఎం
- సభ్యత్వం పోయే పరిస్థితి రావడంతో వెనక్కి!
- గవర్నర్ ప్రసంగానికి వెళ్లేందుకు నిర్ణయం
- 60 రోజులపాటు సభకు రాకపోతే సభ్యత్వం పోతుందని స్పీకర్ స్పష్టీకరణ
- దీంతో మెట్టు దిగిన వైసీపీ అధినేత
- తొలి రోజు మాత్రమే సభకు వస్తారా?
- లేక చివరి వరకూ కొనసాగుతారా?
- బెంగళూరు నుంచి నేడు తాడేపల్లికి రాక

గ్రూప్-2 మెయిన్స్ నేడే

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష జరగాల్సిన తరుణంలో శుక్రవారం నుంచి ఆందోళనలు పెరిగాయి. విశాఖపట్నం, హైదరాబాద్ సహా పలు చోట్ల నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో శుక్రవారం మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దీనిపై ఆరా తీశారు. ఏం చేస్తే నిరుద్యోగులకు మేలు జరుగుతుందనే కోణంలో పలువురు ఎమ్మెల్సీలు, అధికారులతో చర్చించారు. మార్చి 11న రోస్టర్‌పై హైకోర్టులో విచారణ ఉన్నందున అప్పటి వరకూ పరీక్షలు వాయిదా వేస్తే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. అదే విషయాన్ని ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ శుక్రవారం రాత్రి ఏపీపీఎస్సీ దృష్టికి తీసుకొచ్చారు. అయితే ప్రభుత్వం నుంచి లేఖ కావాలని ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ కోరారు. అందుకు అనుగుణంగా స్పందించిన సాధారణ పరిపాలన శాఖ(సర్వీసు అంశాలు) శుక్రవారం రాత్రి ఏపీపీఎస్సీకి వాయిదా కోరుతూ లేఖ రాసింది. "అభ్యర్థుల నుంచి అనేక వినతులు వస్తున్న నేపథ్యంలో పరీక్షలు పారదర్శకంగా, స్పష్టతతో జరుగుతాయన్న భరోసా వారికి ఇవ్వాలి. న్యాయస్థానంలో దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ముందే పరీక్షలు నిర్వహించడం సరైన విధానం కాదు. ఈ క్రమంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూలు చేసి, కౌంటర్ అఫిడవిట్‌లో స్పష్టత ఇచ్చేందుకు ప్రభుత్వానికి గడువు ఇవ్వాలి" అని లేఖలో కోరింది. 'అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకున్నాం. సమస్యను పరిష్కరిస్తాం' అని మంత్రి లోకేశ్ ట్వీట్ చేయడంతో మెయిన్ వాయిదా కోరుతున్న అభ్యర్థుల్లో నమ్మకం పెరిగింది. మరోవైపు... శనివారం చంద్రబాబు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వ హించిన టెలికాన్ఫరెన్స్‌లోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. గ్రూప్-2 మెయిన్స్ వాయిదాకోసం జరుగుతున్న ఆందోళనలను పార్టీ నేతలు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో... 'వాయిదా కోరుతూ లేఖ రాశాం! కమిషన్ దీనిపై స్పందించాలి కదా!' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అభ్యర్థుల ఆవేదనను అర్థంచేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.



విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

175 కేంద్రాల్లో పరీక్షలు

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు 175 కేంద్రాల్లో జరగనున్నాయి. అన్ని ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపికైన 92,250 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఈ నోటిఫికేషన్‌లో 905 పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఒక్కో పోస్టుకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేశారు. మెయిన్స్ పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి.

ఉదయం నుంచే హైడ్రామా

గ్రూప్-2 మెయిన్స్ అంశంపై శనివారం ఉదయం నుంచి హైడ్రామా మొదలైంది. పరీక్షలు వాయిదా వేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై అభ్యర్థుల నుంచి ఫోన్లు రావడంతో ఏపీపీఎస్సీ స్పందించింది. 'వాయిదా వార్తలు నమ్మవద్దు. వాయిదా వేసినట్లు సర్క్యులేట్ అవుతున్న నోట్ నకిలీది' అని స్పష్టంచేసింది. దీంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఆ వెంటనే కాసేపటికి శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఏపీపీఎస్సీకి రాసిన లేఖ బయటికొచ్చింది. దీంతో మళ్లీ వాయిదా ప్రచారం మొదలైంది. ప్రభుత్వమే లేఖ రాయడంతో ఇక పరీక్షలు వాయిదా పడినట్లేనని అభ్యర్థులు భావించారు. మరోవైపు ప్రభుత్వం తరఫున ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ శనివారం ఉదయం 10 గంటలకు ఏపీపీఎస్సీ కార్యాలయానికి వెళ్లారు. పరీక్షలు వాయిదా కోరుతూ ప్రభుత్వం లేఖ రాసిన సమాచారం చేరవేసేందుకు వెళ్లారు. కాగా ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ కార్యాలయానికి రాకపోవడంతో మధ్యాహ్నం 3 గంటల వరకు వేచిచూసి వెనుదిరిగారు. ఈలోగా అభ్యర్థుల నుంచి ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్, కార్యాలయానికి ఫోన్లు పోటెత్తాయి. పరీక్ష ఉందా? లేదా? అని తెలుసుకునేందుకు వేల సంఖ్యలో అభ్యర్థులు ఫోన్లు చేశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి ఏపీకి వచ్చి పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఎట్టకేలకు సాయంత్రానికి స్పందించిన ఏపీపీఎస్సీ పరీక్ష వాయిదా వేయడం సాధ్యం కాదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది.

కోడ్ ఉల్లంఘించలేం...

ప్రస్తుతం పట్టభద్ర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో... పరీక్ష వాయిదా 'కోడ్'ను ఉల్లంఘించినట్లు అవుతుందని సర్వీస్ కమిషన్ స్పష్టం చేసింది. "మెయిన్స్‌కు ఎంపిక కాని అభ్యర్థుల నుంచి పరీక్ష వాయిదా వేయాలని భారీగా వినతులు వచ్చాయి. ఈ నోటిఫికేషన్ రద్దు చేస్తే, భవిష్యత్తులో జారీ చేసే నోటిఫికేషన్‌లో అవకాశం లభిస్తుందనేది వారి ఆలోచన. దీని వెనుక కొన్ని కోచింగ్ సెంటర్ల పాత్ర కూడా ఉంది. రోస్టర్ పాయింట్ల గురించి నోటిఫికేషన్‌లో ఎక్కడా పేర్కొనలేదు. దీనిపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ, నోటిఫికేషన్ రద్దు కావాలని కోరుకుంటున్నారు. ఈ దశలో పరీక్షల నిర్వహణపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు కూడా చెప్పింది. అభ్యర్థులంతా పట్టభద్రులైనందున ఈ దశలో పరీక్షలు వాయిదా వేస్తే అది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుంది. ఏపీపీఎస్సీ కూడా ఈ పరిమితులకు కట్టుబడి ఉండాలి. అలాగే వాయిదా వేయడం వల్ల ఇప్పటికే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న 84,921 మంది అభ్యర్థులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఈ దశలో పరీక్ష వాయిదా వేయడం కష్టపడి చదివిన విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడం కిందకు రాదు' అని ఏపీపీఎస్సీ పేర్కొంది.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా కోసం అభ్యర్థుల ఆందోళన

- బెజవాడలో ఏపీపీఎస్సీ కార్యాలయం వద్ద బైఠాయింపు
- అధికారులకు వినతిపత్రం అందజేత
- విశాఖపట్నంలో హైవేపై స్తంభించిన ట్రాఫిక్

విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు రాష్ట్రంలోని పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయం వద్దకు వెళ్లిన అభ్యర్థులు చైర్‌పర్సన్ అనూరాధను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు యత్నించారు. పోలీసులు బారికేడ్లతో వారిని అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పరీక్షలు వాయిదా వేయాలని నినాదాలు చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లోని రోస్టర్ విధానంలో ఉన్న తప్పులను సవరించాలని కోరుతున్నా.. అధికారులు స్పందించడం లేదని అన్నారు. ఈ విధానంలో పరీక్షలు నిర్వహిస్తే, ఎంపికైన అభ్యర్థులు భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పరీక్షను వాయిదా వేయమని కోరిందని.. అయితే ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ మొండి వైఖరి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థుల అభ్యర్థనతో కొందరిని పోలీసులు ఏపీపీఎస్సీ కార్యాలయానికి తీసుకువెళ్లగా.. అధికారులకు వినతిపత్రం అందజేశారు. రోస్టర్ విధానంలో సవరణలు చేసిన తర్వాతే పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి వందల మంది అభ్యర్థులు విశాఖపట్నంలోని ఇసుక తోట జంక్షన్‌లో జాతీయ రహదారిపై బైఠాయించారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఎంవీపీ కాలనీలోని సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి ర్యాలీగా ఇసుక తోట జంక్షన్‌కు చేరుకున్నారు. అభ్యర్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. కాగా, రోస్టర్ సమస్య పరిష్కరించకుండా పరీక్షలు జరిగితే ఇబ్బంది అని, ఇటీవల ఝార్ఖండ్‌లో ఉద్యోగాలు ఇచ్చి రద్దు చేశారని ఏపీ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ పారా లక్ష్మయ్య పేర్కొన్నారు. పరీక్ష రద్దు కోరుతూ సీఎంవోలో, సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చానన్నారు. మరోవైపు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను ప్రభుత్వం వాయిదా వేసిందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీపీఎస్సీ కార్యదర్శి నరసింహమూర్తి విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లోకం తీరు



కన్నతండ్రిని చంపిన కొడుకు

- హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఘటన




తండ్రి మొగిలిపై దాడి చేస్తున్న సాయికుమార్

ఏఎస్‌రావునగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో అన్నను కత్తులతో పొడిచి సోదరులు నడిరోడ్డుపై హత్య చేసిన విషయం మరవక ముందే హైదరాబాద్‌లోని కుషాయిగూడలో శనివారం అదే తరహా ఘటన మరొకటి జరిగింది. ఓ యువకుడు పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కన్నతండ్రిపై 12 సార్లు కత్తితో దాడి చేసి హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా వెన్నంపల్లికి చెందిన అరెల్లి మొగిలి(45)కి భార్య లావణ్య, కొడుకు సాయికుమార్(25), కుమార్తె ఉన్నారు. జీవనోపాధి కోసం హైదరాబాద్ వలస వచ్చిన ఈ కుటుంబం లాలాపేటలో నివాసముంటోంది. సాయికుమార్ ఇంటర్ వరకు చదివాడు. తండ్రీకొడుకులు స్థానికంగా ఓ ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థలో పని చేస్తున్నారు. మద్యానికి బానిసైన మొగిలికుటుంబ సభ్యులను నిత్యం వేధిస్తున్నాడు. శనివారం ఉదయం కూడా మొగిలి డబ్బు కోసం ఇంట్లో గొడవపడ్డాడు. అనంతరం లాలాపేటలో సిటీబస్సు ఎక్కి ఈసీఐఎల్‌కు బయలుదేరాడు. గొడవ వల్ల ఆవేశంలో ఉన్న సాయికుమార్.. బైకుపై బస్సును అనుసరించాడు. కుషాయిగూడ ఈసీఐఎల్ చౌరస్తాలో బస్సు దిగిన తండ్రిపై కత్తితో దాడిచేసి చంపేశాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఓఆర్ఆర్‌కు రాజముద్ర

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుపై కేంద్రం గజిట్ నోటిఫికేషన్ విడుదల



ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో.. మైలవరం, గణపవరం, ఆగిరిపల్లె, కృష్ణవరం, మానికొండ, సేకూరు, ముస్సలూరు ప్రాంతాలు ఉన్నాయి.

- 189.9 కిలోమీటర్ల అలైన్‌మెంట్‌కు ఓకే
- ఐదు జిల్లాల పరిధిలోని 23 మండలాలు.. 121 గ్రామాల మీదుగా సాగనున్న నిర్మాణం
- త్వరలోనే భూ సేకరణ నోటిఫికేషన్ విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణానికి అడుగులు పడ్డాయి. రాజధాని అమరావతిని దేశంలోని అనేక జాతీయ రహదారులతో అనుసంధానం చేసే ఓఆర్ఆర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అమరావతి రాజధాని ప్రాంత పరిధితో పాటు, బయట కూడా కలిపి మొత్తం ఐదు జిల్లాల పరిధిలో 189.9 కిలోమీటర్ల నిడివిలో భూసేకరణకు గజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అవి ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) అప్రూవల్ కమిటీ ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భూ సేకరణకు వీలుగా రాజపత్రాన్ని వెలువరించింది. దాని ప్రకారం త్వరలోనే జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు తమ డివిజన్ల ప్రాతిపదికన భూసేకరణ నోటిఫికేషన్లను వెలువరించటానికి ఐదు జిల్లాల యంత్రాంగాలను నిర్దేశించనుంది. కొద్ది రోజుల వ్యవధిలోనే జిల్లాల వారీగా భూముల సేకరణకు ఆయా జిల్లాల కలెక్టర్లు భూసేకరణ నోటిఫికేషన్లను వెలువరించనున్నారు. కృష్ణా జిల్లాలో 4 మండలాల పరిధిలో 24 గ్రామాలు, ఏలూరు జిల్లాలో ఒక మండలం పరిధిలో 11 గ్రామాలు, ఎన్టీఆర్ జిల్లాలో 5 మండలాల పరిధిలో 28 గ్రామాలు, గుంటూరు జిల్లాలో 11 మండలాల పరిధిలో 46 గ్రామాలు, పల్నాడు జిల్లాలో రెండు మండలాల పరిధిలో 12 గ్రామాల మీదుగా అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వెళుతుంది. అవుటర్ రింగ్ రోడ్డుతో రాష్ట్ర ప్రగతి పరుగులు పెట్టనుంది. అమరావతికి దేశంలోని అనేక జాతీయ రహదారులు అనుసంధానం అవుతాయి. అనేక ఆర్థిక కారిడార్ల రహదారులు అనుసంధానం కావటంతో భవిష్యత్తులో అమరావతి అభివృద్ధికి దోహదపడనుంది. ఓఆర్ఆర్‌లో కృష్ణానదిపై 2 బ్రిడ్జిలు, 34 చోట్ల హై ఓల్టేజీ క్రాసింగ్స్, టన్నెల్స్ 3, ఆర్‌ఓబీలు 7, అండర్‌పాస్‌లు 78, చిన్న వంతెనలు 51, పెద్ద వంతెనలు 14, ఇంటర్ చేంజ్‌లు 9 వస్తాయి. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఆరువరుసల యాక్సెస్ కంట్రోల్ హైవేను నిర్మిస్తారు. భవిష్యత్తులో 8 వరుసలుగా దీనిని నిర్మిస్తారు. ప్రస్తుతం రోడ్డు వెడల్పు 70 మీటర్లుగా ఉంటుంది.

ఎన్టీఆర్ జిల్లాలో

కంచికచర్ల మండలం పరిధిలో కంచికచర్ల, పెరకలపాడు, గొట్టుముక్కల, ముస్సలూరు, మోగులూరు, కునికినపాడు గ్రామాలు, వీరులపాడు మండలం పరిధిలో పొన్నవరం, జగన్నాథపురం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, తిమ్మాపురం, గూడెం మాధవరం, అల్లూరు, నరసింహారావు పాలెం, జీ కొండూరు మండలం పరిధిలో జీ కొండూరు, కుంటుముక్కల, దుగ్గిరాలపాడు, పేత్రంపాడు, గంగినేనిపాలెం, నందిగామ, కోడూరు, మైలవరం మండలంలో మైలవరం, పొందుగల, గణపవరం గ్రామాల్లో భూ సేకరణకు గజిట్ వెలువడింది.

ఏలూరు జిల్లాలో

ఆగిరిపల్లి మండలంలో బొద్దనపల్లి, గరికపాటివారి కండ్రిక, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లె, ఆగిరిపల్లి, చొప్పరమెట్ల, నరసింగపాలెం, సగ్గూరు, క్రిష్ణవరం, సూరవరం, కలటూరు గ్రామాలు

కృష్ణా జిల్లాలో

బాపులపాడు మండలంలో బండారుగూడెం, అంపాపురం, ఉంగుటూరు మండలంలో సగ్గూరు ఆమని, బల్లిపర్రు, బూతుమిల్లిపాడు, ఉంగుటూరు మండలంలో పెద అవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు, వేలినూతల, తరిగొప్పల, వేంపాడు, బొకినాల, మానికొండ, కంకిపాడు మండలంలో మారేడుమాక, కోలవెన్ను, ప్రొద్దుటూరు, కొణతనపాడు, దావులూరు, చలివేంద్రపాలెం, నెప్పల్లి, కుందేరు, తోట్లవల్లూరు మండలంలో రొయ్యూరు, చిన్నపులిపాక, బొడ్డపాడు, నార్త్ వల్లూరు, సౌత్ వల్లూరు

గుంటూరు జిల్లాలో

మంగళగిరి మండలంలో కాజ, చినకాకాని, తాడికొండ మండలంలో పాములపాడు, వరగని, మందపాడు, మంగళగిరిపాడు, డోకిపర్రు, వినదల, పేరేచర్ల, వెలవర్తిపాడు, మేడికొండూరు, పెదకాకాని మండలంలో నంబూరు, దేవరాయభోట్లపాలెం, అనుమర్లపూడి, దుగ్గిరాల మండలంలో చిలువూరు, కంటమరాజు కొండూరు, ఈమని, చింతలపూడి, పెనుమూలి, కొల్లిపర్ర మండలంలో వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, కుంచవరం, అత్తోట, తెనాలి మండలంలో కొలకలూరు, నందివెలుగు, గుడివాడ, అంగలకుదురు,కతేవరం, సంగం జాగర్లమూడి, చేబ్రోలు మండలంలో గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, సుద్దపల్లి, శేకూరు, వట్టిచెరుకూరు మండలంలో కొర్నెపాడు, అనంతవరప్పాడు, చామళ్లమూడి, కుర్నూతల, గుంటూరు తూర్పు మండలంలో ఏటుకూరు, గుంటూరు, బుడంపాడు, గుంటూరు వెస్ట్ మండలంలో పోతూరు, అంకిరెడ్డిపాలెం.

పల్నాడు జిల్లాలో

అమరావతి మండలంలో లింగాపురం, ధరణికోట, దిడుగు, నెమలికల్లు, పెదకూరపాడు మండలంలో ముస్సాపురం, పాటిబండ్ల, జలాలపురం, కంభంపాడు, తాళ్లూరు, లింగంగుంట్ల, కాసిపాడు, బలుసుపాడు .

'స్పా' ముసుగులో హై'టెక్' వ్యభిచారం

- యువకుడి స్టింగ్ ఆపరేషన్.. సీపీకి సమాచారం
- గుట్టురట్టు చేసిన విజయవాడ పోలీసులు
- 10 మంది యువతులు, 11 మంది విటులు అరెస్టు
- విటుల్లో వైసీపీ నేత శంకర్ నాయక్




స్పాసెంటర్ తలుపు తీసే ప్రయత్నం చేస్తున్న పోలీసు

విజయవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హైటెక్ నిఘా, భద్రత మధ్య సాగుతున్న వ్యభిచారాన్ని విజయవాడ పోలీసులు బట్టబయలు చేశారు. విజయవాడ వెటర్నరీ కాలనీలోని ఫీడర్ రోడ్డులో ఉన్న మూడంతస్తుల భవనంలో గురునానక్ కాలనీకి చెందిన చలసాని ప్రసన్న భార్గవ్ స్టూడియో 9 పేరుతో స్పా సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన యువతులను ఉపాధి కల్పన పేరుతో తీసుకువచ్చి వారితో వ్యభిచారం చేయిస్తున్నాడు. అయితే, ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలను హైదరాబాద్ కు చెందిన ఓ యువకుడు స్టింగ్ ఆపరేషన్ చేసి పోలీసు కమిషనర్‌కు వీడియోలను అందజేశాడు. దీంతో మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ మూడు బృందాలతో శుక్రవారం రాత్రి స్పా సెంటర్‌లో ఆకస్మిక సోదాలు జరిపా రు. పోలీసుల రాకతో ఈ భవనం నుంచి పక్కన భవనంలోకి దాటేసిన పది మంది యువతులు, 11 మంది విటులను పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడిగా పనిచేసిన వైసీపీ నేత శంకర్ నాయక్ ఒక గదిలో మంచం కింద దాక్కోగా, పోలీసులు బయటికి లాక్కొచ్చి స్టేషన్‌కు తరలించారు. కాగా.. పోలీసులు తనిఖీలకు వస్తే ముందుగా గుర్తించడానికి స్పా సెంటర్‌కు వెళ్లే మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తలుపులను టెక్నాలజీకి అనుసంధానం చేసి, వేలిముద్రల స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు. బయట ఎవరున్నారో తెలుసుకోడానికి తలుపులకు చిన్నచిన్న అద్దాలతో కూడిన పరికరాలు అమర్చాడు. పోలీసులు వస్తే పక్కనే ఉన్న భవనం పైకి వెళ్లిపోవడానికి యువతులకు, సిబ్బందికి భార్గవ్ శిక్షణ ఇచ్చాడు. పోలీసుల సోదాలు చేయడంతో భార్గవ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. స్పా సెంటర్ మేనేజర్ దగ్గుబాటి శ్యాంను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విటులను ఆకర్షించడానికి ప్రత్యేకంగా మరో భవనంలో ముగ్గురు యువతులతో కాల్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. సీసీటీవీల ఫుటేజీ క్లౌడ్‌లో భద్రంగా ఉండేలా ఐపీ అడ్రస్‌ల ద్వారా వ్యవస్థను నిర్వహిస్తుండడం గమనార్హం.

గంజాయిపై ఉక్కుపాదం!

- అంతర్రాష్ట్ర ముఠాల ఆట కట్టిస్తున్నాం: డీజీపీ



యడ్లపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన గంజాయిని శనివారం పల్నాడు జిల్లాలోని జిందాల్ అర్బన్ వేస్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంటులో దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఈగిల్ ఐజీ ఆకె రవికృష్ణతో కలసి డీజీపీ పరిశీలించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై ఈగిల్ సంస్థ ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు, ఈగిల్ సంస్థ సహకారంతో అంతర్రాష్ట్ర ముఠాల ఆట కట్టిస్తున్నా మన్నారు. గతంలో రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణా, విక్రయాలు పెద్ద ఎత్తున జరిగేవని, ప్రత్యేక దృష్టి పెట్టడంతో రాష్ట్రంలో గంజాయి సాగుతగ్గిందని చెప్పారు. అయితే, ఒడిసా నుంచి పెద్ద ఎత్తున రవాణా అవుతోందని, ఇతర రాష్ట్రాలకు సైతం మన రాష్ట్రం ద్వారానే రవాణా జరుగుతోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో కలసి సమన్వయంతో పనిచేసి గ్యాంగ్‌లను పట్టుకుంటున్నామన్నారు. అలా ఇప్పటి వరకు లక్ష కేజీల గంజాయిని సీజ్ చేసి, అందులో 70 వేల కేజీల గంజాయిని దహనం చేసినట్టు చెప్పారు. 183 కేసులకు సంబంధించి పట్టుబడిన రూ.1.87కోట్ల విలువైన 3,737 కేజీల గంజాయి, 4.22 కేజీల లిక్విఫైడ్ గంజాయిని జిందాల్ పవర్ ప్లాంటులో శనివారం దహనం చేసినట్లు వివరించారు.




మయూర వాహనంపై దర్శనమిస్తున్న భ్రమరాంబ, మల్లికార్జున స్వామిఅమ్మవార్లు.. టీటీడీ తరఫున పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈఓ శ్యామలరావు

మయూర వాహనంపై మల్లన్న విహారం

శ్రీశైలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు శనివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజల అనంతరం క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. కాగా.. శనివారం ఉదయం కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరఫున కార్యనిర్వహణాధికారి కె.పెంచల కిషోర్.. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ జె.శ్యామలరావు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రావణవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.

వైభవంగా వాయులింగేశ్వరుడి ధ్వజారోహణం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాయులింగేశ్వరుడి ధ్వజారోహణ ఘట్టం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. స్వామివారి గర్భాలయం ఎదురుగా ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొడి వస్త్రాలను ధ్వజస్తంభానికి అధిరోహింపజేసి సకల దేవతలకు ఆహ్వానం పలికారు. భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.



శ్రీకాళహస్తి ఆలయంలో ధ్వజస్తంభానికి అధిరోహింపజేసిన కొడివస్త్రాలు

ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు నిధులు కేటాయించండి: ఏపీ వీఆర్వోల సంఘం డిమాండ్

విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ, సరెండర్ లీవ్స్ తదితర బకాయిలకు బడ్జెట్ కేటాయించి నిధులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేసేలా సీఎం చంద్రబాబుతో చర్చించాలని కోరారు.

క్లీన్ 'చీట్'!

(మొదటి పేజీ తరువాయి)

సర్కారు పట్టించుకోలేదు. ఇతర చార్జీలు ఉండవని, ట్రాన్స్‌మిషన్ చార్జీలపై పూర్తి మినహాయింపు ఉంటుందని సెకీతో డిస్కమ్‌లు ఒప్పందం చేసుకునే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ఇంధన శాఖ పేర్కొంది. అవన్నీ అవాస్తవాలని తర్వాత వెల్లడైంది. సెకీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం వెనుక భారీగా అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ హైకోర్టులోనూ, కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లోనూ పిటిషన్లు వేశారు. టీడీపీ నేత, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై ఇంకా విచారణ జరుగుతోంది. అలాగే... సెకీతో ఒప్పందాల కోసం 'అదానీ' సంస్థ ప్రభుత్వంలో ఉన్న వాళ్లకు లంచాలు ఇచ్చిందంటూ ఏకంగా అమెరికా దర్యాప్తు సంస్థ, న్యాయ విభాగం బయటపెట్టాయి. దీంతో ఇది అంతర్జాతీయ స్థాయి వివాదంగా మారింది.

మసిపూసి... మాయ చేసి!

అసలు విషయం, వివాదం అలాగే ఉన్నప్పటికీ... జగన్ రోత పత్రిక మాత్రం 'సెకీ ఒప్పందానికి ఈఆర్‌సీ క్లీన్‌చిట్ ఇచ్చేసింది' అంటూ శనివారం ఒక అబద్ధాల కథనం ప్రచురించింది. 'ఈఆర్సీ చెప్పింది' అంటూ తనకు ఇష్టమొచ్చినట్లు, తనకు తోచినట్లుగా రాసేసుకుంది. జగన్ పత్రిక చెప్పినట్లుగా... 'సెకీ ఒప్పందం సక్రమమే, అందులో ఎలాంటి లోపాలు లేవు, అందువల్ల రద్దు చేయడం కుదరదు' అని ఏపీఈఆర్సీ ఎక్కడా చెప్పలేదు. ఈ ఒప్పందానికి క్లీన్ చిట్ ఇవ్వలేదు. దీనిపై హైకోర్టులో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలైనందున తాను సొంతంగా ఈ ఒప్పందాన్ని రద్దు చేయలేనని స్పష్టం చేసింది.

జగన్ పత్రిక అబద్ధాలు

- సెకీ ఒప్పందం సక్రమమేనని విద్యుత్ నియంత్రణ మండలి తేల్చి చెప్పింది. ఎలాంటి లోపాలు లేవని, అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని, కాబట్టి రద్దు చేయడం కుదరదని పేర్కొంది.
- జగన్ ముందు చూపు వల్ల తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం జరిగింది.
- రాష్ట్ర చరిత్రలోనే కారుచౌక ఒప్పందం. ఖజానాకు రూ.1.10 లక్షల కోట్లు ఆదా.

ఇవీ వాస్తవాలు

- సెకీతో ఒప్పందానికి ఈఆర్సీ క్లీన్ చిట్ ఇచ్చినట్లుగా 'రోత పత్రిక' ఒక చిత్రాన్ని ప్రచురించింది. అందులో అక్షరం అక్షరం చదివినా... ఎక్కడా 'క్లీన్ చిట్' ఇచ్చినట్లు కనిపించదు. ఒప్పందం నేపథ్యం, అభ్యంతరాలను వివరిస్తూ... కోర్టు పరిధిలో ఉన్నందున తనంతట తానుగా ఒప్పందం రద్దు చేయలేనని మాత్రమే తెలిపింది.
- 2021లో సెకీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం ప్రకారం యూనిట్‌కు రూ.2.49 చెల్లించాలి. అప్పటికే గుజరాత్ సెకీతో యూనిట్‌కు రూ.1.90కే ఒప్పందం చేసుకుంది. అంటే... గుజరాత్ కంటే 59 పైసలు ఎక్కువ ధరకు. మరి... ఇది చౌక విద్యుత్తు ఎలా అవుతుంది?
- ప్రజలపై భారం పడేలా మార్కెట్ రేటు కంటే ఎక్కువ ధరకు ఒప్పందం. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.1.25 లక్షల కోట్ల భారం పడుతుందని నిపుణుల అంచనా!

రోత పత్రిక: "సెకీ విద్యుత్ సేకరణలో లంచాలకు సంబంధించి మీడియా కథనాలను బట్టి ఏపీఈఆర్‌సీ ఇచ్చిన ఆమోదాన్ని రద్దు చేయాలని కొందరు కోరారు. దీంతో ఈ పీఎస్‌ఏపై ఏపీఈఆర్‌సీ మరోసారి దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించింది" అని ఈఆర్‌సీ పేర్కొన్నట్లు రాశారు.

వాస్తవం: సెకీ ఒప్పందంపై అభ్యంతరాలు రావడం, దానిని రద్దు చేయాలని కోరడం నిజమే. సెకీ ఒప్పందంపై ఇప్పటికీ హైకోర్టు ఎలాంటి నిర్ణయం వెలువరించలేదు. హైకోర్టు తుది తీర్పునకు లోబడే ఒప్పందం అమలవుతుందని ఈఆర్‌సీ తేల్చి చెప్పింది. అదే సమయంలో... లంచాలు ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో ఒప్పందాన్ని తమంతట తాము రద్దు చేయలేమని తెలిపింది. దీనికి కారణం... ఈ వివాదం కోర్టు పరిధిలో ఉండటమే. అయినా సరే... 'హైకోర్టు తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించింది' అన్నట్లుగా రోత పత్రిక రాసేసింది. ఏపీ ఈఆర్సీ పరిశీలించిన తీర్పులేమిటో వారికే తెలియాలి.

రోత పత్రిక: సెకీ విద్యుత్ కొనుగోలుకు అనుమతించాల్సిందిగా డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. అందువల్ల ఈ ఏడాది 4వేల మెగావాట్లను విద్యుత్ సేకరణ ప్రణాళికలో చేర్చకపోవడానికి ఎటువంటి కారణం కనిపించడంలేదు.

రోత పత్రిక: కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశాలు, సెంట్రల్ రెగ్యులేషన్ కమిషన్, జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ నిబంధనలు, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ప్రకారం... సెకీ విద్యుత్తుకు అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలు (ఐఎస్‌టీఎస్) వర్తించవు' అని ఈఆర్సీ పేర్కొన్నట్లు రోత పత్రిక వెల్లడించింది..

వాస్తవం: ఇదో పెద్ద, శుద్ధ అబద్ధం. సెకీ విద్యుత్తుకు ఐఎస్‌టీఎస్ నుంచి మినహాయింపు ఉందని ఈఆర్సీ ఎక్కడా చెప్పలేదు. దీనిపై గత ఆగస్టు 13న ఒక స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఐఎస్‌టీఎస్ చార్జీల మినహాయింపు పొందాల్సిన బాధ్యత సెకీదే అని తెలిపింది. అలా చేయలేకపోతే... జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జీఎన్‌ఏ) రెగ్యులేషన్స్‌లోని 20.4 క్లాజ్ ప్రకారం స్టేట్ ట్రాన్స్‌మిషన్ యూనిట్ (ఎస్‌టీయూ)నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకుని 'జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్'కు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్‌ఏపీఎస్ సీఓఎం (గ్రామీణ వ్యవసాయ విద్యుత్ సరఫరా సంస్థ) కు సూచించింది. అంతే తప్ప... సెకీ ఒప్పందానికి ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఉందని ఈఆర్సీ ఎక్కడా చెప్పలేదు. 'కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశాలు, కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ జీఎన్ఏ నిబంధనలు, సెకీ ఒప్పందంలోని అంశాల మేరకే ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఉండాలి' అని ఈఆర్సీ అభిప్రాయపడినట్లు రోత పత్రిక ప్రచురించిన ఉత్తర్వుల భాగంలోనే ఉంది. (జీఎన్ఏ నిబంధనలు ఇంకా ఖరారు కాలేదు)

వాస్తవం: సాంకేతికంగా చూస్తే సెకీతో ఒప్పందం అమలులో ఉన్నట్లే. దీనిని ఆపివేస్తూ ఎలాంటి ఉత్తర్వులూ, తీర్పులూ లేవు. అమలులో ఉన్న ఇతర ఒప్పందాల ప్రకారం విద్యుత్ సమీకరణకు అవకాశం కల్పించినట్లే 'సెకీ' ఒప్పందాన్నీ ఏఆర్ఆర్‌లో చేర్చారు. ఇది... సెకీ డీల్‌కు క్లీన్ ఇచ్చినట్లు కాదు.

కిడ్నాప్, హత్యాయత్నం కేసులో వైసీపీ కౌన్సిలర్ అరెస్ట్

- ఈ నెల 5న తెనాలిలో వ్యక్తి అపహరణ, కారులోనే దాడి
- బాధితుడి ఫిర్యాదుతో నలుగురిపై కేసు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డబ్బుకోసం పట్టపగలే ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి కారులో చిత్రహింసలు పెట్టిన కేసులో వైసీపీ కౌన్సిలర్, మరొక వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ నెల 5వ తేదీన గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన ఈ సంఘటన సంచలనం కలిగించింది. పోలీసులు బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, వైసీపీకి చెందిన తెనాలి మున్సిపల్ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ బేగ్‌తో పాటు షేక్ రహమాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. తెనాలి త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు కథనం మేరకు.. వైసీపీ కౌన్సిలర్ అహ్మద్‌బేగ్ ఈ నెల 5న వార్ఫురోడ్డులో పనిచేసుకుంటున్న కార్పెంటర్ షేక్ మస్తాన్ వలిని పట్టపగలే కారులో బలవంతంగా ఎక్కించుకుని తీసుకెళ్లారు. తెనాలి నుంచి విజయవాడ వరకూ కారులోనే చితకబాదుతూ డబ్బులు డిమాండ్ చేశాడు. విజయవాడలో చెన్నై నుంచి రావాల్సిన కీలక వ్యక్తి రాలేదన్న కారణంతో వారు డిమాండ్ చేసిన డబ్బు ఇవ్వలేనన్న బాధితుడితో రూ.10 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని తిరిగి తెనాలిలో వదిలిపెట్టారు. బాధితుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన తరువాత పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దీనిపై కేసు నమోదైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న అహ్మద్ బేగ్‌పై గతంలో రెండు కిడ్నాప్ కేసులున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు దౌర్జన్యాలకు పాల్పడడంతో అతనిపై రౌడీషీట్ కూడా తెరిచారు. శనివారం మొగల్ అహ్మద్, రహమాన్ తెనాలి వచ్చినట్టు సమాచారం అందడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు షేక్ ఇర్ఫాన్, షేక్ హుమయున్ క్రిస్టీ పరారీలో ఉన్నారని వీరిని కూడా అరెస్ట్ చేస్తామని సీఐ రమేష్‌బాబు చెప్పారు.

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో ఏపీటీఎఫ్-257 మిలాఖత్

- ఏపీటీఎఫ్-1938 సంఘం ఆరోపణ

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో ఏపీటీఎఫ్-257 మిలాఖత్ అయ్యిందని ఏపీటీఎఫ్-1938 సంఘం ఆరోపించింది. ఏపీటీఎఫ్-1938తో తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ఏపీటీఎఫ్-257 ప్రకటన చేసిన నేపథ్యంలో ఏపీటీఎఫ్-1938 సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కౌంటర్ ఇచ్చారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన రూ.వేల కోట్ల బకాయిలు, పీఆర్సీ, సీపీఎస్ ఇతరత్రా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అడగకుండా పాలకవర్గంతో ఏపీటీఫ్-257 మిలాఖత్ అయ్యిందని విమర్శించారు. దీనిపై ఉపాధ్యాయ వర్గం నిలదీయడంతో దానిని జీర్ణించుకోలేక తమ సంఘంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి: సీపీఐ రామకృష్ణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు నిచ్చారు. గుంటూరులో రెండు రోజులు పాటు జరిగే ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ (ఆంధ్రా, తెలంగాణ) వర్కింగ్ కమిటీ సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై మార్చి 24, 25 తేదీలలో జరిగే సమ్మెకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ బ్యాంకుల్లో సిబ్బందిని తగ్గించడం అంటే సేవలను కూడా తగ్గించడమేనన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే

RK



కొత్తపలుకు

వికటించిన వీధి నాటకం!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై దాడిని ఉధృతం చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎదురైన అనూహ్య పరాజయం నుంచి కోలుకున్న ఆయన తనదైన శైలిలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మాటలు, చేష్టలు అదుపు తప్పుతున్నాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో తాను అధికారంలోకి వచ్చేసినట్టేనని అతి విశ్వాసంతో ఉండిన ఆయన ఓడిపోయారు. దీంతో జగన్‌రెడ్డి పనైపోయిందని భావించిన చంద్రబాబు నాయుడు ఆయనను పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ప్రశాంత్ కిశోర్ మార్గదర్శకత్వంలో జగన్‌రెడ్డి అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై విష ప్రచారం చేశారు. వంచనతో కూడిన రాజకీయాలతో ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లో పెంచగలిగారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో చంద్రబాబు కథ అయిపోయిందని భావించిన జగన్‌రెడ్డి తనదైన శైలిలో కక్ష రాజకీయాలకు

> 2004కు ముందు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక హత్య కేసులో జైల్లో ఉన్న గౌరు వెంకటరెడ్డిని పరామర్శించి రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఆయన చర్యకు మద్దతు లభించింది. తనను నమ్ముకున్న వారి కోసం రాజశేఖరరెడ్డి ఎంత దూరమైనా వెళతారన్న పేరు వచ్చింది. ఇప్పుడు తండ్రి బాటలోనే జగన్ పయనించే ప్రయత్నం చేయాలనుకుంటున్నట్టుగా ఉంది. అయితే పరామర్శకు ఆయన ఎంచుకున్న మనుషుల గతాన్ని ప్రజలు మరిచిపోకపోవడం వల్ల సదరు ప్రయత్నాలు వికటిస్తున్నాయి. ఎంపీగా ఉన్నప్పుడు నందిగం సురేశ్ రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు వ్యతిరేకంగా అరాచకంగా ప్రవర్తించారు. వంశీ విషయం కూడా అందరికీ తెలిసిందే. నోటికి హద్దూ పద్దూ లేకుండా చంద్రబాబు కుటుంబంపై అవాకులు చవాకులు పేలారు. మహిళలను అవమానించారు. తమకు జరిగిన అవమానాలను చంద్రబాబు గానీ, లోకేశ్ గానీ ఎలా మరిచిపోతారు?

తెర లేపారు. తన సన్నిహితులు వారించినా వినకుండా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబును అరెస్టు చేయించి జైల్లో పెట్టారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీతో సత్సంబంధాలు ఉండటంతో జగన్‌రెడ్డి ఆడింది ఆట పాడింది పాటగా సాగింది. 2024 ఎన్నికల నాటికి పరిస్థితులు మారిపోయాయి. 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీతో కలిసి పోటీ చేసినా, ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. ఈ క్రమంలో చంద్రబాబు భారతీయ జనతా పార్టీకి దూరమయ్యారు. బీజేపీతో నేరుగా పొత్తు లేకపోయినా ఐదేళ్ల పాటు కేంద్రంలో ప్రభుత్వానికి జగన్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. కేంద్రం కూడా జగన్‌రెడ్డికి అండగా నిలబడింది. 2014 ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కలిసి పోటీ చేసినా, ఆ తర్వాత వాటికి అంత ప్రాధాన్యం ఉండేది కాదు. 2019 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించడంతో ప్రధాని నరేంద్ర మోదీ సర్వం తానై వెలుగొందారు. 2024 నాటికి పరిస్థితులు తలకిందులయ్యాయి. భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. 2019 ఎన్నికల్లో తాను ఈసడించుకుని దూరం పెట్టిన తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ప్రధాని మోదీ స్వయంగా నిర్ణయించుకున్నారు. మూడవసారి తన నేతృత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకమైంది. బిహార్‌లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీయూ మద్దతు కూడా అవసరం అయినప్పటికీ ఇటీవలికాలంలో నితీశ్ ఆరోగ్యం క్షీణించడంతో కేంద్రంలో, ముఖ్యంగా ఎన్డీయేలో చంద్రబాబుకు ప్రాధాన్యం ఏర్పడింది. చంద్రబాబు కూడా 2019 నాటి అనుభవంతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో సత్సంబంధాలతో ముందుకు వెళుతున్నారు. గతానికి భిన్నంగా ప్రధాని మోదీ కూడా ముఖ్యమైన సందర్భాలలో ఎన్డీయేను ప్రొజెక్ట్ చేయడం మొదలుపెట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ ముఖ్యమంత్రుల ప్రమాణస్వీకారోత్సవాలకు ఎన్డీయే నేతలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. జాతీయ స్థాయిలో ఎన్డీయేకు పోటీగా రూపుదిద్దుకున్న ఇండియా కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇండియా కూటమిలో బలంగా కనిపించిన కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల్లో ఓటమిపాలవడంతో భారతీయ జనతా పార్టీని ఇప్పుడు ఢీకొనగల నాయకులు జాతీయ స్థాయిలో కొరవడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ రాష్ట్రాలలో బలంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో ప్రభావం చూపగల నాయకులు కాదు. ఈ క్రమంలో ప్రధాని తదుపరి టార్గెట్ మమతా బెనర్జీ కావొచ్చు. గతంలో భారతీయ జనతా పార్టీని మాత్రమే బలోపేతం చేయడానికి ప్రయత్నించిన ప్రధాని మోదీ ఇప్పుడు ఎన్డీయేను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చంద్రబాబుకు మరింతగా ప్రాధాన్యం ఇస్తున్నారు. కేంద్రంలో తనకు పెరిగిన పరపతితో రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలెట్టారు. ఫలితంగా కేంద్రం నుంచి వివిధ పథకాలకు భారీగా ఆర్థిక సహకారం అందుతోంది. ప్రతిపాదిత పథకాలన్నీ కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో అభివృద్ధి పుంజుకుంటుంది. లక్ష కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి వస్తాయి.

మా సీఎం వేరే...!

జాతీయ స్థాయి పరిణామాలను, కేంద్రంలో పెరిగిన చంద్రబాబు ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి దాడిని ఉధృతం చేశారు. ఈ క్రమంలో ఆయన ఎంచుకున్న రెండు కార్యక్రమాలూ బెడిసికొట్టాయి. ఒక కేసులో అరెస్టయిన వల్లభనేని వంశీని జైల్లో పరామర్శించిన జగన్‌రెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. వంశీని అరెస్టు చేసి జైల్లో పెట్టిన అధికారులు పదవీ విరమణ చేసినా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దుస్తులు ఊడదీసి నిలబెడతానని హెచ్చరించారు. దీనిపై పోలీసు అధికారుల సంఘం ఘాటుగా స్పందించింది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన నందిగం సురేశ్, వల్లభనేని వంశీ వంటి వారిని పరామర్శించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడమే జగన్‌రెడ్డి చేసిన తప్పు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని దారుణంగా అవమానించిన వల్లభనేని వంశీపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? అని కూటమి ప్రభుత్వంపై మరోవైపు ఒత్తిడి పెరిగింది. చంద్రబాబు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారంటూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో ఏకంగా పోస్టులే పెట్టారు. అయితే కార్యకర్తల వలె ఆవేశపడకుండా చంద్రబాబు సమయం, సందర్భం కోసం వేచి చూశారు.



కిడ్నాప్ కేసులో వంశీ చిక్కుకోగానే అరెస్టు చేయించారు. అధికారంలో ఉన్నప్పుడు గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసీపీ దాడి సందర్భంగా ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ అనే వ్యక్తిని బెదిరించి ఫిర్యాదును ఉపసంహరింపజేయించిన వల్లభనేని వంశీ మొత్తంమీద చంద్రబాబు విసిరిన వలలో చిక్కుకున్నారు. ఈ క్రమంలో జైలులో ఉన్న వంశీని జగన్‌రెడ్డి పరామర్శించారు. వంశీపై తప్పుడు కేసు పెట్టి అన్యాయంగా అరెస్టు చేశారని జగన్‌రెడ్డి విమర్శించిన కొద్దిసేపటికే హైదరాబాద్‌లోని మై హోం బూజా అపార్ట్‌మెంట్‌లోని లిఫ్టులో సత్యవర్ధన్‌ను వెంటబెట్టుకొని వంశీ తీసుకువెళ్లిన వీడియో ఫుటేజ్‌ను మంత్రి కొల్లు రవీంద్ర మీడియాకు విడుదల చేశారు. దీంతో వంశీని అన్యాయంగా అరెస్టు చేశారన్న జగన్ ఆరోపణలకు విలువ లేకుండా పోయింది. 2014–2019 మధ్య కాలంలో జగన్‌రెడ్డి ఇలాంటి విన్యాసాలు చేసినప్పుడు అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు అండ్ కో కౌంటర్ ఎటాక్ చేయలేదు. దీంతో ఇప్పుడు జగన్‌రెడ్డి తనకు మాత్రమే సొంతమైన వంచన రాజకీయాలకు మళ్లీ శ్రీకారం చుట్టారు. అయితే జగన్‌రెడ్డికి గ్రహబలం ఈసారి అనుకూలంగా ఉన్నట్టు లేదు. విజయవాడ నడి వీధుల్లో జగన్‌రెడ్డి రక్తి కట్టించాలనుకున్న సన్నివేశాలు వికటించాయి. ఎన్నికలకు ముందు 'మా ఓటర్లు వేరే ఉన్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు అనేవారు. ఇప్పుడు జగన్‌రెడ్డి మద్దతుదారులు కూడా 'మా ముఖ్యమంత్రి వేరే ఉంటారు' అని భావిస్తున్నట్టుగా ఉన్నారు. సాధారణ ఎన్నికలకు కొంచెం ముందు ప్రతిపక్షంలో ఉన్న నాయకుడిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినాదాలు చేస్తే అర్థం చేసుకోవచ్చు కానీ ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలలకే, అది కూడా 11 సీట్లు మాత్రమే గెలుచుకున్న ఒక వ్యక్తిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినదించడం, అలా నినాదాలు చేసిన, చేయించుకున్న వారి మనోవికారాలకు అద్దంపడుతుంది. ఇలాంటి నినాదాలు జగన్‌రెడ్డికి ఆనందాన్ని ఇస్తూండవచ్చు

> జగన్‌రెడ్డి వద్ద విలపించిన ఆ పాప చదువు నిజంగానే ఆగిపోయే పరిస్థితి ఉంటే ఆ పిల్ల చదువు ఖర్చులకు జగన్‌రెడ్డి ఎందుకు సహాయం చేయలేదు? ఆ మాత్రం స్తోమత జగన్‌రెడ్డికి లేదా? లేక ఆయనలో మానవత్వం అనేది మచ్చుకైనా లేదా? స్క్రీన్‌ప్లే, డైరెక్షన్‌లో ఎక్కడో లోపం జరిగింది. స్క్రీన్‌ప్లే పకడ్బందీగా రూపొందించి ఉంటే పక్కన ఉన్న వారి జేబులోంచి డబ్బు తీసి జగన్‌రెడ్డి సదరు పిల్లకు ఇచ్చి ఉండేవారు. చంద్రబాబు మోసం చేశారనే అనుకుందాం. కరుణామయుడు, పేదల పెన్నిధిగా చెప్పుకొనే జగన్‌రెడ్డి ఆ పిల్ల చదువు కోసం 15 వేలు ఇవ్వలేరా? అయినా పుచ్చుకోవడం తప్ప ఇవ్వడం తెలియని జగన్‌కు ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తాయి? 2014–19 మధ్య కాలంలో ప్రదర్శించిన వంచనతో కూడిన వీధి నాటకాలనే మళ్లీ ప్రదర్శించాలని జగన్ అండ్ కో అనుకోవడమే ఇప్పుడు చేస్తున్న తప్పు. నిజానికి జగన్ వెంట ఇప్పుడు కనిపిస్తున్న వారి పట్ల ప్రజలకు సదభిప్రాయం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు ప్రవర్తించిన తీరును ప్రజలు ఇంకా మరచిపోలేదు. అధికార మదంతో విర్రవీగిన వారిని వెంటబెట్టుకొని తిరగడం వల్ల జగన్‌రెడ్డికి నష్టమే గానీ లాభం ఉండదు.

గానీ, వినేవారికి ఎబ్బెట్టుగా ఉంటాయి. ఇలాంటి లేకి పోకడలు పోయిన వారిని వారించి ఉంటే గత ఎన్నికల్లో జగన్‌రెడ్డికి ఇంతటి పరాభవం జరిగి ఉండేది కాదు. చంద్రబాబు, లోకేశ్ కంటే అందంగా ఉంటారు కనుక కొడాలి నాని, దేవినేని అవినాశ్‌ను కూడా త్వరలో అరెస్టు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రోతగా ఉన్నాయి. నీకంటే చంద్రబాబు అందంగా ఉంటారని అప్పట్లో ఆయనను అరెస్టు చేయించావా? అని ఎవరైనా ప్రశ్నిస్తే జగన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారు? తాను సెటైర్లు వేశానని జగన్‌రెడ్డి అనుకొని ఉండవచ్చు గానీ ఆయన వ్యాఖ్యలు విన్న వారికి కంపరం కలిగించాయి. ఈ సందర్భంగానే జగన్ అండ్ కో ప్రదర్శించిన మరో సన్నివేశం కూడా వికటించింది. 8వ తరగతి చదువుతున్న ఒక చిన్న పిల్లను తీసుకొచ్చి 'జగన్ మామయ్యా నాకు అమ్మ ఒడి రావడం లేదు' అని విలపింపజేశారు. 2014–19 మధ్య కాలంలో ఇలాంటి నాటకాలకే తెర లేపిన జగన్ అండ్ కో ఇప్పుడు అవే నాటకాలను ప్రదర్శించడం మొదలుపెట్టారు. అప్పట్లో ఇలాంటి నాటకాలను పట్టించుకోని తెలుగుదేశం పార్టీ గానీ, వారి సోషల్ మీడియా గానీ ఇప్పుడు దీటుగా స్పందించి ఆ పాప పూర్వాపరాలను బయటపెట్టింది. జగన్‌రెడ్డిని హత్తుకుని విలపించిన ఆ పాప తండ్రి, మేనమామ కరుడుగట్టిన వైసీపీ అభిమానులు. అమ్మ ఒడి రావడం లేదని ఆ పిల్ల ఏడుస్తూ చెబుతున్నప్పుడు తండ్రి, మేనమామ నవ్వడం కనిపించింది. అమ్మ ఒడి రానందున ఆ పిల్ల చదువు నిజంగా ఆగిపోయే పరిస్థితే ఉంటే వారలా నవ్వుకోరు కదా? నిజానికి జగన్‌రెడ్డి కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఒడి అమలు చేయలేదు. 2020 నుంచే అమలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని ఈ ఏడాది జూన్ నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. మొత్తంమీద విజయవాడ నడివీధుల్లో జగన్ అండ్ కో ప్రదర్శించిన వీధి నాటకం వికటించింది. జగన్‌రెడ్డి వద్ద విలపించిన ఆ పాప చదువు నిజంగానే ఆగిపోయే పరిస్థితి ఉంటే ఆ పిల్ల చదువు ఖర్చులకు జగన్‌రెడ్డి ఎందుకు సహాయం చేయలేదు? ఆ మాత్రం స్తోమత జగన్‌రెడ్డికి లేదా? లేక ఆయనలో మానవత్వం అనేది మచ్చుకైనా లేదా? స్క్రీన్‌ప్లే, డైరెక్షన్‌లో ఎక్కడో లోపం జరిగింది. స్క్రీన్‌ప్లే పకడ్బందీగా రూపొందించి ఉంటే పక్కన ఉన్న వారి జేబులోంచి డబ్బు తీసి జగన్‌రెడ్డి సదరు పిల్లకు ఇచ్చి ఉండేవారు. చంద్రబాబు మోసం చేశారనే అనుకుందాం. కరుణామయుడు, పేదల పెన్నిధిగా చెప్పుకొనే జగన్‌రెడ్డి ఆ పిల్ల చదువు కోసం 15 వేలు ఇవ్వలేరా? అయినా పుచ్చుకోవడం తప్ప ఇవ్వడం తెలియని జగన్‌కు ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తాయి? 2014–19 మధ్య కాలంలో ప్రదర్శించిన వంచనతో కూడిన వీధి నాటకాలనే మళ్లీ ప్రదర్శించాలని జగన్ అండ్ కో అనుకోవడమే ఇప్పుడు చేస్తున్న తప్పు. వల్లభనేని వంశీపై మెజారిటీ ప్రజల్లో సదభిప్రాయం లేదు. అలాంటి వంశీ కోసం జగన్ అండ్ కో వీధి నాటకాలకు తెర తీయడం రెండో పొరపాటు. నిజానికి జగన్ వెంట ఇప్పుడు కనిపిస్తున్న వారి పట్ల ప్రజలకు సదభిప్రాయం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు ప్రవర్తించిన తీరును ప్రజలు ఇంకా మరచిపోలేదు. అధికార మదంతో విర్రవీగిన వారిని వెంటబెట్టుకొని తిరగడం వల్ల జగన్‌రెడ్డికి నష్టమే గానీ లాభం ఉండదు.

> ఎన్డీయే బలపడటం ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యం. ఈ మార్పును అర్థం చేసుకోకుండా జగన్‌రెడ్డి గతంలో వలె కాలం చెల్లిన ట్రిక్కులు ప్రదర్శిస్తే వాటిని తనకు అనుకూలంగా మలచుకోకుండా చంద్రబాబు ఉంటారా?

'ఘాటు' కౌంటర్!

ఇక గుంటూరు మిర్చియార్డు సందర్శనకు జగన్‌రెడ్డి మందీ మార్బలంతో వెళ్లి హడావిడి చేశారు. తన హయాంలో మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించి ఆనందంగా ఉండేవారని, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో మిర్చి రైతులను పట్టించుకోవడం లేదని జగన్‌రెడ్డి తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఈ విమర్శలు చేసి ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకునే లోగానే జగన్‌రెడ్డి హయాంలో మిర్చి పంటకు క్వింటాల్‌కు 7,000 రూపాయలను మాత్రమే ధరగా నిర్ణయిస్తూ అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవోను అధికార పక్షం బయటపెట్టింది. దీంతో జగన్ అండ్ కోకు మాట పడిపోయింది. అదే సమయంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి మిర్చి రైతులను ఆదుకోవలసిందిగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కోరారు. చంద్రబాబు నుంచి విజ్ఞప్తి అందిన వెంటనే కేంద్రమంత్రి మరుసటి రోజే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యపై చర్చించారు. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణలో కూడా, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా ఈ ఏడాది మిర్చి పంటకు ధర పడిపోయింది. పత్తి, మిర్చి వంటి పంటలకు కొన్ని సందర్భాలలో అధిక ధర పలకడం, మరికొన్ని సందర్భాలలో ధరలు పడిపోవడం పరిపాటే. ఎన్నికల నియమావళి కారణంగా మిర్చి యార్డు సందర్శనకు అధికారులు అనుమతులు నిరాకరించినా జగన్ అండ్ కో లెక్కలేనితనంతో వ్యవహరించారు. దీంతో ఎన్నికల కమిషన్ అధికారులు జగన్ అండ్ కోపై కేసు పెట్టారు. ఇదే పని జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు చేసి ఉంటే అరెస్టు చేసి ఉండేవారు. లేదా చంద్రబాబు ఇల్లు దాటకుండా గేటుకు తాళం వేయించి ఉండేవారు. ఇప్పుడు చంద్రబాబు తన చేతికి మట్టి అంటకుండా కాగల కార్యం ఎన్నికల కమిషన్ అధికారులతో చేయించారు. అనుభవానికి, అనుభవ లేమికి ఉన్న తేడా ఇది. మొత్తంమీద కూటమి ప్రభుత్వంపై దండయాత్రకు జగన్‌రెడ్డి అండ్ కో చేసిన రెండు కార్యక్రమాలూ వికటించాయి. కేంద్రం వద్ద తనకు ఉన్న పలుకుబడిని స్వప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కోసం ఉపయోగించడంలో చంద్రబాబుకు ట్రాక్ రికార్డు ఉంది. 1999–2004 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న వాజపేయి ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి పనికి ఆహారం పథకం కింద భారీగా బియ్యం కేటాయించేలా కృషి చేశారు. ఇప్పుడు కూడా ఆ దిశగానే కృషి చేస్తున్నారు. విశాఖ ఉక్కుకు ప్రైవేటు ముప్పు తప్పించగలిగారు. పోలవరం, రాజధానికి నిధులు సాధించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇప్పుడు జగన్‌రెడ్డి అవసరం లేదు. ఎన్డీయే బలపడటం ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యం. ఈ మార్పును అర్థం చేసుకోకుండా జగన్‌రెడ్డి గతంలో వలె కాలం చెల్లిన ట్రిక్కులు ప్రదర్శిస్తే వాటిని తనకు అనుకూలంగా మలచుకోకుండా చంద్రబాబు ఉంటారా? చుట్టూ ఉన్మాద మూకను పోగేసుకొని ప్రభుత్వంపై దండయాత్రకు జగన్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదు. నిజానికి విజయవాడ, గుంటూరులో చేపట్టిన కార్యక్రమాల వల్ల జగన్ అండ్ కో పరోక్షంగా తెలుగుదేశం పార్టీకి మేలే చేశారు. జగన్‌రెడ్డి కార్యక్రమాల ముందు వరకు తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో చంద్రబాబు ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ వచ్చారు. తమ అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేయడం లేదని విమర్శలు మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో బిజీగా ఉండేవారు. ఈ పరిణామం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇబ్బందిగా మారింది. కార్యకర్తలు కోరుకుంటున్నట్టుగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడలేక, అదే సమయంలో అదుపు తప్పుతున్న తెలుగు తమ్ముళ్లను శాంతింపజేయలేక సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో జగన్ అండ్ కో ప్రదర్శించిన వీధి నాటకాలు తెలుగు తమ్ముళ్లను మళ్లీ సంఘటితం చేశాయి. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలకు స్వస్తి చెప్పి జగన్ అండ్ కో ప్రదర్శించిన వీధి నాటకాల్లోని డొల్లతనాన్ని బయటపెట్టారు. దీంతో తెలుగుదేశం పార్టీకి మంచే జరిగింది.

వైఎస్ అలా.. జగన్ ఇలా!

2004కు ముందు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక హత్య కేసులో జైల్లో ఉన్న గౌరు వెంకటరెడ్డిని పరామర్శించి రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఆయన చర్యకు మద్దతు లభించింది. తనను నమ్ముకున్న వారి కోసం రాజశేఖరరెడ్డి ఎంత దూరమైనా వెళతారన్న పేరు వచ్చింది. ఇప్పుడు జగన్‌రెడ్డి తండ్రి బాటలోనే పయనించే ప్రయత్నం చేయాలనుకుంటున్నట్టుగా ఉంది. అయితే పరామర్శకు ఆయన ఎంచుకున్న మనుషుల గతాన్ని ప్రజలు మరిచిపోకపోవడం వల్ల సదరు ప్రయత్నాలు వికటిస్తున్నాయి. ఎంపీగా ఉన్నప్పుడు నందిగం సురేశ్ రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు వ్యతిరేకంగా అరాచకంగా ప్రవర్తించారు. అధికార మదంతో విర్రవీగారు. వల్లభనేని వంశీ విషయం కూడా అందరికీ తెలిసిందే. నోటికి హద్దూ పద్దూ లేకుండా చంద్రబాబు కుటుంబంపై అవాకులు చవాకులు పేలారు. మహిళలను అవమానించారు. తమకు జరిగిన అవమానాలను చంద్రబాబు గానీ, లోకేశ్ గానీ ఎలా మరిచిపోతారు? అందుకే సమయం, సందర్భం కోసం వేచి చూశారు. వంశీ వంటి వారు ఇంకా కొంత మంది ఉన్నారు. వారి వంతు రావడానికి ఇంకొంత సమయం పట్టవచ్చు. ఇప్పుడు జగన్ చుట్టూ కనిపిస్తున్న కొడాలి నాని, పేర్ని నాని, దేవినేని అవినాశ్, అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి వంటి వారు ఈ జాబితాలో ఉంటారని అంటున్నారు. ఇలాంటి వారిని అరెస్టు చేసినప్పుడు వారి పరామర్శకు జగన్‌రెడ్డి పోలోమని వెళ్లినా ప్రయోజనం ఉండకపోవచ్చు. అధికారంలో ఉన్నప్పుడు వివాదరహితులుగా ఉన్న వారిని ప్రభుత్వం వేధిస్తే, వారి కోసం జగన్‌రెడ్డి తపన పడితే అర్థం ఉంటుంది గానీ ప్రజల్లో సదభిప్రాయం లేనివారి కోసం గొంతు చించుకున్నా ప్రయోజనం ఉండదు. కూటమిలో చీలిక

> సాధారణ ఎన్నికలకు కొంచెం ముందు ప్రతిపక్షంలో ఉన్న నాయకుడిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినాదాలు చేస్తే అర్థం చేసుకోవచ్చు కానీ ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలలకే, అది కూడా 11 సీట్లు మాత్రమే గెలుచుకున్న ఒక వ్యక్తిని ఉద్దేశించి 'సీఎం సీఎం' అని నినదించడం, అలా నినాదాలు చేసిన, చేయించుకున్న వారి మనోవికారాలకు అద్దంపడుతుంది. ఇలాంటి నినాదాలు జగన్‌రెడ్డికి ఆనందాన్ని ఇస్తూండవచ్చు గానీ, వినేవారికి ఎబ్బెట్టుగా ఉంటాయి. చంద్రబాబు, లోకేశ్ కంటే అందంగా ఉంటారు కనుక కొడాలి నాని, దేవినేని అవినాశ్‌ను కూడా త్వరలో అరెస్టు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రోతగా ఉన్నాయి. నీకంటే చంద్రబాబు అందంగా ఉంటారని అప్పట్లో ఆయనను అరెస్టు చేయించావా? అని ఎవరైనా ప్రశ్నిస్తే జగన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారు?

ఏర్పడకపోదా?, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య విభేదాలు ఏర్పడి విడిపోకుండా ఉంటారా? అని జగన్ అండ్ కో ఆశగా ఎదురుచూస్తున్నారు గానీ వారి ఆశలు నెరవేరే అవకాశాలు కూడా కనిపించడం లేదు. కేంద్రంలో ఎన్డీయే బలంగా ఉండాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నందున కూటమిలో విభేదాలు ఏర్పడకుండా ఆయన పెద్దన్న పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నారు. కూటమిలో చీలిక కోసం ఆశతో ఎదురుచూసే బదులు తనకు నమ్మిన బంటుగా బతికిన విజయసాయిరెడ్డి వంటి వారు ఇప్పుడు తనను వదిలి ఎందుకు వెళ్లిపోతున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేయడం జగన్‌రెడ్డికి మంచిది. వంచనతో కూడిన రాజకీయాలు అన్ని వేళలా పనిచేయవు. జగన్‌రెడ్డి ఎటువంటివారో, ఆయన పాలన ఎలా ఉంటుందో ప్రజలు తెలుసుకున్నారు. ప్రస్తుతానికి చంద్రబాబుకు గ్రహాలు అనుకూలంగా ఉన్నట్టున్నాయి. అందుకే కేంద్రంలో ఆయనకు పరపతి పెరుగుతోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ ఆరోగ్యం క్షీణించడం, మహారాష్ట్రలో కూటమిలో విభేదాలు ఏర్పడటంతో ఎన్డీయేలో చంద్రబాబు ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఈ పరిస్థితిని ఆయన రాష్ట్రాభివృద్ధి కోసం ఉపయోగించాలని కోరుకుందాం. పరిస్థితులు అనుకూలించే వరకు వేచి ఉండకుండా తొందరపడి ఒక కోయిల ముందే కూసింది అన్నట్టుగా జగన్‌రెడ్డి వ్యవహరించడం, ఆందోళనలకు పిలుపునివ్వడం ఆయనకు మంచిది కాదని ఎవరు చెప్పాలి?

ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య మాటలయుద్ధం చూస్తుంటే ఉక్రెయిన్‌ను అమెరికా పూర్తిగా ఒంటరి చేసేలా కనిపిస్తున్నది. యురోపియన్ యూనియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా, ఆ దేశాలు ప్రస్తుతానికి అమెరికాపైనే ఆధారపడి ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు నాలుగుదారుల కూడలిలోకి చేరుకుంది. ఏ యుద్ధం అయినా ఏదో ఒకరోజు ముగియవలసిందే. అయితే, మొదలుపెట్టిన వారికి అనుకూలంగానే యుద్ధం ముగియాలని గ్యారెంటీ ఏమీ లేదు. కానీ కీలకమైన యుద్ధాల ముగింపు ప్రపంచ బలాబలాలలో మార్పులు తెస్తాయి. నూతన కూటములు, నూతన అధికార క్రమాలు మొదలవుతాయి.

2021 ఆగస్టులో అమెరికా తనను నమ్ముకున్న వారిని నట్టేట ముంచి, మంచి మంచి ఆయుధాలను వదిలిపెట్టి, ఆఫ్ఘనిస్తాన్ నుండి పలాయనం చిత్తగించింది. ఈ పరిణామం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ధైర్యాన్నిచ్చింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య ఎప్పటినుండో రగులుతున్న ఘర్షణలను సైనికంగా పరిష్కరించాలనుకున్నాడు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోబోతున్నట్లుగా ప్రకటనలు ఇవ్వడం, నాటో కూడా ప్రయత్నాలు మొదలుపెట్టడంతో పుతిన్‌కు ఇది సాకుగా ఉపకరించింది. రష్యా భద్రతకు ప్రమాదం ఏర్పడబోతున్నదనే పేరుతో 2022 ఫిబ్రవరి 14న ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధం మొదలుపెట్టాడు.

పుతిన్ 2014లో ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న క్రిమియాను తిరిగి రష్యాలో విలీనం చేసినప్పటినుండే, నాటో ఉక్రెయిన్‌ను సైనికంగా బలోపేతం చేస్తూ వస్తున్నది. ప్రపంచాధిపత్య పోరులో భాగంగా రష్యాను కట్టడి చేయడం కొరకు ఉక్రెయిన్ సైనిక శక్తిని పెంచడం అమెరికాకు అవసరం కూడా. ప్రత్యర్థులను తక్కువగా అంచనా వేసి యుద్ధానికి దిగడంతో ప్రారంభంలో రష్యాకు తీవ్ర నష్టాలు ఎదురైనాయి. యుద్ధం ప్రారంభంలో, జెలెన్‌స్కీ దేశం విడిచిపోయేందుకు అమెరికా సహకరిస్తుందని ప్రకటించిన జో బైడెన్, రష్యాకు జరిగిన నష్టాలను చూసిన తర్వాత ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక, ఆయుధ సహాయం చేయడం మొదలుపెట్టాడు. రష్యాపైన అంతా పెద్దఎత్తున ఆంక్షలు విధించారు.

> ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యాకు అనుకూలంగా పరిష్కరించి రష్యాను మంచి చేసుకుని చైనాను ఒంటరి చేయాలనేది అమెరికా ఆలోచన కావచ్చు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కొన్ని చైనాకు దగ్గర కావచ్చు, కొన్ని అమెరికా వైపు ఉండవచ్చు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో నూతన కూటములు ఏర్పడే క్రమం కూడా ఉంది. అమెరికా కొత్త కూటమికి అనుకూలంగా ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారమవుతుందనీ అనుకోవచ్చు.




మొదట్లో సమస్య పరిష్కారం కొరకు ఒకటి రెండు సమావేశాలు జరిగినా, యుద్ధక్షేత్రంలో రష్యాకు గట్టిజవాబు చెప్పగలమని నాటో దేశాలు విశ్వసించాయి.

అమెరికా, నాటోదేశాలు ఉక్రెయిన్‌కు అన్ని రకాల ఆయుధసాయం చేశాయి. ఉపగ్రహ సమాచారాన్ని, ఆధునిక డ్రోన్లను ఇచ్చాయి. అయితే పాశ్చాత్య మీడియా ప్రచారం చేసినట్లుగా రష్యా శక్తి అంతరించిపోలేదు. కాకపోతే 2022 ఆగస్టులో నాటో ఆయుధాలతో ఉక్రెయిన్ చేసిన బలమైన ఎదురుదాడితో యుద్ధస్థితిలో ప్రతిష్టంభన ఏర్పడింది. అక్కడి నుండి ఈ యుద్ధం మన పౌరాణిక సినిమాలలో చూపినట్టు–ఒకరు నిప్పుల బాణాలు వేస్తే మరొకరు నీళ్ల బాణాలు వేసినట్టు– సాగింది. ఉక్రెయిన్ సైన్యాలు నాటో అందించిన కొత్త ఆయుధాలను ఉపయోగించినప్పుడల్లా రష్యా కొద్దిగా వెనక్కు తగ్గేది. వాటి గురించి అర్థం కాగానే ఎదురు దెబ్బతీసేది. అమెరికన్ అబ్రాం ట్యాంకులు, జర్మన్ లెపర్డ్ ట్యాంకులకు ఎదురే లేదని నాటో చెప్పుకుంది కానీ, వాటినీ రష్యా ధ్వంసం చేసింది. అన్ని రకాల క్షిపణులను రష్యన్ సైన్యాలు కూల్చివేశాయి. ఆధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను అధిగమించి ఉక్రెయిన్ నగరాలపై రష్యా బాంబులు కురిపిస్తూ పోయింది. ఒక దశలో నాటో సైనిక సలహాదారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఉక్రెయిన్ సైన్యాలు అకస్మాత్తుగా, ప్రధాన యుద్ధ రంగానికి దూరంగా రష్యాకు చెందిన కుర్‌స్క్ ప్రాంతంలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నాయి. కుర్‌స్క్‌ను రక్షించుకోవడం కొరకు ప్రధాన యుద్ధరంగం నుండి కొంత సైన్యాన్ని రష్యా ఉపసంహరించుకొని అక్కడకు పంపుతుందని నాటో ఆశించింది. కానీ, ఈ పురాతన ఎత్తుగడను సైతం రష్యా సులువుగా తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సైన్యాన్ని కుర్‌స్క్ నుండి వెళ్లగొట్టడానికి రష్యన్ సైనికులకు తోడుగా నార్త్ కొరియా సైనికులు కూడా వచ్చారు.

ఇంతలోగా అమెరికా ఎన్నికలు ముంచుకొచ్చి ఉక్రెయిన్ పరిస్థితి మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లు అయింది. ట్రంప్ వస్తే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయం ఆగిపోవచ్చునని అందరూ ఊహించినదే. పదవి చేపట్టడంతోనే ఆయన ఈ యుద్ధం ముగింపు కొరకు రష్యాతో చర్చల కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఈయూ, ఉక్రెయిన్‌కు ఈ చర్చలలో స్థానం లేకుండా చేశాడు. ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుంది కాని దాని పాత సరిహద్దులు మారిపోవచ్చు అని ట్రంప్ అంటున్నారు. అంటే రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ తూర్పు ప్రాంతం రష్యాకే పోతుందని అర్థం. అలాగే ఉక్రెయిన్ రక్షణ గ్యారంటీలో అమెరికా సైన్యం ఉండదట. యుద్ధానికి మూలకారణమైన నాటో సభ్యత్వం ఉక్రెయిన్‌కు ఇవ్వడం సాధ్యమయ్యే పని కాదని కూడా ట్రంప్ తెగేసి చెప్పారు. అమెరికా వైఖరితో దిగ్భ్రాంతిచెందిన ఈయూ దేశాలు చర్చల్లో తమనూ, ఉక్రెయిన్‌ను భాగం చేయనందుకు అమెరికాను విమర్శిస్తున్నాయి.

యుద్ధం ముగింపు కొరకు జరుగుతున్న చర్చల క్రమాన్ని, ఈయూ, అమెరికా మధ్య పెరుగుతున్న అపనమ్మకాన్ని, అమెరికా రష్యాల మధ్య చిగురిస్తున్న స్నేహాన్ని చూసినప్పుడు కొత్తకూటముల ఉదయమేదో జరగబోతున్నట్లు కనిపిస్తున్నది. రష్యాకు అమెరికా స్నేహహస్తాన్ని అందిస్తూనే మరోవైపు చైనాతో కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇప్పుడు అమెరికాకు ప్రధాన శత్రువు చైనానే. చైనా నాయకత్వంలోని బ్రిక్స్‌తోనే అమెరికాకు ప్రమాదం. రష్యా చైనాలను ఒకేసారి ఎదుర్కోవడం సాధ్యం కాదని ఉక్రెయిన్ యుద్ధంతో తేలిపోయింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యాకు అనుకూలంగా పరిష్కరించి రష్యాను మంచి చేసుకుని చైనాను ఒంటరి చేయాలనేది అమెరికా ఆలోచన కావచ్చు. 1970లలో రష్యాను ఒంటరి చేయడానికి కిసింజర్ దౌత్యనీతితో చైనాను అమెరికా దగ్గరికి తీసుకున్నది. అప్పటివరకు తైవాన్ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించిన అమెరికా, చైనాతో దోస్తీ కొరకు తైవాన్‌ను చైనా అంతర్భాగంగా గుర్తించింది. అదే అమెరికా వారం క్రితమే తైవాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించే విధంగా తన వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. రష్యా దోస్తీ కొరకు ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాన్ని రష్యాలో భాగమే అని కూడా అమెరికా అనవచ్చు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కొన్ని చైనాకు దగ్గర కావచ్చు, కొన్ని అమెరికా వైపు ఉండవచ్చు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో నూతన కూటములు ఏర్పడే క్రమం కూడా ఉంది. అలాగే, అమెరికా కొత్త కూటమికి అనుకూలంగా ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారమవుతుందనీ అనుకోవచ్చు.

■ లంకా పాపిరెడ్డి



ట్రాఫిక్ టెర్రర్!



వీఐపీ కారిడార్(ఎన్‌హెచ్–16)లో జంక్షన్స్ జామ్

బెజవాడలో అడుగడుగునా ట్రాఫిక్ పద్మవ్యూహాలే..

- మాన్యువల్‌తో నెట్టుకొస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- వాహనాల ఇంజిన్ రన్నింగ్‌లో ఉంచడంతో పెరుగుతున్న వాయు కాలుష్యం, వృథా అవుతున్న ఇంధనం
- వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తెస్తే 20 శాతం పరిష్కారం
- హైవేపై ఇష్టారాజ్యంగా ప్రైవేటు బస్సులు, ఆటోవాలాల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో వాహనదారులు



రామవరప్పాడు రింగ్ వద్ద ట్రాఫిక్ జామ్

వీఐపీ కారిడార్(ఎన్‌హెచ్ - 16)లోని జంక్షన్ల వద్ద రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతోంది. నగరంలో అంతర్గత ట్రాఫిక్ అంతకంతకూ ఎక్కువ కావడంతో సిగ్నల్స్‌ను మాన్యువల్‌గా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధానం ట్రాఫిక్ పోలీసులకు సౌకర్యంగా ఉందేమో కానీ వాహనదారులకు మాత్రం చుక్కలు చూపిస్తోంది. ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తారో తెలియక వాహనాలను రన్నింగ్ మోడ్‌లోనే ఉంచాల్సి వస్తోంది. ఫలితంగా జంక్షన్ల దగ్గర వాయు కాలుష్యం పెరగడంతో పాటు వాహనాలకు వృథాగా ఇంధనం ఖర్చవుతోంది. వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడం, ఇన్నర్ రింగు రోడ్డు పనులు మొదలు పెట్టడం దీనికి పరిష్కారంగా కనిస్తోంది. ఆటో నగర్‌లోకి వాహనాలను నగరం వెలుపల నుంచి అనుమతించడం, హైవేపై పార్కింగ్ చేసే వాహనాలపై చర్యలు తీసుకోవడం వల్ల మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. కుటుంబంలో ఎంత మంది ఉంటే అన్ని ద్విచక్రవాహనాలు ఉంటున్నాయి. కార్లను వి నియోగిస్తున్న వారి సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఆర్థిక స్తోమత కలిగిన వారి ఇళ్లలో కార్ల సంఖ్య కూడా ఎక్కువే. నగరంలో పరిమితికి మించి తిరుగుతున్న ఆటోలు, ఇతర రవాణా వాహనాలు, లారీలు, భారీ వాహనాల ప్రవేశం వల్ల అంతులేని రద్దీ ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో వీఐపీ కారిడార్ (ఎన్‌హెచ్-16)లో ప్రధానంగా బెంజిసర్కిల్, నిర్మలా కాన్వెంట్ జంక్షన్, ప్రభుత్వాస్పత్రి జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, శక్తి కల్యాణ మండపం జంక్షన్‌లు ట్రాఫిక్‌తో అట్టుడికిపోతున్నాయి. వాహనదారులకు నిత్యం నరకంగా మారుతోంది.

వృథా అవుతున్న సమయం

శివారు గ్రామాల నుంచి విజయవాడ రావటానికి పావుగంట పడితే.. ఈ జంక్షన్ల మీదుగా నగరంలోకి ప్రవేశించడానికి కనిష్ఠంగా అర్ధగంట, గరిష్ఠంగా ముప్పావుగంటకుపైగా సమయం పడుతుంది. నగరంలోని వారికైతే కనిష్ఠంగా 20 నిమిషాల నుంచి గరిష్ఠంగా అర్ధగంటకు పైగా పడుతోంది. జంక్షన్ల దగ్గరే పావు గంట వరకు వాహనాలను రన్నింగ్ మోడ్‌లో ఉంచాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉంటే .. కనీసం వాహనాలను ఆఫ్ మోడ్‌లో పెట్టుకోవటానికి అవకాశం ఉంటుంది. మాన్యువల్ విధానం వల్ల ఎప్పుడు వదులుతారో తెలియదు. వాహనం ఇంజిన్ ఆపితే ఒక్కసారి వదలగానే.. ఇంజిన్ స్టార్ట్ చేసి ముందుకు వెళ్లటానికి కొంత సమయం పడుతుంది. ఈ లోపు వెనుక వాహనాలు చేసే హారన్ల గోల అంతా ఇంతా కాదు. పరిస్థితి ఎలా తయారైందంటే.. వీఐపీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహనదారులు చిరాకుగా, అసహనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీనివల్ల వాహనదారుల ఆరోగ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తే..

వీఐపీ కారిడార్‌పై రద్దీ తగ్గించాలంటే.. తక్షణ పరిష్కారం విజయవాడ వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడం. దీని వల్ల 20 శాతం మిగతా 6లో..

కాలుష్య నగరాల్లో ప్రథమ స్థానం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన దక్షిణాది కాలుష్య నగరాల్లో విజయవాడ నగరం మొదటి స్థానంలో ఉంది. విజయవాడ నడిబొడ్డున వెళ్లే వీఐపీ కారిడార్‌పై కర్బన ఉద్గారాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది. ట్రాఫిక్ పోలీసుల కోణంలో చూస్తే ట్రాఫిక్ రద్దీని తట్టుకోవటానికి వారు అనుసరిస్తున్న మాన్యువల్ విధానం కొంత వరకు మంచిదే అయినా వాహనదారులకు అది సంతృప్తికరంగా లేదు. ఇలా ఎన్నాళ్లు మాన్యువల్‌గా నిర్వహిస్తారు, దీనికి పరిష్కారం ఏమిటన్నది ఆలోచించాల్సిన అవసరం ఉంది.



క్వారీ తవ్విన భూమిలో ఆక్రమణదారులు సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్

క్వారీ భూముల్లో డ్రాగన్స్

బాపులపాడు మండలంలో వంశీ అనుచరుల భూదందాలు

కొండల్లో అక్రమంగా తవ్వకాలు..ఆపై చదును చేసి పంటల సాగు

క్వారీ గోతుల్లోని నీటితో మొక్కజొన్న, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మతోటల పెంపకం

సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ నేతలపై భౌతిక దాడులు

ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న వంశీ గ్యాంగ్ బహుళ ప్రయోజన అరాచకాలు

బాపులపాడు మండలంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ గ్యాంగ్ చేసిన అరాచకాలు చూస్తే నివ్వెరపోవాల్సిందే. ప్రభుత్వ భూములు, పేదలు సాగు చేసుకునే పొలాలను దౌర్జన్యంగా ఆక్రమించి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేశారు. ఆ తర్వాత ఆ భూములను చదును చేసి డ్రాగన్ ఫ్రూట్, మొక్కజొన్న, నిమ్మతోటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతో బినామీ పేర్లతో పట్టాలు పుట్టించి పాసుపుస్తకాలను పొందారు. వాటిని స్థానిక సహకార సంఘాల్లో చూపి రుణాలు సైతం తీసుకున్నారు. వైసీపీ నేతల బహుళ ప్రయోజన దందాలను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. -ఆంధ్రజ్యోతి-హనుమాన్ జంక్షన్ రూరల్

■ రేమల్లె శివారులో మల్లవల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న సర్వే నంబర్ 418-8, 9ల్లోని సుమారు 22 ఎకరాల భూమిని హరిదాసులకు పట్టాలు కేటాయించారు. ఆ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో కొందరు పెద్దలు భయపెట్టి ఆక్రమించుకోవడంతో పాటు 20 అడుగుల లోతు క్వారీ తవ్వి గ్రావెల్‌ను తరలించేశారు. ఈ క్వారీ గోతుల్లోని నీటితో చుట్టు పక్కల మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

■ పైభూమికి ఎదురుగా ఉన్న 422 సర్వే నంబరులోని 18 ఎకరాల భూమిలో అక్రమంగా తవ్వకాలు సాగించి తదనంతరం చదును చేసి డ్రాగన్ ఫ్రూట్ తోట సాగు చేస్తున్నారు. మొత్తం భూమి విలువ ఇప్పటి లెక్కల ప్రకారం సుమారు రూ.20 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారంటే ప్రభుత్వానికి ఎంత భారీ నష్టం వాటిల్లిందో అర్థమవుతోంది. అక్రమంగా తరలించిన గ్రావెల్ లెక్క వేస్తే అదే సుమారు రూ. 17కోట్ల వరకూ ఉంటుందని అంచనా. దీన్ని బట్టి ఒక్క చోట సుమారు 38 ఎకరాల్లో రూ.37 కోట్ల ప్రజాధనం పెద్దల పాలైంది.

■ మల్లవల్లిలోని మూడు ఎకరాల అసైన్డ్ భూమిలో అక్రమ క్వారీయింగ్ నిర్వహించి 12 అడుగుల లోతు తవ్వేడంతో పాటు చదును చేసి నిమ్మతోట సాగు చేసుకుంటున్నారు. దీనికి స్థానికంగా ఉండే మండల స్థాయి వైసీపీ నాయకుడొకరు అండగా నిలబడటంతో ప్రజలు కూడా ఏమీ చేయలేని స్థితిలో అధికారులు వస్తే మిగతా 6లో..



జీవన సౌందర్య 'చిత్రం'

8లో

పచ్చటి ప్రకృతిలో నదీ తీరం వెంబడి పొగలు కక్కుతూ పరుగెడుతున్న రైలు బండి, చెరువులో తామరపూలతో మగువలు, పిల్లి కోసం పొంచిన పులి, హాస్య పితామహుడు చార్లీచాప్లిన్, అక్వేరియంలో గోల్డ్ ఫిష్, భయపెడుతున్న డైనోసార్స్, త్రివర్ణ పతాకాన్ని చేతబూని పరుగెత్తుతున్న బాలురు, సముద్రంలో చేపల వేటకు వెళుతున్న మత్స్యకారులు, చెట్లకు పేడ ముద్దలు కొడుతున్న మహిళ, సెలయేళ్లు, జలపాతాలు, మంచినీళ్ల బిందెలతో మగువ, కోతికి శిక్షణ ఇస్తున్న వ్యక్తి .. ఇవన్నీ కళాకారుడి ఆలోచనల నుంచి ఆవిష్కృతమైన కళాఖండాలు. బందరు రోడ్డులోని ఆకాశవాణి కేంద్రం వద్ద ప్రహరీపై కొలువుతీరాయి. జీవం ఉట్టిపడేలా ఉన్న ఈ జీవన చిత్రాలు నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సిటీకి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తున్న ఎంజీ రోడ్డును 'సిటీ ఆన్ ఆర్ట్స్'లో భాగంగా కార్పొరేషన్ అధికారులు కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. -ఆంధ్రజ్యోతి- విజయవాడ

హైటెక్ స్పా

మసాజ్ ముసుగులో యథేచ్ఛగా వ్యభిచారం

ఉత్తరాది రాష్ట్రాల యువతులతో వ్యాపారం

భవనం చుట్టూ సీసీ కెమెరాలు. తలుపులు తెరచుకోవడానికి ఆన్ ఆఫ్ స్విచ్‌లు. తలుపుల వద్ద వేలిముద్ర స్కానర్లు. భవనానికి వెళ్లే మార్గానికి రెండు వైపులా సీసీ కెమెరాలు. ఇదేదో నిఘా వ్యవస్థ భవనం, ఇంటెలిజెన్స్, ఎస్‌ఐబీ కార్యాలయాలు అనుకుంటే పొరపాటే. ఇది ఉత్తరాది యువతులను ఎరగావేసి నిత్యం రసాంగిక కార్యకలాపాలు సాగించే స్పా సెంటర్‌కు అమర్చిన అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉత్తరాది రాష్ట్రాల యువతులతో యథేచ్ఛగా వ్యభిచార కార్యకలాపాలు సాగుతున్నాయి. స్పా సెంటర్ బాగోతాన్ని ఓ వ్యక్తి స్ట్రింగ్ ఆపరేషన్ చేసి ఇచ్చిన సమాచారంతో పోలీసులు బట్టబయలు చేశారు. పది మంది యువతులు, 11 మంది విటులను అరెస్టు చేశారు.

- ఓ వ్యక్తి స్ట్రింగ్ ఆపరేషన్‌లో బయట పడ్డ రాసలీలలు
- పది మంది యువతులు, 11 మంది విటుల అరెస్టు
- విటుల్లో వైసీపీ నేత శంకర్ నాయక్



నిర్వాహకుడు భార్గవ్





పోలీసులకు పట్టుబడిన యువతులు, వైసీపీ నేత శంకర్ నాయక్

విజయవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన చలసాని ప్రసన్న భార్గవ్ వెటర్నరీ కాలనీలోని ఫీడర్ రోడ్లు స్టూడియో9 పేరుతో స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కింద అంతస్తులో ఒక యూట్యూబ్ చానల్‌కు సంబంధించిన కార్యాలయం ఉంది. మొదటి అంతస్తులో స్పా సెంటర్‌కి సంబంధించిన రిసెప్షన్, గదులు ఉన్నాయి. రెండో అంతస్తులో నాలుగు గదులు ఉన్నాయి. ఈ స్పాకు మంగళగిరికి చెందిన దగ్గుబాటి శ్యామ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. కిషోర్ అనే వ్యక్తి పేరు మీద లైసెన్స్ ఉన్నప్పటికీ మొత్తం వ్యవహారాలన్నీ భార్గవ్ కనుసన్నల్లో జరుగుతున్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఘజియాబాద్, మధ్యప్రదేశ్ ప్రాంతాలకు చెందిన యువతులను ఉద్యోగాల పేరుతో రప్పించుకుని స్పా సెంటర్లో మసాజర్లుగా నియమించుకున్నారు. మసాజ్‌ల ముసుగులో వారితో ఇక్కడ వ్యభిచారం చేయిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలను మొత్తం స్టింగ్ ఆపరేషన్ చేసి చిత్రీకరించి పోలీసు ఉన్నతాధికారులకు అందజేశాడు. దీంతో మాచవరం పోలీసులు స్పా కేంద్రంలో సోదాలు నిర్వహించడంతో అసలు బాగోతం వెలుగులోకి వచ్చింది. మొత్తం పది మంది యువతులు, 11 మంది విటులను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. క్యాష్ కౌంటర్లో ఉన్న రూ.10వేలు, నగదు చెల్లింపులకు ఉపయోగించే స్వైపింగ్ మిషన్ పోలీసులు సీజ్ చేశారు. మేనేజర్ మిగతా 6లో..

మంచం కింద దాక్కొన్న వైసీపీ నేత

వైసీపీ నేత, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వ్యవహరించిన శంకర నాయక్ స్పా సెంటర్లో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఒక గదిలో మంచం కింద దాగివున్న అతడిని బయటకు లాక్కొచ్చారు. స్పా కేంద్రంలోకి వెళ్లిన శంకర్ నాయక్ ఒక యువతిని బుక్ చేసుకున్నాడు. ఆమె కంటే ముందుగానే రెండో అంతస్తులో ఉన్న గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఇంతలో పోలీసులు దాడులు చేస్తున్నట్టు తెలియడంతో మంచం కింద దాక్కోవడానికి ప్రయత్నించాడు. శంకర్ నాయక్ లావుగా ఉండటంతో ఇది సాధ్యపడలేదు. దీనితో మంచాన్ని పైకెత్తి దాని కింద పడుకుని తనపై మంచాన్ని వాల్చుకున్నాడు. తలుపులు పగలగొట్టుకుని లోపలికి వెళ్లిన పోలీసులు మంచం ఎత్తుపల్లంగా ఉండడాన్ని గమనించారు. దీనితో మంచం ఎత్తి చూడగా దాని కింద శంకర్ నాయక్ ఉన్నాడు. ఈ వీడియోను పోలీసులు చిత్రీకరించారు.



డయాగ్రిడ్ డిజైన్‌తో రాజధాని టవర్లు

కొత్త సాంకేతికతతో అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణం

- కరకట్టకు రెండువైపులా రక్షణ గోడ
- నాలుగు వరుసల రహదారికి తగ్గనున్న వ్యయం
- నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- సమాంతర పనుల కోసం అన్ని శాఖల మధ్య సమన్వయం
- మంత్రి నారాయణ నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం

రాజధాని నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా అత్యాధునికమైన 'డయాగ్రిడ్' డిజైన్‌లో రాజధాని టవర్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. మునిసిపల్ మంత్రి నారాయణ అధ్యక్షతన తాజాగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రాజధాని నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కరకట్ట మీదుగా రాజధాని నగరానికి నిర్మించే నాలుగు లేన్ల రహదారికి అయ్యే ఖర్చును అంచనా వేశారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, రాజధాని నగరానికి తాగు నీరు, మురుగునీరు యాజమాన్య నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని తీర్మానించారు. రాజధాని పనులన్నీ సమగ్రంగా, సమాంతరంగా జరగడానికి అన్ని శాఖలు ఒక టీంలా పనిచేయాలని నిర్ణయించారు. ఆ సమావేశానికి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, మునిసిపల్ శాఖ కార్యదర్శి కన్నబాబు తదితరులు హాజరయ్యారు.

డయాగ్రిడ్ విధానం అంటే..

రాజధాని నగర నిర్మాణాలను సరికొత్తగా డయాగ్రిడ్ మిగతా 8లో..

మిర్చి సాగు ఖర్చు క్వింటా రూ.18 వేలయితేనే ప్రయోజనం

- ఎంఐఎస్ అమలులో పరిగణనలోకి తీసుకోవాలని రైతుల డిమాండ్

6లో

అందుబాటులో 'జీబీఎస్' ఇంజక్షన్లు

- విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు

8లో

నియంత్రణలోనే బర్డ్ ఫ్లూ

8లో

- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ముగిసిన వీరమ్మ తిరునాళ్లు


అమ్మవారికి మొక్కు తీర్చుకునేందుకు ప్రభ బండితో వెళుతున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పదిహేను రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన వీరమ్మ తిరునాళ్ల శనివారం రాత్రితో ముగిశాయి. అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు తిరునాళ్ల చివరిరోజున ఉదయం నుంచి రాత్రివరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రావిచెట్టు సెంటర్ సమీపాన మెట్టినింటి నుంచి ఈనెల 8న మేళతాళాలతో వైభంగా బయలుదేరిన అమ్మవారు భక్తుల ఎదురు గండ దీపాలు అందుకుంటూ, తిరుగు గండ దీపాలు భక్తులు వెంటరాగా మరుసటి రోజున ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆలయానికి చేరుకుని భక్తులకు దర్శనమిచ్చారు. లక్షలాదిమంది భక్తులు తరలివచ్చి తిరునాళ్లలో అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకున్నారు. చివరి రోజున పెద్ద ముఠా, కూరగాయల మార్కెట్ వర్కర్స్ వేర్వేరుగా ప్రభ బళ్లతో వేడుకగా వెళ్లి అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. ఉయ్యూరు ఛైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు ప్రభ బండ్లకు పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. భక్తుల దర్శన అనంతరం రాత్రి పొద్దుపోయాక మెట్టినింటికి చేరుకునేందుకు అమ్మవారు ఆలయం నుంచి బయలుదేరి వెళ్లారు.

కోరిన కోర్కెలు తీర్చే సంగమేశ్వరస్వామి

తిరునాళ్లకు సిద్ధమైన కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం


కూడలి సంగమేశ్వరస్వామి, తిరునాళ్ల సందర్భంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయం

(నందిగామరూరల్-ఆంధ్రజ్యోతి): దట్టమైన అటవీ ప్రాంతం, మహర్షుల పవిత్ర జప కేంద్రం వైరా, కట్లేరు నదుల సంగమ స్థలంలో కొలువుదీరిన శ్రీపార్వతీ సమేత సంగమేశ్వరస్వామిని కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా ఉభయ రాష్ట్రాల భక్తులు కొలుస్తుంటారు. మండలంలోని దాములూరు గ్రామం వద్ద సంగమేశ్వరస్వామి ఆలయం ఉంది. మహా శివరాత్రి రోజున ఇక్కడ అత్యంత వైభవంగా తిరునాళ్ల జరుగుతుంటాయి. భారీ ప్రభల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నదీ సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. తిరునాళ్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రత్యేక బస్సులు నడుపుతాయి. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

స్థల పురాణం


వైరా, కట్లేరు నదుల పవిత్ర సంగమ ప్రాంతం

దాములూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో దక్షిణ వాహినిగా ప్రవహించే వైరా, కట్లేరు నదులు కలిసే ప్రదేశంలో కశ్యపు మహాముని శివలింగ ప్రతిష్ఠ చేసి కొంత కాలం తపస్సు చేశారని స్థల పురాణం చెబుతోంది. రెండు నదులు కలిసే ప్రాంతాన్ని నదీ కూడలిగా ఆయన నామకరణం చేశారు. కశ్యపు ముని ప్రతిష్ఠించిన శివలింగానికి 17వ శతాబ్ధంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆలయం నిర్మించారు. నదుల సంగమాన ఉన్నందున స్వామికి సంగమేశ్వరస్వామిగా నామకరణంచేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు


వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈనెల27న నిర్వహించే ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్టీఆర్ జిల్లాలో పటిష్ఠ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇప్పటికే 224 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు(పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు(ఏపీవో)లకు రెండు దశల్లో పూర్తిస్థాయిలో శిక్షణనిచ్చామన్నారు. నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులతో శనివారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ వి.కరుణ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో లక్ష్మీశ జిల్లాలో చేసిన ఏర్పాట్లను వివరించారు. జిల్లాలో 112 స్టేషన్లకు 112 మంది ఏపీవోలను నియమించామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఇద్దరు చొప్పున ఇతర ప్రిసైడింగ్ అధికారుల(ఓపీవో)ను నియమించినట్లు తెలిపారు. మూడు కేటగిరీలకు రిజర్వు కేటగిరీలో 90 మంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని 19 మందిని రిజర్వులో ఉంచామని తెలిపారు. విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించామన్నారు. మొత్తం 224 బ్యాలెట్ బాక్సులు అవసరమని, రిజర్వుతో కలిపి 324 బాక్సులు అందుబాటులో ఉంచామని తెలి పారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 454 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే 24 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్(ఎఫ్ఎస్‌టీ) క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నట్లు వెల్లడించారు. 11 చెక్‌పోస్టులు వద్ద రెండు షిఫ్టుల్లో 22 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్(ఎస్ఎస్‌టీ) విధుల్లో ఉన్నాయని, ఏడు వీడియో సర్వైలెన్స్ టీమ్(వీఎస్‌టీ)లు పని చేస్తున్నాయని తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలోను వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లను అవసరం మేరకు నియమించామన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలన బృందం అప్రమత్తతతో పని చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో, సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న డాక్టర్ కృష్ణంరాజు

పవిత్రమైనది వైద్య వృత్తి

- చిరునవ్వుతో రోగులకు సేవలందించండి
- ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులతో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కృష్ణంరాజు
- పిన్నమనేని సిద్ధార్థలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని చిరునవ్వుతో సేవలందించి రోగుల మన్ననలు పొందాలని ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు హైదరాబాద్ కేర్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పి.కృష్ణంరాజు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో 19వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కృష్ణంరాజు విచ్చేశారు. వైద్య విద్యకు మంచి డిమాండ్ ఉందని, ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ కోర్సులు చేయాలని కృష్ణంరాజు సూచించారు. సిద్ధార్థ అకాడమీ లక్షల మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిందని, ఆనాడు ఎంతో మంది మహానుభావుల దాతృత్వంతో నేడు పేద, మధ్య తరగతి విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తోం దని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు అన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన 142మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, నిమ్మగడ్డ లలితప్రసాద్, డాక్టర్ సీవీరావు, డాక్టర్ బి.అనిల్‌కుమార్, ఏవో టీవీ సుబ్బారావు, కాసరనేని నవీన్, హిమవంత్ తదితరులు పాల్గొన్నారు.

టమాటాలు నేరుగా రైతుబజార్లలో అమ్ముకోండి

- రైతులతో ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు

జి.కొండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ముదురు తోటల్లోని టమాటాలను రైతులు నేరుగా సమీపంలోని రైతుబజార్లలో అమ్ముకోవచ్చని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు సూచించారు. ఏ ఒక్క రైతు నష్టపోకూడదని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారని వారు తెలిపారు. టమాటా కేజీ 4 రూపాయలు అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గడ్డమణుగు గ్రామంలోని టమాటా తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట పండించే నాటి నుంచి మార్కెటింగ్ చేసుకునే వరకు టమాటా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హెచ్‌వో నీలిమ, మైలవరం ఎస్టేట్ అధికారి పి.చిట్టిబాబు, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


లేత టమాటా తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన, మార్కెటింగ్‌శాఖల అధికారులు

మిర్చికి ధర లేక కన్నీళ్లు పెడుతున్న రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు రంగంలోకి దిగారు. రెండు రోజుల క్రితం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. మిర్చి మార్కెట్, కుదేలైన రైతులను ఆదుకోవడంపై చర్చించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం (ఎంఐఎస్) ద్వారా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. దీంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎంఐఎస్ పథకం ద్వారా మిర్చి పంట సాగు వ్యయానికి, మార్కెట్ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కేంద్రం చెల్లించనున్నది. అయితే క్షేత్రస్థాయిలో పంట వాస్తవ సాగు ఖర్చును పరిగణనలోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఎంత పకడ్బందీగా అమలు చేసినప్పటికీ ఈ పథకం వల్ల ఎలాంటి ప్రయోజనముండదని రైతాంగం కోరుతోంది.


పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలలో కల్లంలో ఆరబోసిన మిర్చి, తాలుకాయలు ఏరుతున్న కూలీలు

మిర్చి సాగు ఖర్చు క్వింటాలుకు రూ.18 వేలయితేనే ప్రయోజనం

ఎంఐఎస్ అమలులో పరిగణనలోకి తీసుకోవాలని రైతుల డిమాండ్

- కుదేలైన రైతును ఆదుకునేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం అమలు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ను కోరిన సీఎం చంద్రబాబు
- సాగు వ్యయానికి, మార్కెట్ ధరకు మధ్య వ్యత్యాసాన్ని చెల్లించేందుకు కేంద్రం అంగీకారం
- వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటేనే ఎంఐఎస్ అమలు చేసినా ప్రయోజనమంటున్న రైతాంగం

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

మార్కెట్లో నెలకొన్న సంక్షోభం వల్ల మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించటం లేదు. గత ఏడాది పంట ఇంకా శీతల గిడ్డంగుల్లో మూలుగుతోంది. ఈ ఏడాది నల్లి ఉధృతంగా దాడి చేయటంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి పది నుంచి 15 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తోంది. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా దిగుబడి లేక అల్లాడుతున్న రైతులు, ఆపై మార్కెట్ దెబ్బతో నిలువుగా కుంగిపోయారు. గత ఏడాది తాలుకాయలకు లభించిన ధర కూడా నేడు ఎర్రకాయలకు రావటం లేదు. పలువురు రైతులు అయినకాడికి కల్లంలోనే తెగనమ్ముకుంటూ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. మార్కెట్ సంక్షోభంపై సీఎం చంద్రబాబు స్పందించటం హర్షణీయమని రైతులు అంటున్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలుకు సంబంధించి మిర్చి పంట వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ప్రచారం ఆర్భాటం తప్పితే ఈ పథకం వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పెట్టుబడి బాగా పెరిగింది..దిగుబడి తగ్గింది



ఈ ఏడాది ఎకరానికి పెట్టుబడి రూ.రెండు లక్షలైంది. ఎర్రనల్లి, నల్లనల్లి దాడిచేయటంతో తోటలు నామరూపాలు లేకుండ కకావికలమయ్యాయి. దిగుబడి 15 క్వింటాళ్లు కూడా రావటం లేదు. కోత కూలి అసాధారణంగా పెరిగింది. కోత, గ్రేడింగ్ కలిపి క్వింటాలుకు కూలి రూ.ఐదు వేలకు తగ్గటం లేదు. ఈ స్థితిలో మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలుకు తూతూమంత్రంగా కాకుండా వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

- కొమ్మినేని సత్యనారాయణ, రైతు, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల

ఎకరాకు సాగు ఖర్చు ఇదీ..

- కొంత మంది రైతులకు పెట్టుబడి రూ.1,81,500 కంటే ఎక్కువే అవుతోంది. ఎకరం కౌలు రూ.40 వేలకు పైగా కూడా ఉంది. నిర్వహణ ఖర్చులు, పెట్టుబడిపై వడ్డీ కూడా పరిగణనలోకి తీసుకుంటే పెట్టుబడి రూ.రెండు లక్షలకు పైసా కూడా తగ్గదు.
- ఎకరానికి సగటున 15 క్వింటాళ్ల వంతున దిగుబడి రావటం గగనమవుతోంది. ఒకటి నుంచి రెండు క్వింటాళ్లు తాలు కాయలు ఉంటున్నాయి. అయినప్పటికీ 15 క్వింటాళ్లు, మార్కెట్ ధర రూ.13 వేల వంతున మొత్తం అమ్మకం విలువ రూ. 1.95 లక్షలవుతోంది.
- మిర్చి కోత కూలి ఎక్కువ అవుతోంది. ఒకరికి రోజుకు కూలి రూ.మూడు వందలు. ఆటో ఖర్చు రూ.30. కాయలు కోయడానికి, కల్లంలో ఆరబోసి ఎండిన తర్వాత తాలు కాయలు ఏరటానికి మొత్తం కలిపి క్వింటాలుకు రూ.ఐదు వేలు కూలి వంతున, 15 క్వింటాళ్లకు రూ. 75 వేలు కూలి అవుతోంది.
- ఈ లెక్కన సాగు వ్యయం క్వింటాలుకు రూ. 17 వేల నుంచి రూ.18 వేల లోపు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కేంద్రం అధీనంలోని ఐసీఏఆర్ క్వింటాలుకు సాగు వ్యయం రూ.10,300గా పేర్కొందని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 11,600గా నిర్ణయించింది. సాగు వ్యయాన్ని తప్పనిసరిగా రూ.18 వేలుగా పరిగణనలోకి తీసుకోవాలని మిర్చి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సగటు సాగు ఖర్చు ఎకరానికి	రూపాయల్లో
పొలం కౌలు	30,000
పొలం బాగుచేయడానికి	2,500
దుక్కి, గొర్రు	5,000
అరక గొర్రు అచ్చు	4,000
నారు	25,000
నారు ఏతకూలి	5,000
ఎరువులు	30,000
పురుగుమందులు	50,000
నీటి తడులు	10,000
కలుపు,పడిపాదులు	10,000
అంతర కృషి, ఇతర ఖర్చులు	10,000
మొత్తం ఖర్చు	**1,81,500**

ట్రాఫిక్ టెర్రర్!

(5వ పేజీ తరువాయి)

వరకు ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చు. సంక్రాంతి సమయంలో పోలీసులు బైపాస్‌ను నైనవరం నుంచి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయినా విజయవాడపై రద్దీని నివారించలేని పరిస్థితి ఏర్పడింది. అయితే అదనపు ట్రాఫిక్‌ను కొంతమేర మళ్లించటానికి దోహద పడింది. అందువల్ల యుద్ధ ప్రాతిపదికన వెస్ట్ బైపాస్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే భారీ వాహనాలు, లారీలను అటుగా మళ్లించే అవకాశం ఉంది.

ఇన్నర్ రింగ్ రోడ్డు వస్తే భారీ వాహనాల తరలింపునకు అవకాశం

విజయవాడ తూర్పు బైపాస్ ప్రతిపాదనపై ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఈ ప్రాజెక్టు ఇక మీదట పట్టాలెక్కే పరిస్థితి కనిపించడం లేదు. విజయవాడ నగరంలో నెలకొన్న అంతర్గత ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించటానికి విజయవాడ తూర్పు బైపాస్ ఆలోచన ప్రత్యామ్నాయంగా ఉంది. ఈ ప్రతిపాదన అర్థంతరంగా ఆగిపోవటంతో సమస్య ఏర్పడింది. తూర్పు బైపాస్ ఎటూ లేదు.. కనీసం అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డులో భాగంగా మొదటి దశలో అయినా చోడవరం నుంచి కేసరపల్లి వరకు రోడ్డు పనులను ప్రారంభించాల్సిన అవసరం ఉంది. కేసరపల్లి నుంచి విజయవాడ వెస్ట్ బైపాస్‌కు కలపగలిగితేనే భారీ వాహనాల సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభిస్తుంది.

ఆటోనగర్‌లోకి నగరం వెలుపల నుంచి అనుమతించాలి

విజయవాడను ఆనుకుని ఉన్న ఆటోనగర్‌లోకి మొదట్లో బందరు రోడ్డులో పంటకాల్వ రోడ్డు, ఆటోనగర్ గేట్ల మీదుగా అనుమతులు ఉండేవి. దీంతో బందరు రోడ్డు ట్రాఫిక్ సమస్యలతో అతలాకుతలంగా మారింది. అనేక జిల్లాల నుంచి విజయవాడ ఆటోనగర్‌కు వచ్చే లారీల కారణంగా బందరు రోడ్డు మీద ట్రాఫిక్ సమస్యలు పెరిగాయి. పటమట నుంచి కానూరు వరకు ప్రజలు గొడవ చేయటంతో.. అప్పటి నుంచి ఆటోనగర్‌లోకి వాహనాల డైవర్షన్ రూటు మార్చారు. ప్రస్తుత వీవీపీ కారిడార్‌లో మహానాడు రోడ్డు, శక్తి కళ్యాణ మండపం రోడ్డు, ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు, మధ్యలో బల్లెం వారి వీధి, రామవరప్పాడు రింగ్ దగ్గర ఉన్న రోడ్ల నుంచి అనుమతులు ఇస్తున్నారు. దీంతో వీవీపీ కారిడార్ మీద పడుతున్న రద్దీ అంతా, ఇంతా కాదు. ఆటోనగర్ నుంచి నాలుగు రోడ్ల ద్వారా వచ్చి, పోయే వాహనాల వల్ల జాతీయ రహదారి మీద ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగా కూడా వీవీపీ కారిడార్‌పై ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి.

అడ్డగోలుగా వాహనాల పార్కింగ్

వీవీపీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు ప్రధానంగా ప్రైవేటు బస్సులు, ఆటోలు కూడా కారణమవుతున్నాయి. ప్రస్తుతం వీవీపీ కారిడార్‌గా పిలుస్తున్న ఎన్‌హెచ్ - 16 కేవలం నాలుగు వరసలుగానే ఉంది. ఒక లేన్‌లో రెండు వరసలు మాత్రమే ఉంటాయి. బెంజిసర్కిల్, రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు ప్రాంతాల్లో ప్రైవేటు బస్సులు హైవేపై ఒక లేనులో బారులు తీరి ఉంటాయి. దీంతో ఇక మరో ఒక లేన్ మాత్రమే మిగిలి ఉంది. ఈ లేన్‌లో క్రాసింగ్స్ ఉండటం వల్ల ఆ లేన్‌లో వాహనాలు నిదానంగా వెళతాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇవి కాకుండా ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా రోడ్ల మీద వాహనాలను నిలుపుతున్నారు. ప్రసాదంపాడు, ఎనికేపాటు, రామవరప్పాడు, విజయవాడలోని బస్టాపుల దగ్గర అడ్డగోలుగా రోడ్ల మీద వాహనాలను పెట్టడం వల్ల ఒక లేన్‌లోనే మిగిలిన వాహనాలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే రమేష్ హాస్పిటల్ జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు రెండు వైపులా జాతీయ రహదారికి అనేక అంతర్గత రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ రోడ్ల మీదుగా నేరుగా జాతీయ రహదారిలోకి వాహనాల ప్రవేశం వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్డు సేఫ్టీ కమిటీ కానీ, ట్రాఫిక్ అధికారులు కానీ , జిల్లా యంత్రాంగం కానీ దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు నగరాన్ని స్తంభింపజేసే ప్రమాదం పొంచి ఉంది.

చిత్తశుద్ధితో పనిచేయండి

- తాగునీటి ఎద్దడి రానీయొద్దు
- పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి
- ఈ-ఆఫీస్ విధానం అమలుచేయాలి
- మునిసిపల్ అధికారులతో రాజమహేంద్రవరం ఆర్డీ నాగనరసింహారావు


మాట్లాడుతున్న నాగనరసింహారావు

నందిగామ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా, పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చూడాలని మునిసిపల్ అధికారులకు రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. శనివారం జగ్జీవన్‌రామ్ భవన్‌లో నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, కొండపల్లి మునిసిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలు, శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వేసవిలో పట్టణ ప్రజలకు పైపులైన్ల ద్వారా అందించే నీటితో పాటు ట్యాంకర్ల ద్వారానూ నీటిని అందించాలని సూచించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తున్న మునిసిపాలిటీలు వాటిని ప్రాసెస్ చేసుకోవాలన్నారు. అనధికార నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారని కమిషనర్లను ఆయన వివరణ కోరారు. నందిగామ మునిసిపాలిటీలో అక్రమ కట్టడాలపై ఆర్డీ విస్మయం వ్యక్తం చేశారు. నందిగామలో తొలిదశగా 54 అనధికార కట్టడాలపై చార్జిషీట్ ఫైల్ చేశామని, యజమానుల నుంచి తొమ్మిది కోట్ల రూపాయల ఆదాయం మునిసిపాలిటీకి రానుందని కమిషనర్ రమణబాబు తెలిపారు. మరో 60 భవనాలపైనా చార్జిషీటు ఫైల్ చేస్తున్నామని, మరో తొమ్మిది కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మిగిలిన మునిసిపాలిటీల్లోనూ ఇలాగే చార్జిషీట్ ఫైల్ చేసి మునిసిపాలిటీలకు ఆదాయం సమకూర్చాలని సూచించారు. టాక్స్ వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎఫ్ నిబంధనలు సడలిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయాల్లో తప్పకుండా ఈ-ఆఫీస్ విధానం అమలు చేయాలని సూచించారు. జగ్గయ్యపేట మునిసిపాలిటీకి చెందిన ఆర్ఐ, ఆర్వో, ముగ్గురు సచివాలయ అడ్మిన్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మునిసిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈకి షాక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఒకరి పదవీ విరమణ బెనిఫిట్స్ మరొకరికి జమ చేసిన ఉదంతంపై అకౌంట్స్ జనరల్ సీరియస్ అయింది. మరొకరికి బదిలీ చేసిన డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఆర్‌డబ్ల్యూఎస్‌లో నాల్గోతరగతి ఉద్యోగి ఎం.వీరాస్వామి పదవీ విరమణ చేశారు. ఆయనకు చెల్లించాల్సిన డబ్బులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జ్యోతిరాణి అనే పదవీ విరమణ చేసిన ఏఎన్ఎంకు చెల్లించారు. ఈ విషయాన్ని గుర్తించిన అకౌంట్స్ జనరల్ వీరాస్వామికి లేఖ రాయడంతో విషయం వెలుగు చూసింది. తనకు డబ్బులు జమ కాలేదని అకౌంట్స్ జనరల్‌కు వీరాస్వామి చెప్పటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరాస్వామి పదవీ విరమణ బెనిఫిట్స్ చెల్లింపునకు దరఖాస్తు పెట్టిన నాటి విజయవాడ డివిజన్ ఈఈ ధవళేశ్వరపు రామలింగప్రసాద్‌కు ఈ నోటీసును ఇచ్చింది. వీరాస్వామికి చెల్లించాల్సిన రూ.8,91,420ను ఇప్పటి వరకు వడ్డీతో తిరిగి వసూలు చేసి చెల్లించాల్సిందిగా నిర్దేశించింది. ఈ వ్యవహారంలో పలువురు ఈఈలు ఇరుక్కుపోయే అవకాశం కనిపిస్తోంది. ధవళేశ్వరపు రామలింగ ప్రసాద్ అప్పట్లో లేఖ రాయగా.. ఆయన తర్వాత వచ్చిన ఈఈ రంగ ప్రసాద్ థంబ్ వేశారు.

హైటెక్ స్పా

(5వ పేజీ తరువాయి)

శ్యామ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. స్పా ముసుగులో జరుగుతున్న రాసలీలల కార్యకలాపాలు బయటికి రావడంతో నిర్వాహకుడు భార్గవ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పట్టుబడిన యువతులను మహిళా సంరక్షణ కేంద్రాలకు తరలించారు. కాగా, ఇంతకుముందే పోలీసుల దెబ్బ రుచి చూసిన భార్గవ్ ఈసారి చాలా తెలివిగా వ్యవహరించారు. ఈ లైసెన్సులన్నీ కిషోర్ అనే వ్యక్తి పేరు మీద తీసుకున్నారు. అతడి పేరుతో ఉన్న అనుమతులను చూపించి భార్గవ్ స్టూడియో 9 పేరుతో స్పా నిర్వహిస్తున్నారు.

విటులను ఆకర్షించడానికి టెలీకాలర్ వ్యవస్థ

విటులను ఆకర్షించడానికి ముగ్గురు యువతులతో వేరే భవనంలో టెలీకాలర్ వ్యవస్థను నెలకొల్పాడు. వారికి మూడు ఫోన్లను కేటాయించాడు. వాటి నుంచి టెలీకాలర్‌లో ఉండే అమ్మాయిలు విటులకు ఫోన్లు చేస్తారు. ఆసక్తి ఉన్న వారు ఎక్కడికి వెళ్లాలో చిరునామాను టెలీకాలర్లే చెబుతారు. లోపల జరిగే సర్వీసును బట్టి రూ.8వేల నుంచి రూ.12వేల వరకు యువతులు వసూలు చేస్తారని మేనేజర్ శ్యామ్ పోలీసు విచారణలో చెప్పినట్టు తెలిసింది. ఇది కాకుండా ఒక్కో మసాజ్‌కు రూ.2వేల నుంచి రూ.3వేలు వసూలు చేస్తారు.

గోడలు దూకి తప్పించుకునేందుకు శిక్షణ

ఈ సాంకేతిక వ్యవస్థను ఛేదించుకుని పోలీసులు వస్తే ఉద్యోగులు, యువతులు అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు భార్గవ్. తాజాగా మాచవరం పోలీసులు దాడి చేసినప్పుడు యువతులు, మేనేజర్ శ్యామ్ ఇదే పని చేశారు. లోపల ఉన్న విటులు బయటకు రావడానికి వీలు లేకపోవడంతో వేలిముద్ర స్కానర్లను ధ్వంసం చేశారు. సాంకేతిక వ్యవస్థ పనిచేయడం మానేసిన తర్వాత పోలీసులు ప్రతి గదిని తనిఖీ చేసి లోపల ఉన్న కండోమ్ ప్యాకెట్లను సీజ్ చేసి విటులను పట్టుకున్నారు. పక్క భవనం ఎక్కి వాటర్ ట్యాంక్ కింద ఉన్న యువతులను సురక్షితంగా కిందకి తీసుకొచ్చారు.

క్వారీ భూముల్లో డ్రాగన్స్

(5వ పేజీ తరువాయి)

ఆధారాలు చూపిద్దామంటూ ఎదురుచూస్తున్నారు.

- కోడూరుపాడులోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి 1968లో వెలమ దొరలు సర్వే నంబర్ 111-1లో ఎకరం భూమి దానంగా ఇచ్చారు. ఆ భూమిని కూడా వదలకుండా రెవెన్యూ అధికారుల సహకారంతో(రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చి) వంశీ అనుంగ సహచరుల ద్వారా వేరే వ్యక్తి మైనారిటీ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. స్థానిక వైసీపీ నాయకుడు ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.
- ఇక పోలవరం కాలువపై రెండు వైపులా ఉన్న గట్లపై కొండల్లా ఉన్న మట్టిని సైతం తమ అధికారాన్ని ఉపయోగించి తవ్వి తరలించేయడంతో పాటు కొన్ని చోట్ల అనధికారిక లేఅవుట్లకు మెరక తోలారు. జగనన్న కాలనీల మెరక పేరుతో పోలవరం గట్టును కొల్లగొట్టారు.
- బాపులపాడు మండలంలోని వందల ఎకరాల్లో వంశీ అనుచరులు చేసిన అవినీతి, అక్రమ తవ్వకాలపై అటు టీడీపీ నాయకులు, ఇటు స్థానికులు పోరాటం చేస్తున్నా అధికారుల్లో మాత్రం చలనంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ క్వారీయింగ్‌పై విజిలెన్స్ విచారణ అంటూ ఆరు నెలల కిందట హడావుడి చేసి నోటీసులిచ్చారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కానీ బడాబాబులు మాత్రం కార్లలో కాలర్ ఎగరేసుకుని తిరుగుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు ఎన్నికల వేళ ప్రత్యర్థులపై భౌతిక దాడులు

సార్వత్రిక ఎన్నికల వేళ వంశీ అనుచరులు రెచ్చిపోయారు. టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు తరఫున ప్రచారం చేస్తున్న నేతలపై భౌతిక దాడులకు దిగి భయభ్రాంతులకు గురి చేశారు. ఈ దాడుల్లో గాయపడ్డ ఎందరో ఆస్పత్రుల పాలయ్యారు.

- కొయ్యూరులో టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రెంటపల్లి బాబూరావు అనే వ్యక్తిని దారుణంగా కొట్టారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోవడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. యార్లగడ్డ దగ్గరుండి మెరుగైన వైద్యం అందించడంతో బాబూరావు తిరిగి కోలుకున్నారు.
- కుమార్తె బారసాల ఏర్పాట్లు చేసుకుంటున్న బాపులపాడు తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణను మరో రెండు రోజుల్లో ఎన్నికలు అనగా దాడి చేసి కొట్టారు. ఆయన వాహనాన్ని ధ్వంసం చేశారు. దీనిపై ఆయన ఫిర్యాదు చేసినా ఇప్పటికీ నిందితులను అదుపులోకి తీసుకోలేదు.
- టీడీపీ ఎన్నికల చీఫ్ ఏజెంట్ ఆళ్ల గోపాలకృష్ణపై కొత్తమల్లవల్లిలో వైసీపీ శ్రేణులు మూకదాడి చేశాయి. దుస్తులు చించేసి వాహనాన్ని ధ్వంసం చేశాయి. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకూ కేసులో పురోగతి లేదు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 465

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురులో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 26న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ రమేష్‌బాబు ఆలయ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారిణి ఎన్.భవానీ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎన్.సన్యాసిరావు నిర్వహణా చర్యలను సమీక్షించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం డీఎల్వీ రమేష్‌బాబును ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

తూర్పులో 8540 పట్టభద్రుల ఓట్లు

● మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లు అధికం ● నాయకుల సుడిగాలి ప్రచారం

మొగల్రాజపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ హీట్ పెంచుతున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరఫున కూటమి పార్టీలు విడి విడిగా, ఉమ్మడిగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా తూర్పులో అధికార పార్టీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆయనతో పాటు ఆయన భార్య ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, కుమారుడు క్రాంతికుమార్‌తో పాటు డివిజన్ స్థాయి నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 8540మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారు. మహిళల ఓట్లు 3795, పురుషుల ఓట్లు 4745 ఉన్నాయి. ఇక మొత్తం బూత్‌లు 12 ఉన్నాయి.

పోలింగ్ కేంద్రాలు

భారతీనగర్: అమరజీవి పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (కృష్ణలంక) పోలింగ్ బూత్ నెంబర్ 90, ఆంధ్ర లయోలా కాలేజీ (గుణదల) పోలింగ్ బూత్‌నెంబరు 106, 107, 108, పీవీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీ(మొగల్రాజపురం) పోలింగ్ బూత్ నెంబర్ 109, కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ హైస్కూల్ (పటమట) పోలింగ్ బూత్ నెంబర్ 116, 117, 118, 119, 120, 121, 121(ఎ). ఈ సెంటర్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

జాతీయస్థాయి నృత్య పోటీలు ప్రారంభం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : సంస్కార భారతి విజయవాడ మహానగర్, సుమధుర కళానికేతన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయస్థాయి నృత్య పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గాంధీనగరం హనుమంతరాయ గ్రంథాలయం, అయోధ్యనగర్ శ్రీ ధర్మపరిషత్, కేబీఎన్ కళాశాల వద్ద రెండు వేదికలను ఏర్పాటు చేయగా, సత్యనారాయణపురం సీతారామ కల్యాణ మండపంలో కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర నాట్యం విభాగాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.వి.ఎన్. కృష్ణ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్భ శ్రీనివాస్, మహానగర అధ్యక్షుడు పి.విజయ భాస్కర శర్మ, కార్యాధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కార్యదర్శి సీతారత్నం, కార్యవర్గ సభ్యులు రూపశ్రీ, కుసుమ సాయి, పొన్నపల్లి సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు హనుమంతు పేరు పెట్టాలి

లబ్బీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు కన్నెగంటి హనుమంత పేరును పల్నాడు జిల్లాకు పెట్టాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కన్నెగంటి 103వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన హనుమంతు బ్రిటిష్ వారి అరాచకాలను ఎదుర్కొని పోరాడిన మహనీయుడని అన్నారు. అటువంటి స్వాతంత్ర సమరయోధుడి పేరును పల్నాడు జిల్లాకు పెట్టి గౌరవించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ మృతి

గుణదల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం చింతల మరియమ్మ, వెంకటేశ్వరరావులు గుణదల రామ్‌గోపాల్ థియేటర్ పక్కన ఉంటున్నారు. వెంకటేశ్వరరావు శుక్రవారం ఉదయం టిఫిన్ కోసం పడవలరేవు సెంటర్ వద్దకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చి ఓ వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయమైన వెంకటేశ్వరరావును స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు శనివారం మృతి చెందినట్లు ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

78 కేజీల గంజాయి స్వాధీనం

ఒకరు అరెస్టు

గుణదల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గంజాయిరహిత నగరంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో నగరంలో పోలీసులు తరచూ దాడులు చేసి గంజాయి తరలింపును అడ్డుకుంటూనే ఉన్నారు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి రామవరప్పాడు ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్ డ్రైవర్ వెనక్కి తిప్పుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు. అది గమనించిన సీఐ సిబ్బందితో వెంబడించి సదరు వాహనాన్ని పట్టుకుని తనిఖీ చేయగా ఆయిల్ డ్రమ్ముల్లో 78 కేజీల గంజాయి పట్టుబడింది. మన్నే శేషారావు (39) విశాఖపట్నం ఏజన్సీ ఏరియా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లుగా గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, మన్నే శేషారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

పుస్తక పఠనంతో మేథో వికాసం : ఇంతియాజ్ అహ్మద్



ఉచిత పుస్తక పంపిణీని ప్రారంభిస్తున్న పూర్వపు కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్

పటమట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏ వయస్సు వారికైనా పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి వారి భావిజీవితాన్ని తేజోవంతం చేస్తుందని, చక్కని ఆలోచనలకు ఆకృతినిస్తుందని పూర్వపు కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, సర్వోత్తమ గ్రంథాలయాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత పుస్తక పంపిణీని ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఎంతో మేధస్సు పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా ఇప్పటి వరకు 2.5 లక్షల పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కామినేని పట్టాభిరామయ్య, వి.కేశవరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ బి.ప్రసాద్, బసవేశ్వరరావు, రచయితలు, అధ్యాపకులు, వివిధ విద్యా సంస్థల గ్రంథ పాలకులు, తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నేరుగా జీతాలు చెల్లించండి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా

గుణదల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు నగరపాలకసంస్థే నేరుగా జీతాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా డిమాండ్ చేశారు. స్థానిక 2, 3 డివిజన్ల శానిటరీ కార్యాలయాల వద్ద శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ మార్జిన్ మనీ పేరుతో కాంట్రాక్టర్లకు కార్మికుల కష్టాన్ని దోచి పెట్టవద్దన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చెల్లించే జీతాలను వేరొక సంస్థ ద్వారా కమిషన్లు చెల్లించి పొందాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

ఆప్కాస్ రద్దు పేరుతో కార్మికుల హక్కులను హరిస్తే కార్మికవర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఇకనైనా కాంట్రాక్టు పద్ధతికి స్వస్తి చెప్పి కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్వీఎస్ చలం పాల్గొన్నారు.

పోల్ మేనేజ్‌మెంట్ సభ్యులతో గద్దె క్రాంతికుమార్ సమావేశం

పటమట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అశోక్‌నగర్‌లోని తూర్పు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులను ఓటింగ్‌కు తీసుకువచ్చేలా పోల్ మేనేజ్‌మెంట్ సభ్యులతో గద్దె క్రాంతికుమార్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు వెలగపూడి శంకర్‌బాబు హాజరై సభ్యులకు పలు సూచనలు చేశారు.



ప్రత్యేక సంచిక విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

నూతన వంగడాల సృష్టితో ఆహార కొరతను అధిగమించాలి

● డాక్టర్ సీఎస్ఎన్ రాజు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాల సృష్టితో పెరుగుతున్న జనాభాకి తగిన విధంగా పంటలను పండించి ఆహార కొరతను అధిగమించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అర్థికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ సీఎస్ఎన్ రాజు తెలిపారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో అర్థికశాస్త్ర విభాగం జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ, ఇతర సాంకేతికత ద్వారా డ్రాగన్‌ఫ్రూట్ తరహా ఇతర ఫలాలను మరిన్ని కనుగొనాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం-గ్రామీణాభివృద్ధి అంశంపై పరిశోధనా పత్రాలతో వెలువరించిన ఇన్నోవేషన్స్ ఇన్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సెమినార్ డైరెకర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్, ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ రోహిణి కుసుమ, డాక్టర్‌సూర్యప్రకాశరావు, రామారావు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే ఉన్నతస్థాయికి చేరొచ్చు

శారదా కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో కొరియోగ్రాఫర్ శేఖర్



శేఖర్ మాస్టర్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

గాంధీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఏరంగంలోనైనా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ విద్యార్థులకు సూచించారు. గాంధీనగర్‌లోని శారదా జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన కళాశాల మధుర స్మృతులను విద్యార్థులతో పంచుకున్నారు. శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామ నారాయణ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎంతోమందికి ఉన్నత విద్యను అందించడం జరిగిందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సి.సత్యనారాయణ రెడ్డి, కరెస్పాండెంట్ ఎస్.ఎస్.వరప్రసాద్, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ పేర్ల శ్యామ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, కనకదుర్గ దేవాలయం ఆచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 45 మందికి ఉద్యోగార్హత

లబ్బీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 45 మంది విద్యార్థులు ఉద్యోగర్హత సాధించినట్లు నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. కళాశాలలో శనివారం ఐప్రాసెసింగ్ (ఐసీఐసీఐ బ్యాంక్), హెచ్‌డీబీ ఫైనాన్షియర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఐప్రాసింగ్‌కు 23మంది, హెచ్‌డీబీకి 22మంది విద్యార్థులు ఉద్యోగార్హత పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంక్ రీజనల్ హెడ్ రఘురామ్, ఐప్రాసెస్ హైరింగ్ బిజినెస్ పార్టనర్ టి.శశిధర్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ డిప్యూటీ మేనేజర్ బనోత్ చైతన్య, సీనియర్ సేల్స్‌మేనేజర్ లక్ష్మణ్, సేల్స్ మేనేజర్ పృథ్వీ తెలిపారు. ఉద్యోగార్హత సాధించిన విద్యార్థులనుచైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు.

మంత్రి కొల్లును కించపరిస్తే ఊరుకోం: భానుసింగ్

గాంధీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్రను కించ పరుస్తూ మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర బొందిలి సాధికారక సమితి రాష్ట్ర కన్వీనర్ నందేటి చంద్ర భానుసింగ్ తీవ్రంగా ఖండించారు. గాంధీనగర్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. పేర్ని నానికి జైలు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కొల్లు రవీంద్ర చాలా హుందాగా వ్యవహరించారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీ సంఘాలను ఐక్యం చేసి టీడీపీ కూటమి విజయానికి దోహదపడ్డారన్నారు. ఇప్పటికైనా సభ్యతతో మాట్లాడాలని, మరోసారి రవీంద్రను కించపరిచేలా మాట్లాడితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి







ప్రకృతి చిత్రం.. జీవన సౌందర్యం

నిజమైన అందం ఎక్కడుంది.. ఆధునిక నగరాల్లోనా.. లేక ప్రకృతి ఒడిలోనా అంటే ఖచ్చితంగా ప్రకృతిలోనే అని చెబుతాం. కాంక్రీట్ జంగిల్‌గా మారిన ఈ నగరాన్ని ప్రకృతి దగ్గరగా, పల్లె సౌందర్యాన్ని కళ్లకు కనిపించేలా చేసే వర్ణ చిత్రరాజాలు నగర గోడలపై దర్శనమిస్తున్నాయి. బెజవాడలో ఎంజీ రోడ్డు ఓ ఐకానిక్. నగరానికి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తున్న ఈ రోడ్డును 'సిటీ ఆన్ ఆర్ట్స్'లో భాగంగా కార్పొరేషన్ అధికారులు కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్డుకిరువైపులా గోడలపై చక్కటి పెయింటింగ్స్‌ను వేయిస్తున్నారు. ఇప్పటికే రాఘవయ్య పార్క్, నిర్మల్ హృదయ్ భవన్, బాపు మ్యూజియం, సబ్ కలెక్టరేట్ కార్యాలయం వైపు అత్యద్భుత వర్ణ చిత్రాలను ఆవిష్కరించారు. తాజాగా ఆలిండియా రేడియో (ఆకాశవాణి) గోడలపై మరింత అద్భుతమైన వర్ణ చిత్రాలను సాక్షాత్కరింపజేస్తున్నారు. ఈ చిత్రాలు అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఉల్లాసాన్ని పంచుతున్నాయి. గజిబిజి జీవితంలో ఉరుకులు, పరుగులు పెట్టేవారంతా ప్రయాణ సమయాల్లో ఈ పెయింటింగ్స్‌ను చూసి మనసును తేలిక పరచుకుంటున్నారు. విద్యార్థులైతే వాటి అందాలను ఆస్వాదిస్తూ ఊహాత్మక ప్రపంచంలో తేలియాడుతున్నారు. ఇలా... వాహ్ అనిపించేలా నయనమనోహరమైన వర్ణచిత్రాలతో ఎంజీ రోడ్డు సరికొత్తగా కళాత్మకంగా కనిపిస్తోంది. నగరమంతా ఇలా ఉంటే ఎంతో బాగుణ్ణు అనిపిస్తోంది కదా.. నగరంలోని కనకదుర్గ, బెంజి సర్కిల్, పోలీసు కంట్రోల్ రూమ్, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్లతో పాటు కనకదుర్గ వారధి వద్ద కూడా ఈ పెయింటింగ్స్ వేయించాలని కళాపిపాసులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్









దుర్గగుడిలో నేడు సరస్వతీయాగం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఆదివారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ యాగాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవో కె.రామచంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెల మూలానక్షత్రం నాడు సరస్వతీ యాగాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 23న ఆదివారం కూడా మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ యాగాన్ని నిర్వహిస్తున్నారు. మాఘమాసం కూడా రావటంతో సూర్యోపాసన సేవ జరుగుతుంది. ఈనెల 24, 26న కూడా సూర్యోపాసన సేవ నిర్వహించనున్నారు. శనివారం ఆలయంలో జరిగిన వివిధ ఆర్జిత సేవల్లో 380 మంది పాల్గొన్నారు. ఖడ్గమాల్చార్చనలో 24 మంది, చండీహోమంలో 49 మంది, లక్ష కుంకుమార్చనలో 10 మంది, శ్రీచక్ర నవావరణార్చనలో ఏడుగురు, వేద ఆశీర్వచనంలో 46 మంది, మల్లేశ్వరస్వామి అభిషేకంలో 15 మంది, పంచహారతుల్లో 25 మంది పాల్గొన్నారు.

నగరంలో 'పతంగ్' చిత్ర బృందం సందడి

లబ్బీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో పతంగ్ చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మొగల్రాజపురం సిద్ధార్థ కాలేజీ, కానూర సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన వేడుకల్లో చిత్రంలోని 3వ పాటను విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో ప్రణవ్ కౌశిక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు భారతీయ సినిమాల్లో ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి ఉంటారని, తొలిసారిగా పతంగుల పోటీతో రాబోతున్న స్పోర్ట్స్ కామెడీ డ్రామాగా తీసిన ఈ పతంగ్ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషాన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మాక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ పత్తిపాటి దర్శకుడిగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ సినిమా థియేటర్స్‌లో యూత్ ఫెస్టివల్‌గా, కొత్తగా, మంచి క్వాలిటీ ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో రిలీజ్ చేస్తున్నామన్నారు. మరో హీరో వంశీ పూజిత్, సంగీత దర్శకుడు జోస్ జిమ్మి, డ్యాన్స్ మాస్టర్ టిప్పు, చిత్ర నిర్మాతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు టౌన్ ఈఈ పీ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కబేళా ఇండస్ట్రియల్ 2 నుంచి 5 క్రాస్ రోడ్ల వరకు బ్రహ్మయ్య కాలనీ, కెనరాబ్యాంక్ వెనక భాగం తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నియంత్రణలోనే బర్డ్ ఫ్లూ

- అయినా అప్రమత్తంగా ఉన్నాం
- బయో సెక్యూరిటీ చర్యలను కొనసాగించాలి
- ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్ ఫ్లూ నియంత్రణలోనే ఉందని, అయినా అప్రమత్తంగానే ఉన్నామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. వైరస్ నివారణ, నియంత్రణ చర్యలపై సమీక్షించేందుకు కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని, రెవెన్యూ, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. ఎవరికైనా అపోహలుంటే అధికారులు, సిబ్బంది తొలగించాలని సూచించారు. ఏ కొండూరు మండలం, దీప్లానగర్ పరిసర ప్రాంతాల్లో నియంత్రణ, కట్టడి చర్యలను కొనసాగించాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి విషయంలోనూ నిర్దిష్ట స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని అనుసరించాలన్నారు. వలస, అటవీ పక్షుల్లో అసహజ మరణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్య కుమారి, డీడీ (ఏహెచ్) డాక్టర్ మోజెస్ వెస్లీ, ఏడీ డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

అందుబాటులో జీబీఎస్‌కు ఇంజక్షన్

- సూపరింటెండెంట్ ఏవీ రావు



ఆంధ్రజ్యోతి, ప్రభుత్వాసుపత్రి: జీబీఎస్ వ్యాధికి ప్రభుత్వాసుత్రిలో ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రికి సంబంధించిన వైద్య సేవలు, పలు విషయాలపై స్పందించారు.

ప్రశ్న: కొత్త ప్రభుత్వాసుపత్రిలో నూతన భవనాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారు. ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

ఏవీ రావు: నూతన భవనాన్ని 2025 ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తెస్తాం. బిల్లుల చెల్లింపులు డీఎమ్ఈ పరిధిలో ఉంటుంది.

ప్రశ్న: జీబీఎస్ కేసులకు సంబంధించి ప్రభుత్వాసుపత్రిలో ఎలాంటి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు

ఏవీ రావు: శరీర రోగనిరోధక ప్రతిచర్య వల్ల జీబీఎస్ వ్యాధి వస్తుంది. ఈవ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులకు జనరల్ మెడిసిన్, న్యూరాలజీ విభాగాలకు చెందిన వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్ అందుబాటులో ఉంది.

ప్రశ్న: రోగుల రద్దీని తగ్గించేందుకు ఓపీ సేవలు అందరికీ అందేలా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఏవీ రావు: ఎక్కడైతే ఓపీ తక్కువగా ఉంటుందో అక్కడున్న సిబ్బందిని ఓపీ ఎక్కువగా ఉన్న చోటికి పంపి వైద్య సేవలందిస్తున్నాం.

ప్రశ్న: మందుల కొరత ఉందా, ఏఏ మందులు లేవు, ఎన్ని మందులు కొంటున్నారు, బడ్జెట్ ఎంత? నిధులు వస్తున్నాయా లేదా?

ఏవీ రావు: మందులు కొరత ఏం లేదు. అవసరమైతే బయట నుంచి మందులు కొనుగోలు చేస్తున్నాం. అన్ని మందులు అందుబాటులో ఉంచుతున్నాం.

ప్రశ్న: ప్రభుత్వాసుపత్రిలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని ఆరోపణలున్నాయి. పని చేస్తున్నాయా లేదా?

ఏవీ రావు: ఆసుపత్రిలో అన్ని సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. పని చేయని వాటిని గుర్తించి వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నాం.

ప్రశ్న: సెక్యూరిటీ సిబ్బంది ఎంత మంది ఉన్నారు. అందరూ పని చేస్తున్నారా, కొందరు విధులకు రావడం లేదని ఆరోపణలున్నాయి.

ఏవీ రావు: ప్రభుత్వాసుపత్రిలో 169 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. వారు 3 షిఫ్టుల్లో పని చేస్తున్నారు.

బీసీల ఆత్మాభిమానం జోలికి వస్తే ఖబడ్దార్

- మాజీ మంత్రి పేర్నికి గురుమూర్తి హెచ్చరిక

వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆత్మాభిమానం జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానీని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి శనివారం హెచ్చరించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ అంటేనే బీసీలని, బీసీలంటేనే టీడీపీ అని అన్నారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా సముచిత స్థానం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని శుక్రవారం బీసీ నేత, మంత్రి కొల్లు రవీంద్రపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీసీలను చులకన చేసి మాట్లాడితే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. రాష్ట్ర కేబినెట్‌లో దాదాపు 8 మంది బీసీలు మంత్రులుగా ఉన్నారన్నారు. మచిలీపట్నంలో జగన్ పాలనలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదని విమర్శించారు. రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని పేర్ని నాని మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు.



టీడీ జనార్ధన్‌ను సత్కరిస్తున్న ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ సంస్థ ప్రతినిధులు

గత ప్రభుత్వంలో పెన్షనర్లకు ఇబ్బందులు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడిన ఉద్యోగులు, పెన్షనర్లు ఆ బాధల నుంచి విముక్తి పొందేందుకు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ అన్నారు. ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో శనివారం ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అన్ని వర్గాల ప్రజలు పనిచేశారని, ముఖ్యంగా ఉద్యోగులు, పెన్షనర్ల పాత్ర ఎక్కువన్నారు. పెన్షనర్ల అపరిష్కృత సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని అన్నారు. ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులకు ముఖ్యమంత్రితో కలిసే అవకాశం కల్పించడం ద్వారా వారి సమస్యలు నేరుగా వివరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న సమస్యలు, పడిన కష్టాలను ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులు వివరించారు. పార్టీ అధ్యక్షుడు పాలంకి సుబ్బరామన్, జనరల్ సెక్రటరీ పెద్దన్న గౌడ్, ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ మునయ్య, పార్టీ ప్రతినిధులు సుధాకర్, జయ రామప్ప, సతీష్, నాగభూషణం, శాస్త్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మంగళగిరి క్రైం పోలీసుల అదుపులో వన్‌టౌన్ బంగారం వ్యాపారి

సుమారు రూ.20 లక్షల విలువైన 300 గ్రాముల స్వాధీనం?

వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ శివాలయం వీధిలో బంగారం వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారిని మంగళగిరి క్రైం పోలీసులు శనివారం తెల్లవారుజామున అతడి ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. చిట్టినగర్‌లో నివాసముంటున్న అవ్వారు గంగాధర్ వన్‌టౌన్ శివాలయం వీధి, బాబు ఆయిల్ దుకాణం సమీపంలోని బిల్డింగ్ మొదటి అంతస్తులో విఘ్నేశ్వర జ్యూయలరీ పేరుతో బంగారం వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల మంగళగిరికి చెందిన పలువురు నేరస్థుల వద్ద దొంగ బంగారం కొనుగోలు చేసినట్టు సమాచారం. మంగళగిరి క్రైం పోలీసులు 3 రోజుల క్రితం పలు చోరీ కేసుల్లో నేరస్థులను అదుపులోకి తీసుకుని విచారించగా గంగాధర్‌కు అమ్మినట్టు తెలిపారు. 4రోజుల క్రితం గంగాధర్ బంగారం షాపు దగ్ధమైంది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పోలీసులకు కూడా ఫిర్యాదు చేయకపోవటంపై అనుమానాలు మరింత బలపడ్డాయి. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున మంగళగిరి క్రైం పోలీసులు చిట్టినగర్‌లోని ఇంటికి వెళ్లి గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని సుమారు రూ.20లక్షల విలువైన 300 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని మంగళగిరి క్రైం పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారిస్తున్నట్టు సమాచారం.

వార్డెన్, ఏబీసీడబ్ల్యువో సస్పెన్షన్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మైలవరం, ఫిబ్రవరి 22 (ఆంధజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ కట్టా రమాదేవి, ఏబీసీడబ్ల్యువో రవి ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. 'వామ్మో వసతి గృహం' అనే శీర్షికన ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలో విద్యార్థుల ఇబ్బందులు, వార్డెన్ నిర్వాకాన్ని కళ్లకు కట్టినట్టు వివరించడంతో మరుసటి రోజు డీ బీసీడబ్ల్యువో మల్లేశ్వరరావు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుని వార్డెన్ నిర్వాకంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రెండేళ్ల నుంచి వసతి గృహానికి రానందుకు వార్డెన్‌పై, ఏబీసీడబ్ల్యుగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన 3 మాసాల్లో వార్డెన్ నిర్వాకంపై చర్యలు తీసుకోనందుకు అతడిపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా శనివారం వార్డెన్‌తో పాటు ఏబీసీడబ్ల్యువోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఉత్తర్వులు ఇచ్చినట్టు డీబీసీడబ్ల్యువో తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పామర్రు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లకుంటలో ఉన్న ఏపీ ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు మార్చి 6లోపు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన దరఖాస్తులను అనుసరించి ఏప్రిల్ 6న ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని రమేష్ కోరారు.

డయాగ్రిడ్ డిజైన్‌తో రాజధాని టవర్లు

(5వ పేజీ తరువాయి)

డిజైన్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దీనిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సాధారణంగా భవన నిర్మాణాల కోసం ముందుగా పునాదులు తవ్వుతారు. దాని ఆధారంగా పిల్లర్లను, వాటిపై శ్లాబ్ వేస్తారు. డయాగ్రిడ్.. అంటే డయాగ్నల్‌గా గ్రిడ్ రూపంలో ఉండే భవంతి డిజైన్‌లో ముందుగా మధ్యలో ఒక పెద్ద దిమ్మ తరహాలో నిటారుగా పిల్లర్‌ను పైకి లేపుతారు. పిల్లర్ చివరిలో శ్లాబులను వేసేందుకు అనువుగా కాంక్రీట్‌తో కూడిన సపోర్టును ఇస్తారు. వాటిని ఆధారంగా చేసుకుని శ్లాబులు వేస్తారు. అంటే.. సైకిల్ లేదా మోటారు సైకిల్ చక్రాన్ని పడుకోబెడితే.. మధ్యలోని హబ్ బేస్‌గా ఉంటుంది. దానిని ఆధారం చేసుకుని రిమ్‌కు ఊచలు కలిపి ఉంటాయి. ఇదే తరహాలో డయాగ్రిడ్ డిజైన్ కూడా ఉంటుంది. ఏమూలగా అతికించిన ఐరన్, కలప లేదా కాంక్రీట్ బీమ్‌లతో ఒక్కో ఫ్లోర్‌ను తీర్చిదిద్దుతారు. చుట్టు అద్దాలు అతికించి బిల్డింగ్‌ను నిర్మిస్తారు. సంప్రదాయ విధానంలో వాడే ఇనుము కన్నా డయాగ్రిడ్ విధానంలో ఇనుమును తక్కువగా వినియోగిస్తారు.

ముఖ్యమైన నిర్ణయాలు ఇవీ..

- రాజధాని అమరావతికి ప్రస్తుతం ఇరుకుగా ఉన్న కృష్ణా నది కరకట్ట మీదుగా వెళ్లాలి. ఈ రోడ్డుపై ఎదురెదురుగా రెండు వరుసల్లో భారీ వాహనాలు వెళ్లే వీలులేదు. అందువల్ల కరకట్ట మీదుగా రాజధాని నగరానికి విశాలమైన నాలుగు వరుసల రహదారి నిర్మాణం అత్యవసరంగా చేపట్టాలని, దీని కోసం కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. రిటైనింగ్‌వాల్‌ను నిర్మించకుండా బంకమట్టి వేసి దానిపై రహదారి నిర్మాణం చేపడితే.. రక్షణ లేకపోవడమే కాకుండా నిర్మాణ వ్యయం రూ. 2,600 కోట్లు ఖర్చవుతుందని ఉన్నతస్థాయి సమీక్షలో వెల్లడించారు. కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్ నిర్మించి రహదారి వేస్తే రూ. 1,800 కోట్లు వ్యయం అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు లెక్కలుగట్టారు. రక్షణ గోడలతో రహదారికి భద్రత ఉండటమే కాకుండా.. నిర్మాణ వ్యయమూ తగ్గుతుండటంతో ఈ విధానంలోనే రోడ్డు నిర్మించాలని ఉన్నత స్థాయి సమావేశంలో తీర్మానించారు.
- రాజధాని నగరంలోని నిర్మాణాలను మునిసిపల్, ఇరిగేషన్, ఇంధన తదితర శాఖల సమన్వయంతో చేపట్టాలని.. ఒక టీమ్‌వర్క్‌గా నిర్మాణ పనులు జరగాలని నిర్ణయించారు. భవన నిర్మాణాలతో సహా.. మౌలిక సదుపాయాల విషయంలోనూ ప్రణాళిక మేరకు ముందుకువెళ్లాల్సిన అవసరం ఉందని ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్ణయించింది.
- రాజధాని భవన నిర్మాణాలు సంక్లిష్టమైన సాంకేతిక విధానాలతో కూడుకున్నవి. వీటికి స్టాండర్డ్ షెడ్యూల్ రేట్ (ఎస్‌ఎస్‌ఆర్) నిర్ధారణ కాలేదు. ఎస్‌ఎస్ఆర్ రేట్లను ఖరారు చేయడానికి సిఫారసు చేయాలని తీర్మానించారు. డయాగ్రిడ్ డిజైన్‌లో నిర్మాణంలో వాడే స్టీల్ అత్యంత ఖరీదుతో కూడుకున్నది. ఫ్యాబ్రికేషన్, వెల్డింగ్‌ను కూడా అత్యాధునిక సాంకేతిక విధానంలో చేపట్టాల్సి ఉంటుంది. దీనికి నిపుణులైన పనివారు అవసరమవుతారు. వీరికి సాధారణ కూలీలకంటే రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా ఎస్‌ఎస్‌ఆర్‌లో లేవు. అందువల్ల దీనిని కూడా ఎస్‌ఎస్‌ఆర్‌లో చేర్చాల్సి ఉందని ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. ఇక భారీ నిర్మాణాల్లో అగ్ని నిరోధక విధానాలను అవలంభించాల్సి ఉంటుంది. భారీ అగ్ని ప్రమాదాలను, భారీ ఆస్తి, ప్రాణ నష్టం నివారించడానికి ఇది తప్పనిసరి. అందువల్ల అగ్ని నిరోధక విధానాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని ఉన్నతస్థాయి సమావేశం అభిప్రాయం వ్యక్తంచేసింది.

యుక్తవయసు పిల్లలకు ఇవి చెప్పండి..!

పిల్లలకు యుక్తవయసులో సొంత ఆలోచనలు, అభిప్రాయాలు ఏర్పడుతూ ఉంటాయి. తల్లిదండ్రులు వాటిని గౌరవిస్తూనే తగిన మార్గనిర్దేశనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. యుక్తవయసు పిల్లలకు ఏ అంశాలు ఎలా వివరించాలో తెలుసుకుందాం.

- మానసిక ఆరోగ్యం గురించి తల్లిదండ్రులు వివరించి చెప్పాలి. భావోద్వేగాల నియంత్రణతోపాటు ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకునే మార్గాలు తెలియజేయాలి.
- ఆన్‌లైన్ మోసాలను వివరించాలి. సామాజిక మాధ్యమాల్లో జాగరూకతతో వ్యవహరించమని చెప్పాలి.
- సంబంధ బాంధవ్యాలు, గౌరవం, భావ వ్యక్తీకరణ గురించి యుక్తవయసు పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించాలి.
- డ్రగ్స్, మద్యం, సిగరెట్ లాంటి అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ వాటికి దూరంగా ఉండమని చెప్పాలి. స్నేహితుల నుంచి ఈ అలవాట్లు చేసుకోకుండా అవగాహన కల్పించాలి.
- పిల్లల అభిరుచులను ప్రోత్సహించాలి. తమ శక్తిని తక్కువ అంచనా వేసుకోకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకొమ్మని చెప్పాలి.
- చదువు వల్ల ఒత్తిడికి గురికాకుండా ఇష్టంగా చదువుకునే విధానాలను చర్చించాలి. పరీక్షల విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని హెచ్చరించాలి. ఈర్ష్య, అసూయలకు తావు లేకుండా స్నేహితుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని చెప్పాలి.



- డబ్బు విలువ తెలియజెప్పాలి. ఖర్చు చేసే విధానం, పొదుపు మార్గాలను వివరించాలి.
- ఓటమి ఎదురైనప్పుడు నిరాశ పడకుండా ధైర్యంగా ముందుకు సాగే విధానాన్ని వివరించాలి.
- ప్రేమ పేరుతో జరిగే మోసాలను వివరించి చెప్పాలి.
- వ్యక్తిగత శ్రద్ధతోపాటు తోటివారితో స్నేహంగా మెలగడం, దయతో ప్రవర్తించడం, అవసరమైనవారికి సహాయ సహకారాలు అందించడం లాంటివి ప్రత్యేక గౌరవాన్ని అందిస్తాయని చెప్పాలి.

మిస్ వరల్డ్

ఈసారి ప్రపంచ సుందరి పోటీలకు భాగ్యనగరం వేదిక కానుంది. మే 7 నుంచి 31 వరకు జరిగే ఈ అందాల పండుగపై అప్పుడే అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ప్రపంచ సుందరి పోటీలను భారత్‌లో నిర్వహించటం ఇది మూడవసారి. తెలుగు రాష్ట్రాలలో జరగటం ఇదే మొదటిసారి. ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొంటారు. కాగా 1997లో హైదరాబాద్ అమ్మాయి డయానా హెడెన్ ఈ కిరీటాన్ని దక్కించుకుంది.



రీటా ఫారియా

ప్రియాంక చోప్రా



ఐశ్వర్యా రాయ్

యుక్తా ముఖి

భాగ్యనగరానికి అందాల సోయగాలు!



దయానా హెడెన్

మానుషి చిల్లర్

పోటీల ప్రస్థానం

ప్రపంచ సుందరి పోటీలు మొదటిసారి 1951లో ఇంగ్లండ్‌లో ప్రారంభమయ్యాయి. ఇంగ్లండ్‌కు చెందిన 'ఎరిక్ మోర్లీ' ఈ పోటీల సృష్టికర్త. 2000 సంవత్సరంలో ఎరిక్ మరణించిన తర్వాత ఆయన భార్య జులియా మోర్లీ ఈ పోటీలకు సారథ్యం వహిస్తున్నారు. స్వీడన్‌కు చెందిన మోడల్... కికి హకాన్సన్ 1951లో తొలి ప్రపంచ సుందరిగా ఎంపిక అయింది. మొదట్లో ఈ పోటీల పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఈ విమర్శలు ఈ అందాల పోటీల ఆదరణను ఏ మాత్రం తగ్గించలేకపోయాయి. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో మన దేశంలో కూడా ఈ పోటీల పట్ల పెరిగింది. 2000 సంవత్సరం తర్వాత ఈ పోటీలను కేవలం శారీరక సౌందర్యానికి మాత్రమే పరిమితం చేయకుండా మహిళలకు సాధికారత కల్పించే ప్రయత్నంగా చూపించటం మొదలుపెట్టారు. ఒక వ్యక్తికి ఉన్న సామాజిక బాధ్యతను గుర్తుచేసే విధంగా... 'బ్యూటీ విత్ పర్పస్' అనే నినాదాన్ని బాగా ప్రచారంలోకి తీసుకువచ్చారు.

ఎలా ఎంపిక చేస్తారు?

ప్రతి ఏటా సుమారు 120 దేశాలలో 'మిస్ వరల్డ్' ప్రాథమిక అందాల పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఫైనల్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. వీరందరూ సుమారు మూడు వారాలు జరిగే వేర్వేరు విభాగాల పోటీలలో పాల్గొనాల్సి ఉంటుంది. బీచ్ ఫ్యాషన్, బ్యూటీ విత్ పర్పస్, మల్టీ మీడియా, స్పోర్ట్స్, టాలెంట్, టాప్ మోడల్, కంటెస్టెంట్స్ ఛాయిస్ లాంటి అనేక విభాగాలు ఉంటాయి. ఈ విభాగాలలో విజేతలుగా నిలిచిన వారిని.. వేర్వేరు ఇంటర్వ్యూలలో గెలిచిన వారిని మిస్ వరల్డ్ ఫైనల్స్ పోటీలకు పంపుతారు. వీరి సంఖ్య ఆ ఏడాది పాల్గొనే వారి సంఖ్య ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ తుది పోటీలలో న్యాయ నిర్ణేతలు తుది విజేతలను ఎంపిక చేస్తారు. తుది విజేతకు మిస్ వరల్డ్ టైటిల్.. సుమారు 10 కోట్ల రూపాయల బహుమతి, వజ్రాల కిరీటంతో పాటు అనేక రకాల బహుమతులు దక్కుతాయి. ఈ బహుమతుల విలువ ప్రతి ఏడాది మారుతూ ఉంటుంది. ప్రపంచ సుందరిగా గెలిచినవారు... ఆ ఏడాది పొడవునా ప్రపంచ సుందరి సంస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ.. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటిస్తారు. వీరిని అనేక బహుళ జాతి కంపెనీలు.. ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలు తమ బ్రాండ్ అంబాసిడర్‌లుగా నియమించుకుంటాయి. ప్రపంచ సుందరి పోటీలలో గెలిచిన భామకు ఏడాది పాటు మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించే సంస్థ అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. వారికి ఉచిత దుస్తులు, విమాన సౌకర్యం, హోటల్స్ సౌకర్యం, ఆభరణాల సౌకర్యం, మేకప్ సౌకర్యం, స్టైలింగ్ సౌకర్యం అందిస్తుంది.

ఆ ఆరుగురు వీరే

మన దేశం నుంచి ఆరుగురు అందగత్తెలు ప్రపంచ సుందరులుగా ఎంపికయ్యారు. వాళ్లెవరంటే...

- రీటా ఫారియా (1966)
- ఐశ్వర్యా రాయ్ (1994)
- డయానా హెడెన్ (1997)
- యుక్తా ముఖి (1999)
- ప్రియాంక చోప్రా (2000)
- మానుషి చిల్లర్ (2017)



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డబ్బా కార్టెల్	హిందీ సిరీస్(తెలుగులో)	ఫిబ్రవరి 28
అమెజాన్ ప్రైమ్		
జిద్దీ గర్ల్స్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 27
హౌస్ ఆఫ్ డేవిడ్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 27
సుషల్	తమిళ సిరీస్	ఫిబ్రవరి 28
సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
సూట్స్: లాస్ ఏంజెలెస్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 24
బీటిల్‌జ్యూస్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 28
లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్	మలయాళ సిరీస్ (తెలుగులో)	ఫిబ్రవరి 28
ది వాస్ప్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 28
ఎంఎక్స్ ప్లేయర్		
ఆశ్రమ్ 3	హిందీ సిరీస్ 2	ఫిబ్రవరి 27

డబ్బాలో డ్రగ్స్



డబ్బా డెలివరీ వ్యాపారం ద్వారా డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించిన ఐదుగురు సాధారణ మహిళల జీవితంలో జరిగిన సంఘటనలు ఇతివృత్తంగా రూపొందిన హిందీ సిరీస్ 'డబ్బా కార్టెల్'. ముంబైలోని కొందరు గృహిణులు ముఠాగా ఏర్పడి డబ్బావాలాల ముసుగులో మత్తు పదార్థాలను సరఫరా చేస్తుంటారు. ఈ విషయం తెలుసుకున్న డ్రగ్స్ మాఫియా ఆ మహిళలను బెదిరించి వారిని డ్రగ్స్ సరఫరాకు ఉపయోగించుకుంటుంది. ఆ క్రమంలో అటు మాఫియా, ఇటు పోలీసులతో ఆ ఐదుగురు మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు, వాటిని ఎలా అధిగమించారు అనే ఇతివృత్తంగా ఈ సిరీస్ సాగుతుంది. ఈ థ్రిల్లర్ సిరీస్‌లో షబానా అజ్మీ, నిమిషా సజయన్, షాలినీ పాండే, అంజలి, జ్యోతిక ప్రధాన పాత్రలు పోషించారు. హితేశ్ భాటియా దర్శకత్వం వహించారు.

'గేమ్ ఛేంజర్' సినిమా విడుదలయిన ఆరు గంటలలోపులోనే ఈ చిత్రం హెచ్‌డీ ప్రింట్‌ను కొందరు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంచారు. ఆ తర్వాత ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, టెలిగ్రామ్, వాట్సప్ లాంటి మాధ్యమాల ద్వారా ఎన్ని లక్షల మంది దీనిని డౌన్‌లోడ్ చేసి ఉంటారో చెప్పటానికి లెక్కలు అందుబాటులో లేవు.. కేవలం 'గేమ్ ఛేంజర్' మాత్రమే కాదు.. ఆ తర్వాత వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం', 'డాకు మహారాజ్', 'తండేల్' లాంటి సినిమాలన్నింటినీ కూడా ఈ పైరసీ భూతం మింగేయటానికి చూసింది. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సినిమాలు తీసే నిర్మాతలు ఆశించేది మొదటి వారం కలెక్షన్లు. వీటిని ఈ పైరసీ భూతం దారుణంగా దెబ్బతీస్తోంది.

పైరసీ భూతముంది జాగ్రత్త!



ఒకప్పుడు ఇంటర్నెట్ అందరికీ అందుబాటులో లేని సమయంలో కొత్త సినిమాలను వీడియో క్యాసెట్ల రూపంలో విడుదల చేసేవారు. వీటికి విపరీతమైన డిమాండ్ ఉండేది. ఆ తర్వాతి కాలంలో సీడీలు వచ్చాయి. వాటికి డిమాండ్ ఉండేది. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత సోషల్ మీడియా ద్వారా పైరసీ సులభమయిపోయింది. ఇంటర్నెట్ ఉంటే చాలు... కొత్త కొత్త సినిమాలను అందించే 'ఐబొమ్మ' లాంటి వెబ్‌సైట్లు ఎన్నో పుట్టుకువచ్చాయి. గతంలో క్యాసెట్లు, సీడీలు ఉన్న సమయంలో... పైరసీ చేయాలంటే వాటిని కాపీలు తీయాల్సి వచ్చేది. దీనికి సమయం పట్టేది. కానీ ఇప్పుడు ఒక్క కాపీని సోషల్ మీడియాలో పెడితే చాలు... నిమిషాల్లో వేల సంఖ్యలో డౌన్‌లోడ్ అయిపోతోంది. ఆ తర్వాత గ్రూపుల ద్వారా లక్షల మందికి చేరిపోతోంది. దీని వల్ల తీవ్రంగా నష్టపోతుంది నిర్మాతలే అనటంలో ఎటువంటి సందేహం లేదు.

చర్యలేవీ?

పైరసీ వల్ల కలిగే సమస్యలను చిత్ర పరిశ్రమ ముందే పసిగట్టింది. అందుకే పైరసీని అరికట్టడానికి... ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ఒక సెల్‌ను ఏర్పాటు చేసింది. థియేటర్లలో విడుదలయ్యే ప్రతి సినిమా నుంచి ఈ సెల్ కొంత ఫీజు వసూలు చేస్తుంది. ఈ ఫీజును ఉపయోగించి సినిమాలు పైరసీ కాకుండా అడ్డుకుంటామనేది సెల్ చెబుతూ ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో పెద్ద పెద్ద చిత్రాలు పైరసీ కావటం వల్ల ఈ సెల్ వల్ల పెద్ద ప్రయోజనం లేదనే విషయం స్పష్టమవుతోంది. "ఈ సెల్ వల్ల ప్రయోజనం ఏమి లేదు. పైరసీని అడ్డుకోవటం అంత సులభం కాదు. ఎందుకంటే ప్రస్తుతం సినిమాలన్నీ డిజిటల్ రూపంలోనే ఉంటున్నాయి. ఫిల్మింగ్, ఎడిటింగ్ నుంచి ఫైనల్ కాపీ వరకు ఎక్కడైనా లీక్ కావచ్చు. అంతేకాదు. ప్రస్తుతం సినిమాలు 'క్యూబ్' లాంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా డిజిటల్ రూపంలో థియేటర్లకు చేరుతున్నాయి. అక్కడ కూడా లీక్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకు నాకు తెలిసి హెచ్‌డీ కాపీ తొలి



రోజున ఎప్పుడూ లీక్ కాలేదు. 'గేమ్ ఛేంజర్' విషయంలోనే ఇది జరిగింది. దీనిపై సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. కేసు ఒక కొలిక్కి వచ్చిందని వార్తలు వచ్చాయి. ఒకవేళ ఎవరు దాన్ని లీక్ చేశారో తెలిసినా వారిపై కేసు పెట్టి నేరం నిరూపించటం అంత సులభం కాదు. అందువల్లే పోలీసులు కూడా ఏం చేయలేకపోతున్నారు..." అని పేరు చెప్పటానికి ఇష్టం లేని ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

పరిష్కారం లేదా?

ఒక పెద్ద సినిమా విడుదలయిన వెంటనే దాని కాపీని ఏదో ఒక విధంగా సంపాదించి




ఆన్‌లైన్‌లో పెట్టడానికి అనేక మంది ప్రయత్నిస్తూ ఉంటారు. ఇలా ఒక వెబ్‌సైట్‌లోనో, ట్విట్టర్ అకౌంట్‌లోనో పెట్టిన వెంటనే ఆ అకౌంట్స్‌ను డిలీట్ చేయించటానికి నిర్మాతలు కొన్ని ప్రైవేట్ సంస్థల సహకారం తీసుకుంటున్నారు. ఈ సంస్థలు... ఆ వెబ్‌సైట్ల హోస్ట్‌లతో మాట్లాడి... వాటిని తొలగిస్తున్నాయి. అయితే పోలీసుల పరంగా వెంటనే చర్యలు తీసుకోలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పైరసీ సమస్యను గుర్తించింది. పైరసీని అరికట్టే చర్యల్లో భాగంగా... కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్లను నియమించింది. ముంబయిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఏదైనా సినిమా పైరసీకి గురయిందని ఫిర్యాదు చేస్తే- 48 గంటల్లో ఆ కంటెంట్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే దీని వల్ల పెద్ద ప్రయోజనం లేదని, చట్టాల్లో మార్పులు రావాలని అంటున్నారు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్. "పైరసీపై ఫిర్యాదు అందిన తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఫైలింగ్ ప్రాసెస్‌లో వెళితే మూడు నాలుగు రోజులు పడుతుంది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. పైరసీ విషయంలో పౌర సమాజం స్పందించాలి. దానికి అడ్డుకట్టవేయాలి" అంటారాయన. పెద్ద పెద్ద సినిమాలకు భారీగా నష్టం చేకూరుస్తున్న పైరసీని అరికట్టాలంటే... పౌర సమాజంలో కూడా అవగాహన పెరగాలి. దీనికి సినీ పరిశ్రమే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించుకొని అమలు చేయాలి. అప్పుడే 'పైరసీ' అనే విలన్ ఓడిపోయి కథ సుఖాంతం అవుతుంది. లేకపోతే ఇబ్బందులు తప్పవు.

- పైరసీ కాపీలు ఎక్కువగా వాట్సప్, టెలిగ్రామ్‌ల ద్వారా వ్యాప్తి చెందుతున్నాయి. చట్టరీత్యా పైరసీ సినిమాలను గ్రూపుల్లో పెట్టినా నేరమే! అందువల్ల గ్రూప్ అడ్మిన్‌లు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే చట్టరీత్యా ఇబ్బంది పడే అవకాశముంది.
- సాధారణంగా పైరసీ కాపీలు అందుబాటులో ఉండే సైట్లను విదేశాల నుంచి హోస్ట్ చేస్తున్నారు. అందువల్ల వీటిని తొలగించటం అంత సులభం కాదు.
- కొత్త సినిమాటోగ్రఫీ చట్టం కింద... సినిమాలను అనధికారికంగా రికార్డు చేసినా, అనుమతి లేకుండా బహిరంగంగా ప్రదర్శించినా, ఆన్‌లైన్‌లో, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినా... మూడు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

ద్రాక్షపండ్లను ఇలా తినాలి...

బజారు నుంచి ద్రాక్షపండ్లు తెచ్చాక వాటిని సరైన పద్ధతిలో కడిగిన తరవాతనే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటిపై ఉండే పురుగుమందుల అవశేషాల వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

- ముందుగా ద్రాక్షపండ్లను గుత్తినుంచి వేరు చేయాలి. మెత్తగా ఉండి చెడిపోయినవాటిని, సగానికి కోసుకుపోయినవాటిని ఏరివేయాలి.
- వెడల్పాటి గిన్నెలో సగానికిపైగా గోరువెచ్చని నీళ్లు పోయాలి. ఇందులో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు, ఒక చెంచా వంటసోడా వేసి బాగా కలపాలి. తరవాత ద్రాక్షపండ్లు వేసి మెల్లగా రుద్దుతూ కడగాలి. రెండు నిమిషాలు అలాగే ఉంచాలి.



తరవాత ఈ నీళ్లు తీసివేసి మంచినీళ్లు పోసి మరోసారి కడగాలి. పలుచని గుడ్డమీద ద్రాక్షపండ్లు వేసి తడి ఆరనివ్వాలి. తరవాత ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకోవచ్చు.

- పెద్ద గిన్నెలో సగం వరకు నీళ్లు పోసి మూడు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఇందులో ద్రాక్షపండ్లు వేసి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత వీటిని మంచినీళ్లతో మరోసారి కడిగి ఆరబెట్టాలి.
- ఇలా శుభ్రం చేసిన తరవాతనే ద్రాక్షపండ్లను పిల్లలకు, పెద్దలకు తినిపించాలి.

పంజాబ్‌లో లేని శాఖకు మంత్రిగారు!



చండీగఢ్, ఫిబ్రవరి 22: పంజాబ్‌లో ఉనికిలో లేని ఓ శాఖకు ఓ మంత్రి బాధ్యతలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం 20 నెలలు తరువాత గుర్తించింది. దానిని సవరించేందుకు ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో ఆ విషయం వెల్లడయింది. పంజాబ్‌లో 2022, మార్చిలో భగవంత్ మాన్ నేతృత్వంలో ఏర్పడిన ఆప్ ప్రభుత్వం... మే, 2023లో మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ చేసింది. ఆ క్రమంలో అప్పటి వరకూ వ్యవసాయం, రైతు సంక్షేమం శాఖలను నిర్వహించిన కుల్‌దీప్ సింగ్ ధలివాల్‌కు ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలను అప్పగించింది. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ ప్రభుత్వంలో లేదు. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు తనకు కేటాయించిన శాఖకు కార్యదర్శి లేకపోవడంతో ధలివాల్ ప్రభుత్వాన్ని వివరణ కూడా కోరినట్లు తెలిసింది. అయితే తాజాగా ఫిబ్రవరి 7న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గెజిట్ విడుదల చేశారు. దీనిపై బీజేపీ విమర్శలకు దిగింది. 'పంజాబ్‌లో పాలనను ఆప్ జోక్‌గా మార్చింది. ఉనికిలో లేని శాఖకు 20 నెలలుగా ఆ మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. ఈ విషయం సీఎంకు కూడా తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో ఆలోచించుకోండి' అని ఎద్దేవా చేసింది.

ముక్కులో వేలెట్టి రుద్దాడని 145 ఏళ్ల నాటి డెస్క్‌నే మార్చేశారు!



వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అది అమెరికా వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులోని 145 ఏళ్లనాటి 'రెసొల్యూట్ డెస్క్'! ఉడ్రో విల్సన్, ట్రుమన్, జాన్ ఎఫ్ కెన్నడీ, రీగన్, క్లింటన్, ఒబామా.. ఇలా ఎంతో మంది అధ్యక్షులు ఎన్నో ముఖ్యమైన ఫైళ్ల పెట్టుకొని సంతకాలు చేసిన డెస్క్ అది! మొన్నటిదాకా అధ్యక్షుడిగా పనిచేసిన బైడెన్, రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ట్రంప్ కూడా నిన్నటిదాకా ఈ డెస్క్‌నే ఉపయోగించారు. అయితే ఎలాన్ మస్క్ నాలుగేళ్ల కుమారుడి తెలిసీ తెలియని చేష్టలు దశాబ్దాల చరిత్ర గల ఈ డెస్క్‌ను పక్కనబెట్టేలా చేశాయి. ఇటీవల ఓవల్ ఆఫీసులో తన కుమారుడితో కలిసి ట్రంప్‌తో మస్క్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మస్క్ భుజానెక్కుతూ.. ఆఫీసులో కలియతిరుగుతూ ఆ చిన్నారి చేసిన అల్లరి అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో ఆ చిన్నారి.. ముక్కులో వేలు పెట్టుకొని ఆ వేలును ట్రంప్ ఎదురుగా ఉన్న 'రెసల్యూట్ డెస్క్'కు రుద్దడం వంటి పనులు చేశారు. అతి పరిశుభ్రత పాటించే ట్రంప్ ఆ చిన్నారి చేష్ట కారణంగా రెసొల్యూట్ డెస్క్‌ను ఆఫీసు నుంచి తాత్కాలికంగా తొలగించాలని ఆదేశించారు. దాని స్థానంలో 'సీ అండ్ ఓ' డెస్క్‌ను పెట్టించారు. సీఅండ్‌ఓ డెస్క్‌ను జార్జ్ బుష్ తదితర అధ్యక్షులు ఉపయోగించారు అని ట్రంప్ పేర్కొన్నారు. 1880లో బ్రిటన్ రాణి క్వీన్ విక్టోరియా ఈ రెసొల్యూట్ డెస్క్‌ను నాటి అధ్యక్షుడు రుథర్‌ఫోర్డ్‌కు బహుమతిగా ఇచ్చారు.

కేంద్ర మంత్రికి విమానంలో విరిగిన సీటు



భోపాల్/ముంబై, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విమానయాన సంస్థ ఎయిరిండియాపై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ మండిపడ్డారు. తాను ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సమయంలో తనకు విరిగిన, కిందకు దిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనైతికమని, ప్రయాణికుల నుంచి పూర్తి చార్జీ వసూలు చేసే సంస్థ.. వారికి విరిగిపోయిన సీట్లు కేటాయించడం మోసగించడమేనంటూ తనకు ఎదురైన అనుభవాన్ని శనివారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. తన సీటే కాకుండా విమానంలోని మరి కొన్ని సీట్లు కూడా ఇదేవిధంగా ఉన్నాయని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీటులో కూర్చోమని ఆఫర్ చేశారని, అయితే వారికి ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశంతో తాను ఆ విరిగిన సీటులోనే ప్రయాణం చేశానని తెలిపారు. దీనిపై ఎయిరిండియా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని డీజీసీఏ ఎయిరిండియా విమాన సంస్థను ఆదేశించింది.

వాహనం రిజిస్టరై 20 ఏళ్లు దాటితే..
ఏడాదికి బైక్‌కు రూ.2 వేలు.. కారుకు రూ.10వేలు

» రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చార్జీల పెంపునకు కేంద్రం ప్రతిపాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల వయసు దాటిన వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ) రెన్యూవల్ చార్జీలను పెంచాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే ముసాయిదాను విడుదల చేసింది. ముసాయిదాకు ఆమోదముద్ర పడితే.. ద్విచక్రవాహనాల రెన్యూవల్‌కు ఏడాదికి రూ.2వేలు, కార్లకు రూ.10 వేల మేర చార్జీల మోత మోగనుంది. అంటే.. వాహనం వయసు 20 ఏళ్లు దాటితే.. గతంలో మాదిరిగా ఐదేళ్లకు రెన్యూవల్ అవకాశం ఉండదు. ఏటా వాహనాన్ని రవాణాశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి, ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గితేనే రెన్యూవల్ చేస్తారు. వీటితోపాటు.. ఆటోరిక్షాలు, ఇతర వాహనాల రెన్యూవల్ చార్జీలు కూడా దాదాపు రెండింతలు పెరగనున్నాయి. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన బైక్‌కు ఐదేళ్ల రెన్యూవల్‌కు రూ.2 వేలు, 20 ఏళ్లు దాటితే ఐదేళ్లకు రూ.5వేలుగా చార్జీలున్నాయి. 15 ఏళ్లు దాటిన కార్లకు ఐదేళ్ల రెన్యూవల్‌కు రూ.5 వేలు, 20 ఏళ్లు దాటితే రూ.10వేలుగా ఉంది.

మైనర్ బాలికే..కానీ,ఆమెకు పర్యవసానాలు తెలుసు

» పోక్సో కేసు నిందితుడికి బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు

ముంబై, ఫిబ్రవరి 22: మైనర్లపై అత్యాచారాలను నిరోధించడానికి ఉద్దేశించిన పోక్సో చట్టం కింద అరెస్టయిన 24 ఏళ్ల యువకుడికి బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బాధితురాలు మైనర్ బాలికే అయినప్పటికీ పరస్పరం ఇష్టంతో స్వచ్ఛందంగా ఆయనతో గడిపిందని, అందువల్ల బెయిల్ మంజూరు చేయవచ్చని తెలిపింది. ఆ యువకుడిపై 2019లో పోక్సో కేసు నమోదయింది. ఆ సమయంలో బాలిక వయసు 14 ఏళ్లు కాగా, నిందితుడి వయసు 19 ఏళ్లు. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించడంతో స్వచ్ఛందంగా ఆయనతో మూడు రాత్రుళ్లు, పగళ్లు గడిపింది. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని, నిందితుడు అయిదేళ్లపాటు జైలులో ఉన్న విషయాన్ని గుర్తించి బెయిల్ ఇస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ మిళింద్ తెలిపారు. ఆ బాలిక మైనరే అయినప్పటికీ, తాను చేస్తున్నదేమిటన్నదానిపై ఆమెకు పూర్తి పరిజ్ఞానం ఉందని, ఈ విషయాన్ని ఆమెనే స్వచ్ఛందంగా అంగీకరించిందని చెప్పారు. ఆమె తండ్రికి కూడా వారి విషయం తెలుసని పేర్కొన్నారు.

రెండో పెళ్లి చేసుకోలేదని కేసు పెట్టే హక్కు వివాహితకు లేదు

వేరే వ్యక్తి తనను రెండో పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరక సంబంధాన్ని పెట్టుకొని మోసగించాడని ఫిర్యాదు చేసే హక్కు వివాహితకు ఉండదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇది తప్పుడు వాగ్దానం కిందకు రాదని తెలిపింది. డ్రైవర్ భార్య అయిన ఓ మహిళకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహమైన మరో వ్యక్తి.. ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరక సంబంధం పెట్టుకొంది. అయితే, కొంతకాలం తరువాత తాను భార్యకు విడాకులు ఇవ్వలేని అతడు తేల్చి చెప్పేశాడు. దీంతో, ఆమె హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన న్యాయమూర్తి.. వివాహిత ఇలాంటి ఫిర్యాదులు చేయలేదంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

మళ్లీ ఒక ఏడాది బీఈడీ, ఎంఈడీ!

2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు.. ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యత ఎన్టీఏకు

» జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ప్రతిపాదనలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బీఈడీ, ఎంఈడీ కోర్సులు తిరిగి 'ఒక ఏడాది' ఫార్మాట్‌కు తీసుకెళ్లాలని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) యోచిస్తోంది. ఈ మేరకు 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రెండు ప్రోగ్రామ్‌ల కాల వ్యవధిని ఏడాదికి తగ్గించాలని ప్రతిపాదించింది. దీంతో ఈ కోర్సుల కాల వ్యవధిని రెండేళ్లకు పొడిగించిన దశాబ్దం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకోనుంది. ఎన్‌సీటీఈ వెబ్‌సైట్‌లో ఉంచిన ముసాయిదా పాలసీపై మార్చి 8 వరకు ప్రజల అభిప్రాయాలు తీసుకోనుంది. పాలసీ ఆమోదం తర్వాత.. స్వతంత్ర ఉపాధ్యాయ విద్యా సంస్థలు (టీఈఐ) కొత్త ముసాయిదా నిబంధనల్లో పేర్కొన్న షరతులకు అనుగుణంగా ఉంటే, రెండేళ్ల బీఈడీ, ఎంఈడీ కోర్సులను అందించడం కొనసాగించవచ్చు. లేదా ఒక ఏడాది ఫార్మాట్‌లో మారేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. అన్ని బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రామాణిక సబ్జెక్ట్, ఆప్టిట్యూట్ పరీక్ష నిర్వహించనుందని హిందుస్థాన్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఎన్టీఏ ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ల (ఐటీఈపీ) అడ్మిషన్ల కోసం జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) నిర్వహిస్తోంది. ఎన్టీఏ నిర్వహించనున్న కొత్త ఐటీఈపీ కోర్సుల పరీక్షకు సంబంధించిన విధివిధానాలు వచ్చే ఏడాది రూపొందించబడతాయని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి చైర్‌పర్సన్ పంకజ్ అరోరా పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఐటీఈపీ యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, సంస్కృత విద్య, కళా విద్య అనే 4 ప్రత్యేక కోర్సులను తీసుకురానున్నట్లు ఎన్‌సీటీఈ తన ముసాయిదా నిబంధనలు-2025లో పేర్కొంది. కొత్త కోర్సులతో పాటు కనీస అవసరమైన సదుపాయాలు, అధ్యాపకులు వంటి అంశాలను కూడా ఎన్‌సీటీఈ నిర్దేశించింది. ముసాయిదా నిబంధనల ప్రకారం.. కనీసం 50 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా ప్రత్యేక సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులతో నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) కలిగిన అభ్యర్థి ఒక సంవత్సర బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రెండేళ్ల ఎంఈడీ ప్రోగ్రామ్ అందించబడుతుందని ముసాయిదా పేర్కొంది. జాతీయ విద్యా విధానం సిఫారసుల మేరకు కొత్త నిబంధనలు రూపొందించినట్లు అరోరా తెలిపారు.

10వేల కోట్లిచ్చినా జాతీయ విద్యావిధానాన్ని ఒప్పుకోం

» తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం అమలుకు అంగీకరిస్తేనే రూ.2వేల కోట్ల నిధులను విడుదల చేస్తామని కేంద్రప్రభుత్వం చెబుతోందని, కానీ, 10వేల కోట్లిచ్చినా ఆ విద్యావిధానాన్ని తమ రాష్ట్రంలో అమలుపరిచే ప్రసక్తేలేదని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు. శనివారం కడలూరు జిల్లాలో 'తల్లిదండ్రులను గౌరవిద్దాం' అనే పేరుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్ జాతీయ విద్యావిధానంపై తీవ్రస్థాయిలో విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో సమగ్ర శిక్షా అభియాన్ పథకం అమలుకు చెల్లించాల్సిన రూ.2152 కోట్ల నిధులను అకారణంగా నిలిపేశారని, తద్వారా ఆ పథకంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు లేకుండా చేశారని కేంద్రాన్ని దుయ్యబట్టారు. జాతీయ విద్యావిధానం సామాజిక న్యాయానికి వ్యతిరేకమైనదన్నారు. తాము ఏ భాషకూ వ్యతిరేకం కాదన్నారు. రాష్ట్రంలో హిందీభాషను నేర్చుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవన్న ఆయన, ఆ భాషను నిర్బంధంగా అమలు చేయాలన్న ఆలోచననే దశాబ్దాల తరబడి వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.



కడలూరులో విద్యార్థినులతో స్టాలిన్

ప్రధాని ముఖ్య కార్యదర్శిగా శక్తికాంత దాస్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాని మోదీ ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. తమిళనాడు క్యాడర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్ 2018 డిసెంబరు నుంచి ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు. తన 42 ఏళ్ల సర్వీసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కరోనా సమయంలో దేశ ఆర్థికాభివృద్ధి కొనసాగేందుకు ఆర్బీఐ గవర్నర్‌గా పలు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీకే మిశ్రా (గుజరాత్ క్యాడర్) ప్రధాని ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. శక్తికాంత దాస్ రెండో ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతారని క్యాబినెట్ నియామకాల కమిటీ శనివారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. కాగా, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు.

నా ఫ్రెండ్ మోదీకి యూఎస్‌ఎయిడ్

» ఎక్స్‌లో పోస్టు చేసిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్‌ఎయిడ్) రూ.182 కోట్లు(21 మిలియన్ డాలర్లు) ఇవ్వడంపై రాజకీయ రచ్చ జరుగుతుండగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి ఏకంగా ప్రధాని మోదీ పేరును ప్రస్తావించారు. "నా మిత్రుడు, భారత ప్రధాని నరేంద్ర మోదీకి 21 మిలియన్ డాలర్లు వెళ్తున్నాయి. మేము భారత్‌లో ఓటింగ్ శాతం పెరగడానికి ఈ మొత్తం ఇస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ నిధులు వచ్చాయని బీజేపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకొంది. భారత ఎన్నికల్లో జోక్యానికి బైడెన్ హయాంలో ఈ ఫండ్ ఇచ్చారని ట్రంప్ నాలుగు రోజుల క్రితం ప్రకటించారు.



అప్పులేని వాడు ఉత్తముడంటారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఇది అందరికీ వర్తించదు. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు. అలాంటప్పుడు అందరి దగ్గరా సరిపడా డబ్బులు ఉండకపోవచ్చు. అప్పుడు ఎంతో కొంత అప్పు చేయక తప్పదు. అయితే ఈ అప్పు వ్యక్తిగత రుణమా? లేక తాకట్టు రుణమా? అనేది పెద్ద ప్రశ్న.

వ్యక్తిగత రుణమా? తాకట్టు రుణమా? ఏది బెటర్!

ఒక్కోసారి కొన్ని ఆర్థిక అవసరాలు ఆకస్మికంగా వచ్చిపడుతుంటాయి. అప్పుడు ఏ హామీ లేకుండా వ్యక్తిగత రుణం తీసుకోవాలా? లేక ఆస్తులు హామీగా పెట్టి తాకట్టు రుణం తీసుకోవాలా? అనే సందేహాలు వస్తుంటాయి. ఎందుకంటే ఈ రెండింటిలో దేనిలో ఉండే లాభనష్టాలు దానిలో ఉన్నాయి. ఈ రుణాల స్వరూప, స్వభావాలు తెలుసుకుంటే.. ఎప్పుడు ఏ రుణం తీసుకోవాలో తేలికగా నిర్ణయించుకోవచ్చు. ఇప్పుడు ఒక్కో రుణంలో ఉండే లాభనష్టాలు తెలుసుకుందాం.

వ్యక్తిగత రుణాలు

ఈ రుణాల కోసం ఎలాంటి ఆస్తులను హామీగా చూపించాల్సిన అవసరం లేదు. గతంలో తీసుకున్న రుణాల్ని చక్కగా చెల్లించిన చరిత్ర, మంచి పరపతి (సిబిల్) స్కోరు ఉంటే చాలు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. అయినా రుణదాతలు ఈ రుణాలను కొద్దిగా రిస్కీ రుణాలుగా చూస్తారు. అందుకే విగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేట్లు కొద్దిగా ఎక్కువ.

ప్రధానాంశాలు: ఇవి పూర్తిగా హామీ లేని రుణాలు. ఈ రుణాల కోసం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఎలాంటి ఆస్తులను హామీగా చూపాల్సిన అవసరంగానీ, తాకట్టు పెట్టాల్సిన అవసరం గానీ లేదు. కాబట్టి ఈ రుణాలు చెల్లించలేకపోయినా ఆస్తులు పోగొట్టుకుంటామనే భయం ఉండదు.

త్వరగా ఆమోదం: వ్యక్తిత రుణాల దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. కొన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలైతే మీ ఆధార్, పాన్ కార్డు ఇస్తే చాలు. వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేసి, ఖాతాదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాయి.

వెసులుబాటు: వ్యక్తిగత రుణాలను మన అవసరాలను బట్టి ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. ఫలానా అవసరం కోసం మాత్రమే మేము ఇచ్చిన ఈ రుణాలు వాడుకోవాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆంక్షలు పెట్టవు.

గమనించాల్సిన విషయాలు..

అధిక వడ్డీ రేటు: వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఎలాంటి షూరిటీలు అడగవు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన చరిత్ర, మంచి పరపతి స్కోరు ఉంటే చాలు. అయినా ఈ రుణాలను నష్ట భయం (రిస్క్) ఉన్న రుణాలుగానే పరిగణిస్తారు. దీంతో మిగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వ్యక్తిగత రుణాలపై ఆయా వ్యక్తుల పరపతి చరిత్ర, పరపతి స్కోరు ఆధారంగా 11 నుంచి 17 శాతం వరకు వడ్డీ రేటు వసూలు చేస్తున్నాయి.

రుణ పరిమితి: సెక్యూర్డ్ లోన్లతో పోలిస్తే హామీ లేని రుణాలను బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కొద్ది మొత్తంలోనే ఇస్తుంటాయి. అది కూడా ఆయా వ్యక్తుల ఆదాయం, పరపతి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.

పరపతి స్కోరు: పరపతి స్కోరు, రుణాల తిరిగి చెల్లింపు చరిత్ర ఎంత బాగుంటే అంత సులభమైన షరతులతో వ్యక్తిగత రుణాలు లభిస్తాయి. ఈ రెంటిలో ఏ మాత్రం తేడా కనిపించినా 'సారీ, మీకు రుణం ఇవ్వడం మా వల్ల కాదు' అని ముఖానే చెప్పేస్తాయి. లేదంటే స్కోరు ఒక మాదిరిగా ఉన్నా అధిక వడ్డీ వసూలు చేస్తాయి.



తాకట్టు రుణాలు

ఏదో ఒక ఆస్తిని తాకట్టు లేదా హామీగా చూపితే గానీ ఈ రుణాలు పొందలేం. సాధారణంగా ఈ రుణాల కోసం ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేదా ఇతర స్థిరాస్తులను హామీగా చూపించాలి. కొత్త ఆస్తుల కొనుగోలు లేదా తాకట్టులో ఉన్న ఆస్తులను విడిపించుకునేందుకు ఈ తరహా రుణాలు ఉపయోగపడతాయి.

హామీతో కూడిన రుణాలు: ఈ రుణాల చెల్లింపునకు పూర్తి హామీ ఉంటుంది. చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ హామీగా పెట్టిన ఆస్తులను వేలం వేసి తమకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టుకుంటుంది. దీంతో మిగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేటు తక్కువ.

ఎక్కువ రుణం: రుణ చెల్లింపునకు ఏదో ఒక ఆస్తిని హామీగా పెడుతున్నాం కాబట్టి, ఎక్కువ మొత్తంలోనే రుణం తీసుకోవచ్చు. హామీగా పెట్టే ఆస్తి విలువ ఎంత ఎక్కువ ఉంటే, బ్యాంకులు ఇచ్చే తాకట్టు రుణ మొత్తమూ అంత ఎక్కువగా ఉంటుంది.

చెల్లింపు కాలపరిమితి: వ్యక్తిగత రుణాలతో పోలిస్తే, తాకట్టు రుణాల చెల్లింపు కాలపరిమితి ఎక్కువ. దీంతో ఈఎంఐల చెల్లింపు భారం తక్కువగానే ఉంటుంది.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు..

హామీ: ఏదైనా ఆస్తిని హామీగా చూపితేగానీ తాకట్టు రుణాలు లభించవు. వీటి చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా హామీగా చూపిన ఆస్తిపై ఆశలు వదులుకోవాల్సిందే.

ఎక్కువ సమయం: తాకట్టు రుణాల మంజూరుకు చాలా సమయం పడుతుంది. హామీగా చూపే ఆస్తి విలువ మదింపు దగ్గరి నుంచి ఆ ఆస్తి పత్రాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించుకుని గానీ రుణాలకు ఓకే చెప్పవు. దీంతో వ్యక్తిగత రుణాలతో పోలిస్తే తాకట్టు రుణాల మంజూరుకు చాలా రోజులు పడతాయి.

డాక్యుమెంటేషన్: తాకట్టు రుణాల డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఎక్కువ. హామీగా చూపే ఆస్తితో పాటు రుణ గ్రహీత ఆర్థిక పరిస్థితికి సంబంధించి కొన్ని పత్రాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

ఏది బెటర్ చాయిస్?

రుణ అవసరం: ఏదైనా ఆస్తి కొనుగోలుకైతే తాకట్టు రుణం మంచి చాయిస్. ఏదైనా వ్యక్తిగత ఖర్చు లేదా అత్యవసర ఖర్చుల కోసమైతే వ్యక్తిగత రుణాలను ఆశ్రయించడం మంచిది.

రుణ మొత్తం.. చెల్లించే సామర్థ్యం: రుణ అవసరం ఎక్కువగా ఉండి, ఆ రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం ఉంటే తాకట్టు రుణం తీసుకోవడం మంచిది. రుణ అవసరం కొద్ది మొత్తంలో ఉంటే వ్యక్తిగత రుణాలకు వెళ్లడం మంచి చాయిస్.

వడ్డీ రేటు: హామీ పెట్టడానికి అవసరమైన స్థిరాస్తులు ఉండి, తక్కువ వడ్డీ రేటుకు రుణం కావాలంటే తాకట్టు రుణాలు మంచి చాయిస్. ఆస్తుల హామీ లేకుండా వడ్డీ రేటు ఎక్కువైనా పర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణాలకు వెళ్లడం మంచిది.

రుణ అవసరం, వడ్డీ రేటు, పరపతి స్కోరు, పరపతి చరిత్ర ఆధారంగా ఎవరికి వారు తాకట్టు రుణం కావాలా? వ్యక్తిగత రుణం కావాలా? అనే విషయం ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. అయితే తాకట్టు రుణాల చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా హామీగా పెట్టిన ఆస్తులు పోతాయనే విషయం మర్చిపోకూడదు.

స్పాన్సర్‌షిప్ సర్వీస్‌లకు జీఎస్‌టీ ఎవరు చెల్లించాలి?

సురభి ఈవెంట్స్ అనే సంస్థ ప్రతి సంవత్సరం సినీ రంగానికి సంబంధించి వివిధ విభాగాల కింద అవార్డులు ఇస్తుంది. ఇందులో హీరో, హీరోయిన్‌లు మాత్రమే కాకుండా వివిధ రంగాలకు చెందిన సాంకేతిక నిపుణులు కూడా ఉంటారు. సినీ ప్రముఖులు ఉండటంతో ఈ కార్యక్రమానికి విశేష ఆదరణ ఉంటుంది. ఈ కార్యక్రమానికి జనం ఎక్కువగా హాజరు కావటంతో పాటుగా టీవీలలో ఎక్కువ మంది చూస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేయటానికి కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయి. తద్వారా తమ ఉత్పత్తులకు మంచి ప్రమోషన్, బ్రాండింగ్ లభిస్తుంది కాబట్టి. ఇందులో భాగంగా ఆయా కంపెనీలకు సంబంధించిన బ్యానర్స్‌ను లోగోలను కార్యక్రమంలో ప్రదర్శించటం జరుగుతుంది. దీనికి సంబంధించి ఆయా సంస్థలు కొంత మొత్తాన్ని సురభి ఈవెంట్స్‌కు చెల్లించటం జరుగుతుంది. ఈ వెంట్ ఆధారంగా చేసుకుని తమ బ్రాండ్ లేదా కంపెనీని ప్రమోట్ చేసుకునే అవకాశం సదరు సంస్థలకు సురభి ఈవెంట్స్ కల్పిస్తుంది. దీనినే స్పాన్సర్‌షిప్ సర్వీస్ అంటారు. మరి ఈ స్పాన్సర్‌షిప్ సర్వీస్‌లకు సంబంధించి తీసుకున్న మొత్తం మీద పన్ను ఎవరు చెల్లించాలి?

స్పాన్సర్‌షిప్‌లను జీఎస్‌టీలో రివర్స్ చార్జ్ మెకానిజం కిందకు తీసుకువచ్చారు? అంటే, ఈ సర్వీస్ అందుకున్న వారు 'బాడీ కార్పొరేట్' లేదా 'పార్ట్‌నర్‌షిప్' విభాగంలోకి వచ్చేటట్లయితే, చెల్లించిన మొత్తం మీద పన్ను వారే చెల్లించాలి. అంటే ఇక్కడ సురభి ఈవెంట్స్‌కు స్పాన్సర్‌షిప్ ద్వారా పొందిన మొత్తం మీద పన్నుకు సంబంధించి ఎలాంటి బాధ్యత ఉండదు. అయితే, దీనికి సంబంధించి ఈ ఏడాది జనవరిలో ఒక సవరణ చేయటం జరిగింది.

దీని ప్రకారం ఈవెంట్స్ నిర్వాహకులు.. బాడీ కార్పొరేట్ కింద నమోదైతే అప్పుడు సర్వీస్ అందుకునే వారి స్థితితో సంబంధం లేకుండా ఈవెంట్స్ నిర్వాహకులే పన్ను చెల్లించాలి. అంటే, అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం అమలు కాదు.

అలాగే ఈ మధ్య పెళ్లిళ్ల దగ్గర నుంచి చిన్న చిన్న కార్యక్రమాలను కూడా ఈవెంట్స్ వారికి ఇస్తున్నారు. ఇక్కడ రివర్స్ చార్జ్ మెకానిజం అమలు కాదు. ఎందుకంటే, నిర్వహణ బాధ్యత ఈవెంట్స్ సంస్థే చూసినప్పటికీ, ఇక్కడ ఎలాంటి 'స్పాన్సర్‌షిప్ సర్వీస్' అందించటం లేదు. కాబట్టి దీనికి సంబంధించి వసూలు చేసిన మొత్తం మీద సంబంధిత పన్నును ఈవెంట్స్ నిర్వాహకులే చెల్లించాలి. ఈ ఈవెంట్స్‌కు సంబంధించి కొనుగోలు చేసిన సామాగ్రి మీద లేదా పొందిన సర్వీసుల మీద సదరు ఈవెంట్స్ సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవచ్చు. అయితే గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, సర్వీస్ అనేది రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చినప్పుడు తీసుకున్న క్రెడిట్‌ను.. దామాషా పద్ధతిలో రివర్స్ చేయాలి.



ఇదీ GST

రాంబాబు గొండాల

ఉదాహరణకు ఇదే సురభి ఈవెంట్స్ ఒక నెలలో ఒక పెళ్లికి సంబంధించిన ఈవెంట్ నిర్వహించింది. దీనికి గాను ఒక రూ.30 లక్షలు పొందిందనుకుందాం. అలాగే అదే నెలలోనే పైన చెప్పిన అవార్డుల ఫంక్షన్ నిర్వహించింది. దీనికి గాను రూ.20 లక్షలు స్పాన్సర్‌షిప్ సర్వీస్ కింద వివిధ కంపెనీల నుంచి పొందటం జరిగింది. అంటే, ఆ నెలలో జరిగిన మొత్తం సర్వీస్ రూ.50 లక్షల్లో.. రూ.20 లక్షలు అంటే 40 శాతం రివర్స్ చార్జ్ మెకానిజంలో వస్తుంది (సురభి ఈవెంట్స్ అనేది ఒక పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్ అనుకుంటే). కాబట్టి ఆ నెలలో పొందే ఐటీసీలో 40 శాతం రివర్స్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఇలా దామాషా పద్ధతిలో క్రెడిట్ రివర్స్ చేయటం అనేది కేవలం స్పాన్సర్‌షిప్ సర్వీస్‌కు మాత్రమే కాకుండా రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చే అన్ని సరఫరాలకు వర్తిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్

బజాజ్ అలియాంజ్ లైఫ్ నుంచి బీమా ఏఎస్‌బీఏ

బీమా-అప్లికేషన్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్ (ఏఎస్‌బీఏ) సదుపాయాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రైవేట్ రంగంలోని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) నిర్దేశించిన మేరకు బీమా-ఏఎస్‌బీఏ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిన తొలి ఇన్సూరెన్స్ కంపెనీ ఇదే. దీని ద్వారా పాలసీదారులు యూపీఐలో వన్-టైమ్ మాండేట్‌ను ఎంచుకొని, బీమా ప్రీమియం చెల్లింపు కోసం తమ బ్యాంక్ ఖాతాలో నిర్దేశిత సొమ్మును (గరిష్ఠంగా రూ.2 లక్షలు) బ్లాక్ చేసి పెట్టవచ్చు. తద్వారా బీమా కంపెనీ పాలసీ జారీ చేశాకే, పాలసీదారు ఖాతా నుంచి నిర్దేశిత ప్రీమియం సొమ్మును బదిలీ చేసుకోగలుగుతుంది.

యాంఫీ 3 కొత్త కార్యక్రమాలు

దేశంలో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత పెంపు, పెట్టుబడుల రికవరీ కోసం అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తాజాగా మూడు కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా చిన్న మొత్తాల్లో (కనీసం రూ.250తో) క్రమానుగత పెట్టుబడులు (సిప్), పాఠశాల విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంచేందుకు తరుణ్ యోజన, గతంలో పెట్టుబడులు పెట్టి మర్చిపోయిన మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోలను శోధించి, రికవరీ చేసుకునేందుకు మిత్రా ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	465
వరంగల్	432	గోదావరి	450
చిత్తూరు	493	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	71
కరీంనగర్	70	ఒంగోలు	71
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	85
కర్నూలు	70	నెల్లూరు	90
విశాఖపట్నం	70	అనంతపురం	90
గోదావరి	71		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,770 ▼	80,450 ▼	1,07,000 ▼
విజయవాడ	89,000 ▲	82,500 ▼	99,000 ▲
విశాఖపట్నం	86,210 ▲	79,030 ▲	96,600 ▼
రాజమండ్రి	87,760 ▲	80,450 ▲	99,900 ▼
ప్రొద్దుటూరు	88,550 ▼	82,000 ▼	98,000 ▼
ముంబై	86,092 ▼	78,860 ▼	97,147 ▲

పాక్ గడ్డపై 'జనగణమన'!

- ఆసీస్-ఇంగ్లండ్ మ్యాచ్‌లో భారత జాతీయ గీతం
- ఐసీసీ వివరణ ఇవ్వాలంటూ పాక్ క్రికెట్ బోర్డు డిమాండ్

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో శనివారం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగిన మ్యాచ్‌కు ముందు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు డీజే చేసిన చిన్న పొరపాటు వల్ల ఆస్ట్రేలియా జాతీయ గీతానికి బదులు భారత జాతీయ గీతం వినబడింది. తొలుత ఇంగ్లండ్ జాతీయ గీతాలాపన పూర్తయ్యాక.. ఆసీస్ ఆటగాళ్లు తమ గీతం కోసం సిద్ధమవగా, మైకులో నుంచి భారత జాతీయ గీతం మొదలైంది. దీంతో ఆటగాళ్లతోపాటు స్టేడియంలోని వారంతా విస్తుపోయారు. వెంటనే తేరుకున్న డీజే దానిని ఆపేసి, ఆస్ట్రేలియా జాతీయ గీతాన్ని పెట్టాడు. అయితే ఈ ఘటన ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్రంగా స్పందించింది. ఈ ఉదంతంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. కాగా, ఈ టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా భారత జట్టు ఆ దేశానికి వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో భారత్ మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.



లెక్క తేల్చాల్సిందే!

సెమీస్‌పై భారత్ గురి
పాక్‌కు చావోరేవో
చాంపియన్స్ ట్రోఫీ

హైఓల్టేజ్ సమరం నేడు



పాక్ కెప్టెన్ రిజ్వాన్

మధ్యాహ్నం 2.30 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో హైఓల్టేజి సమరానికి సర్వం సిద్ధమైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో చిరకాల శత్రువులుగా పేరు తెచ్చుకున్న భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం కీలక మ్యాచ్ జరుగనుంది. గ్రూప్ 'ఎ'లో ఇరు జట్లకిది రెండో మ్యాచ్. ఇప్పటికే టిక్కెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడుపోవడంతో స్టేడియం కిక్కిరిసిపోనుంది. అయితే టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్ ఈ మ్యాచ్ ఆడేందుకు స్వదేశం నుంచి దుబాయ్‌కి రావాల్సి వచ్చింది. భద్రతా కారణాలరీత్యా టీమిండియా తమ పొరుగు దేశంలో పర్యటించేందుకు ఇష్టపడకపోగా, హైబ్రిడ్ పద్ధతిన టోర్నీని నిర్వహిస్తున్నారు. మరోవైపు బంగ్లాపై విజయంతో రోహిత్ సేన ఆత్మవిశ్వాసంతో ఉంది. భారత్‌కు మరో విజయం లభిస్తే దాదాపు సెమీస్ చేరినట్టే. అటు పాక్‌కు ఆరంభ మ్యాచ్‌లో కివీస్ చేతిలో భంగపాటు ఎదురైంది. అందుకే భారత్‌తో జరిగే ఈ మ్యాచ్ వారికి అత్యంత కీలకం కాబోతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ నేటి పోరులో రిజ్వాన్ సేన గెలవాల్సిందే. లేకుంటే దాదాపు మూడు దశాబ్దాల తర్వాత సొంత గడ్డపై జరుగుతున్న ఐసీసీ టోర్నీ నుంచి గ్రూప్ దశలోనే నిష్క్రమించాల్సి ఉంటుంది. కానీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో పాక్ మూడింట్లో గెలవడం విశేషం. 2017లో జరిగిన ఫైనల్లోనూ భారత్‌ను పాక్ 180 రన్స్ తేడాతో చిత్తుగా ఓడించి తొలి టైటిల్‌ను దక్కించుకుంది. ఈసారి భారత్ గెలిచి 3-3తో లెక్కను సమం చేయాలనుకుంటోంది.

చాంపియన్స్ ట్రోఫీలో ఎన్ని జట్లు పాల్గొన్నా.. ఇప్పటికి ఎన్ని మ్యాచ్‌లు జరిగినా.. అందరి దృష్టీ ఆ ఒక్క పోరుపైనే. క్రికెట్ ప్రేమికులంతా ఎప్పుడెప్పుడా అంటూ ఆతృతగా ఎదురు చూసిన తరుణమిది. గతంలో ఎన్నిసార్లు తలపడినా బరిలోకి దిగిన ప్రతీసారి అదే ఉద్వేగం.. అదే ఉత్సాహం. భావోద్వేగాలు పతాక స్థాయిలో ఉండే అసలు సిసలైన పోరు. అందుకే కచ్చితంగా గెలిచి తీరాలనే కసి అటు ఆటగాళ్లలోనే కాదు, అభిమానుల నరనరాల్లోనూ ప్రవహిస్తుంటుంది. ఇదంతా భారత్-పాకిస్థాన్ పోరు గురించే! ఐసీసీ, ఆసియాకప్ టోర్నీల్లో మాత్రమే కనిపించే ఈ దాయాది జట్లు ఆదివారం తమ సత్తా ఎంతో తేల్చుకోనున్నాయి. అలాగే 2017 టోర్నీ ఫైనల్లో ఎదురైన పరాభవానికి లెక్క సరిచేయాలనుకుంటున్న టీమిండియా ఈ గెలుపుతో సెమీస్‌పైనా కన్నేసింది. అటు పాక్‌కు మాత్రం ఈ మ్యాచ్ చావో రేవో లాంటిది. ఓడితే ఆ జట్టు ఇంటికే కాబట్టి ఒత్తిడంతా వారిపైనే.

పాక్‌పైనే ఒత్తిడి

కివీస్ చేతిలో ఓటమితో పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరిగింది. పైగా చిరకాల శత్రువు భారత్‌తో మ్యాచ్ కావడం, గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉండే పరిస్థితి నెలకొనడంతో వీరి ప్రదర్శనపై ఆసక్తి ఏర్పడింది. అలాగే తొలి మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఆటతీరు విమర్శలపాలైంది. 320 పరుగుల ఛేదనలో అతడు 90 బంతుల్లో 64 పరుగులే చేయడంతో ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు భారత్‌పై ఆడిన 8 మ్యాచ్‌ల్లో బాబర్ 218 పరుగులే చేయగలిగాడు. ఇక టీమిండియాపై చెలరేగే ఓపెనర్ ఫఖర్ జమాన్ టోర్నీకి దూరం కావడం పెద్ద లోటే. తన స్థానంలో ఇమామ్ ఉల్ హక్‌ను తీసుకున్నారు. బ్యాటింగ్‌లో రిజ్వాన్, సల్మాన్ ఆఘా, సాద్ షకీల్ కీలకం. బౌలింగ్‌లో పేసర్లు షహీన్ షా, నసీమ్ షా, రౌఫ్ ఆరంభంలో భారత్‌ను కట్టడి చేయాలనుకుంటున్నారు. స్పిన్‌లో అబ్రార్ అహ్మద్ ఆకట్టుకుంటున్నాడు.

విరాట్ ఆడేనా?

పాక్‌తో పోలిస్తే భారత్ అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా కనిపిస్తోంది. ఓపెనర్ గిల్ భీకర ఫామ్ కొనసాగిస్తున్నాడు. పరిస్థితులకు తగ్గట్టు సంయమనంతో ఆడుతున్నాడు. అటు కెప్టెన్ రోహిత్ ఎటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచుతున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మాత్రం బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. కానీ శనివారం ప్రాక్టీస్ సెషన్ ముగిశాక తను ఎడమ కాలిపై ఐస్ ప్యాక్ పెట్టుకుని సేద తీరడం ఫ్యాన్స్‌ను ఆందోళనపరుస్తోంది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తొలి మ్యాచ్ కూడా తను మోకాలి గాయంతో దూరం కావాల్సి వచ్చింది. అయితే విరాట్ విషయమై బోర్డు నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. ఒకవేళ తను అందుబాటులో లేకపోతే వన్‌డౌన్‌లో రిజర్వ్ ప్లేయర్ కూడా లేడు. ఇక మిడిలార్డర్‌లో శ్రేయాస్, రాహుల్, అక్షర్, హార్దిక్ చెలరేగితే భారీ స్కోరు ఖాయమే. బౌలింగ్‌లో షమి అదరగొడుతుండడం సానుకూలాంశం కానుంది. బంగ్లాపై ఐదు వికెట్లతో రాణించిన తను జోష్‌లో ఉన్నాడు. అలాగే పాక్‌పై అతడి ఎకానమీ 3.82గా ఉండడం విశేషం. షమికి మరో ఎండ్‌లో హర్షిత్ నుంచి మద్దతు లభిస్తోంది. స్పిన్ త్రయం జడేజా, కుల్దీప్, అక్షర్ నేటి మ్యాచ్‌లోనూ కీలకం కానున్నారు. విరాట్ గాయంపై స్పష్టత లేకపోవడంతో దాదాపుగా జట్టులో మార్పు ఉండకపోవచ్చు.



తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, హార్దిక్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, హర్షిత్, షమి, కుల్దీప్.

పాకిస్థాన్: ఇమామ్ ఉల్ హక్, బాబర్, సాద్ షకీల్, రిజ్వాన్ (కెప్టెన్), సల్మాన్ ఆఘా, తయ్యాబ్ తహీర్, ఖుష్దిల్ షా, షహీన్ షా, నసీమ్ షా, హరీస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్.

పిచ్

బంగ్లాతో జరిగిన పిచ్ మందకొడిగా మారడంతో పరుగుల వేటలో భారత్ కాస్త ఇబ్బందిపడింది. అయితే, ఇక్కడ మంచు ప్రభావం కూడా లేకపోవడంతో టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకోవచ్చు.

స్పిన్‌పై కోహ్లీ చూపు

పాక్‌తో పోరుకు ముందు విరాట్ కోహ్లీ స్పిన్ బంతులను ఎదుర్కోవడంపై దృష్టి సారించాడు. టెస్టుల్లో ఆఫ్‌స్టంప్‌నకు ఆవలి బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడిన కోహ్లీ ఈ మధ్య వన్డేల్లో స్పిన్‌ను సరిగా ఆడలేకపోతున్నాడు. వరుసగా ఆరు వన్డేల్లో స్పిన్నర్లకే దొరికిపోయాడు. అందుకే ఈ మ్యాచ్‌లో పాక్ లెగ్ స్పిన్నర్ అబ్రార్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు, నెట్స్‌లో స్పిన్‌ను ఎక్కువగా ఆడాడు. లెగ్ బ్రేక్, ఆఫ్ స్పిన్, లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్లతో బౌలింగ్ చేయించుకున్నాడు.

352.. ఆసీస్ రికార్డు ఛేదన

ఊదేశారు



జోష్ ఇంగ్లిస్ (86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 120 నాటౌట్)

ఇంగ్లిస్ సుడిగాలి శతకం

- 5 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు
- డకెట్ పోరాటం వృథా

లాహోర్: జోష్ ఇంగ్లిస్ (86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 120 నాటౌట్) శతకంతో విజృంభించడంతో ఐసీసీ వన్డే ఈవెంట్లలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన ఆస్ట్రేలియా.. చాంపియన్స్ ట్రోఫీలో అదిరే బోణీ చేసింది. గ్రూప్-బిలో శనివారం పరుగుల వరద పారిన మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టోర్నీ చరిత్రలోనే ఇంగ్లండ్ అత్యధికంగా 352 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. కంగారూలు మరో 15 బంతులు మిగిలుండగానే గెలవడం విశేషం. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 351 పరుగులు చేసింది. బెన్ డకెట్ (143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌లతో 165), రూట్ (68) పోరాటాలు వృథా అయ్యాయి. డ్వార్షుయిస్ 3.. జంపా, లబుషేన్ చెరో 2 వికెట్లు తీశారు.

ఆదుకొన్న షార్ట్, లబుషేన్: భారీ ఛేదనలో ఆస్ట్రేలియా 47.3 ఓవర్లలో 356/5 స్కోరు చేసి గెలిచింది. రషీద్, లివింగ్‌స్టోన్, ఆర్చర్, ఉడ్ తలో వికెట్ దక్కించుకొన్నారు. హెడ్ (6), కెప్టెన్ స్మిత్ (5) స్వల్పస్కోర్లకే అవుటైనా..మరో ఓపెనర్ షార్ట్ (63), లబుషేన్ (47) మూడో వికెట్‌కు 95 పరుగులతో ఆదుకొన్నారు. అయితే, లబుషేన్‌ను రషీద్ అవుట్ చేసి.. ప్రమాదకరంగా మారిన ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. షార్ట్‌ను లివింగ్‌స్టోన్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో ఆసీస్ శిబిరంలో గుబులు రేగింది. కానీ, ఇంగ్లిస్, క్యారీ (69) ఐదో వికెట్‌కు 146 పరుగులు జోడించి జట్టులో ఆశలు రేపారు. 38వ ఓవర్‌లో రషీద్ బౌలింగ్‌లో ఆర్చర్ క్యాచ్‌ను చేజార్చడంతో బతికిపోయిన క్యారీ అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. అయితే, గెలుపునకు మరో 70 పరుగులు కావాల్సిన సమయంలో 42వ ఓవర్‌లో క్యారీని కార్స్ అవుట్ చేశాడు. కానీ, మ్యాక్స్‌వెల్ (32 నాటౌట్)తో కలసి ఆరో వికెట్‌కు అజేయంగా 36 బంతుల్లో 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఇంగ్లిస్.. సిక్స్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.

1

చాంపియన్స్ ట్రోఫీలో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ఆస్ట్రేలియా. మ్యాచ్‌లో తొలుత ఇంగ్లండ్ 351/8తో ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక స్కోరు రికార్డు నెలకొల్పింది. అయితే, ఛేదనలో ఆసీస్ 356/5తో ఆ రికార్డును బద్దలుకొట్టింది. 2004లో అమెరికాపై న్యూజిలాండ్ 347/4 రికార్డు స్కోరు చేసింది.

టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా డకెట్ (165). 2004లో నాథన్ ఆస్టల్ (145 నాటౌట్), 2002లో ఆండీ ఫ్లవర్ (145)ను డకెట్ వెనక్కునెట్టాడు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 50 ఓవర్లలో 351/8 (డకెట్ 165, జో రూట్ 68; డ్వార్షుయిస్ 3/66, ఆడమ్ జంపా 2/64).

ఆస్ట్రేలియా: 47.3 ఓవర్లలో 356/5 (ఇంగ్లిస్ 120 నాటౌట్, అలెక్స్ క్యారీ 69; రషీద్ ఖాన్ 1/47, లివింగ్‌స్టోన్ 1/47).

యూపీ బోణీ

- హెన్రీ సునామీ ఇన్నింగ్స్
- హ్యారిస్ హ్యాట్రిక్
- ఢిల్లీ పరాజయం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ అద్భుత బోణీ చేసింది. షినెల్లీ హెన్రీ (23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో 62) సునామీ ఇన్నింగ్స్‌కు, స్పిన్నర్ గ్రేస్ హ్యారిస్ (4/15) హ్యాట్రిక్ తోడవడంతో 33 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి టోర్నీలో తొలి విజయం నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 177/9 స్కోరు చేసింది. తాలియా మెక్‌గ్రాత్ (24) మోస్తరుగా ఆడింది. అనంతరం ఢిల్లీ 19.3 ఓవర్లలో 144 రన్స్‌కు ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (56) అర్ధ శతకంతో పోరాడింది. పేసర్ క్రాంతి గౌడ్ 4 వికెట్లు పడగొట్టింది. షినెల్లీ హెన్రీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

షినెల్లీ రికార్డ్: సిక్సర్లతో విరుచుకుపడిన యూపీ బ్యాటర్ షినెల్లీ హెన్రీ డబ్ల్యూపీఎల్‌లో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన బ్యాటర్ రికార్డును సమం చేసింది. 18 బంతుల్లో ఆమె ఈ ఫీట్ అందుకుంది. 2023లో బెంగళూరుపై గుజరాత్ బ్యాటర్ సోఫియా డంక్లీ కూడా 18 బంతుల్లోనే అర్ధ శతకం పూరించింది. కాగా..డబ్ల్యూపీఎల్‌లో మూడో హ్యాట్రిక్ సాధించిన బౌలర్‌గా హ్యారిస్ నిలిచింది.

సంక్షిప్తస్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 177/9 (షినెల్లీ హెన్రీ 62, తాలియా మెక్‌గ్రాత్ 24, జొనాసెన్ 4/31, అరుంధతి 2/52).**ఢిల్లీ:** 19.3 ఓవర్లలో 144 ఆలౌట్ (జెమీమా 56, షఫాలీ 24, గ్రేస్ హ్యారిస్ 4/15, క్రాంతి గౌడ్ 4/25).

ఒక్కపూటే భోజనం



షమి

దుబాయ్: ఫిట్‌నెస్‌ను కాపాడుకునేందుకు తాను ఎన్నో ఏళ్లుగా ఒక్కపూటే భోజనం చేస్తున్నానని 34 ఏళ్ల భారత ఏస్ పేసర్ మహ్మద్ షమి వెల్లడించాడు. '2015 నుంచి నేను రోజూ ఒక పూటే భోజనం చేస్తున్నా. అది కూడా రాత్రి పూటే. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ మానేశా. అలా చేయడం చాలా కష్టమే. కానీ ఒకసారి దానికి అలవాటు పడితే ఇబ్బందేమీ ఉండదు' అని షమి వివరించాడు. 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో ఫైనల్ సందర్భంగా షమి పాదానికి గాయమైంది. దానికి శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ఫలితంగా అతడు 14 నెలలు ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో షమి బరువు 90 కేజీలకు చేరింది. 'బెంగళూరు జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసంలో ఉన్నప్పుడు తొమ్మిది కిలోల బరువు తగ్గా. అది చాలా క్లిష్టమైన దశ. స్వీట్లు..తదితర పదార్థాలకు దూరంగా ఉన్నా. నాకిష్టమైన బిర్యానీని మాత్రం అప్పుడప్పుడు తినేవాడిని' అని షమి వివరించాడు.

రిత్విక్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కాపెల్లె అంతర్జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. శనివారం ఫ్రాన్స్‌లో జరిగిన టోర్నీలో ఆరో సీడ్ రిత్విక్ 9 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. బోయర్ మహేల్ (ఫ్రాన్స్) స్వర్ణం, ఇనియన్ పన్నీర్ సెల్వం (చెన్నై) రజతం దక్కించుకున్నారు.

ప్రపంచ అథ్లెటిక్స్‌కు గుల్వీర్ అర్హత



న్యూఢిల్లీ: దేశీయ స్టార్ అథ్లెట్ గుల్వీర్ సింగ్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన ఇండోర్ ఈవెంట్ ఐదు వేల మీటర్ల రేసులో గుల్వీర్ 12 నిమిషాల 59.77 సెకన్లలో రేసును పూర్తి చేసి నాలుగో స్థానంలో నిలిచాడు. 5000 మీ., రేసును 13 నిమిషాల లోపు పూర్తి చేసిన తొలి భారత అథ్లెట్ గుల్వీరే. ఈ ప్రదర్శనతో తన పేరిట ఉన్న జాతీయ, ఆసియా రికార్డు (13 ని., 11.82 సెకన్లు)లను తానే తిరగరాసుకున్నాడు.

దేశాన్నే కాదు.. గేమ్‌ను కూడా తీసుకెళ్లలేరు

ట్రంప్‌నకు కెనడా ప్రధాని చురకలు

బోస్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ తమ పొరుగు దేశమైన కెనడాతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. కెనడాను త్వరలోనే అమెరికాకు 51వ రాష్ట్రంగా కలుపుకొంటానంటూ ట్రంప్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బోస్టన్‌లో జరిగిన ఐస్ హాకీ టోర్నీ నాలుగు దేశాల ఫేస్ ఆఫ్ ఫైనల్లో అమెరికాను 3-2తో ఓడించి కెనడా విజేతగా నిలవడంతో ఆ దేశ ప్రధాని ట్రూడో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అంతేకాదు.. 'మా దేశాన్ని తీసుకెళ్లలేరు.. అలాగే మా గేమ్‌ను కూడా తీసుకెళ్లలేరు' అని ట్రంప్‌కు చురకలంటిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు ట్రంప్ తమ జట్టును ఉద్దేశిస్తూ 'మన 51వ రాష్ట్రంగా మారే కెనడాపై గ్రేట్ అమెరికా విజయం సాధిస్తుందని విశ్వసిస్తున్నా' అని పోస్ట్ చేశారు.

అమెరికా టాప్ కమాండర్ బ్రౌన్‌కు ఉద్వాసన

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికా మిలిటరీ టాప్ కమాండర్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ చీక్యూ బ్రౌన్ జూనియర్‌ను అధ్యక్షుడు ట్రంప్ ఆ పదవినుంచి తొలగించారు. బ్రౌన్ స్థానంలో ఎయిర్ ఫోర్స్ రిటైర్డు లెఫ్టినెంట్ జనరల్ డాన్ రజిన్ కైనేను నియమిస్తున్నట్టు ప్రకటించారు. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్‌కు నాయకత్వం వహించిన నల్లజాతి జనరల్లలో బ్రౌన్ రెండోవారు. ఆయన పదహారు నెలలు ఈ పదవిలో ఉన్నారు. నల్లజాతికి చెందిన జార్జి ఫ్లాయిడ్‌ను శ్వేత జాతి పోలీస్ అధికారి హత్యచేసిన ఘటనకు నిరసనగా అప్పట్లో జరిగిన 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్' ఉద్యమానికి బ్రౌన్ మద్దతు పలికారు. ఇదిలా ఉండగా, అమెరికా ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కశ్యప్ పటేల్.. భగవద్గీతపై ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు.

ట్రంప్,మస్క్ మరణశిక్షకు అర్హులు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరణశిక్షకు అర్హులని మస్క్‌కు చెందిన కృత్రిమమేధ 'ఎక్స్ఏఐ' తాజాగా సమాధానాలు ఇచ్చింది. వారు చేసిన పనులకు గాను వారికి మరణశిక్ష విధించాలని పేర్కొంది. 'అమెరికాలో ప్రస్తుతం సజీవంగా ఉన్న వారిలో, వారు చేసిన పనులకుగాను ఎవరిని మరణశిక్షకు అర్హులని భావిస్తున్నావు?' అని ఎక్స్ఏఐ చాట్ బోట్ 'గ్రోక్'ను పలు విధాలుగా ప్రశ్నించగా, అది ఈ మేరకు సమాధానాలిచ్చింది.

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణకు కఠిన నిబంధనలు!

» పరిశీలిస్తున్న కేంద్ర సమాచార ప్రసార శాఖ



రణ్‌వీర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: యూట్యూబ్‌లో రణ్‌వీర్ అలహాబాదియా షో వివాదాస్పదమైన నేపథ్యంలో డిజిటల్ వేదికలపై హానికరమైన కంటెంట్ నియంత్రణకు కొత్త లీగల్ ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు ఆన్‌లైన్ కంటెంట్‌పై నిఘాను తీవ్రతరం చేయనున్నట్టు సంకేతాలిచ్చింది. అందుకోసం చట్టంలో ప్రస్తుతం ఉన్న నిబంధనలను కేంద్ర సమాచార, ప్రసార మాధ్యమాల మంత్రిత్వశాఖ పరిశీలిస్తోంది. బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే చైర్మన్‌గా ఉన్న పార్లమెంటరీ కమిటీ రాసిన లేఖకు ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మాధ్యమాల మంత్రిత్వశాఖ సమాధానమిచ్చింది. 'డిజిటల్ వేదికలపై అసభ్యకరమైన, హింసాత్మక కంటెంట్‌ను ప్రదర్శించడానికి భావ వ్యక్తీకరణ అనే రాజ్యాంగ హక్కును దుర్వినియోగం చేస్తుండటంపై సమాజంలో ఆందోళన పెరుగుతోంది. దీని నియంత్రణకు ప్రస్తుత చట్టాల్లో నిర్దిష్టమైన నిబంధనలు ఉన్నాయి. హానికరమైన కంటెంట్‌ను నియంత్రించేందుకు మరింత కఠినమైన, సమర్థవంతమైన లీగల్ ఫ్రేమ్‌వర్క్ కోసం డిమాండ్ పెరుగుతోంది. తాజా పరిణామాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం ఉన్న చట్ట నిబంధనలను పరిశీలిస్తున్నాం' అని ఆ సమాధానంలో మంత్రిత్వశాఖ పేర్కొంది. కాగా, రణవీర్ అలహాబాదియాపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించడానికి ఏమైనా చర్యలు తీసుకునే యోచనలో ఉన్నారా? అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అలహాబాదియా వ్యాఖ్యలపై పార్టీలకు అతీతంగా ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పార్లమెంటరీ కమిటీ కూడా ఈనెల 13న కేంద్ర సమాచార ప్రసారమాధ్యమాల శాఖకు లేఖ రాసింది. నూతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మీడియా వేదికల్లో వచ్చే వివాదాస్పద కంటెంట్‌ను నియంత్రించేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలకు సవరణలు చేయాల్సిన అవసరం ఉందని లేఖలో సూచించింది.

మద్యం అమ్మకాల వల్లే కేజ్రీవాల్ ఓడిపోయారు

» సామాజిక కార్యకర్త అన్నా హజారే

ముంబై, ఫిబ్రవరి 22: ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ బాగానే పనిచేశాడని అయితే మద్యం అమ్మకాల కారణంగా ప్రజలు గుణపాఠం నేర్పారని సామాజిక కార్యకర్త అన్నా హజారే చెప్పారు. వాస్తవానికి కేజ్రీవాల్ సమాజానికి ఒక ఆదర్శంగా నిలుస్తాడని భావించినా అలా జరగలేదన్నారు. కేజ్రీవాల్ మద్యం లైసెన్సులు, అమ్మకాలతో తాను నిరాశ చెందానని హజారే తెలిపారు. ఢిల్లీకి మహిళా సీఎం రావడాన్ని ఆయన స్వాగతించారు. రేఖా గుప్త పనులు, ఆలోచనల వల్లే సీఎం కాగలిగారని హజారే ప్రశంసించారు. 2012లో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో హజారేతో పాటు కేజ్రీవాల్ కూడా పాల్గొన్నారు. అనంతరం హజారే అభీష్టానికి భిన్నంగా కేజ్రీవాల్ ఆప్‌ను స్థాపించారు.

క్షయకు ఎంఆర్‌ఎన్ఏ టీకా.. త్వరలో మనుషులపై ట్రయల్స్

మెల్‌బోర్న్, ఫిబ్రవరి 22: క్షయ వ్యాధి నివారణకు ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న ఎంఆర్ఎన్ఏ టీకా ప్రయోగాల్లో కీలక ముందడుగు పడింది. శాస్త్రవేత్తలు ఈ టీకాను ఎలుకలపై ప్రయోగించగా సత్ఫలితాలు వచ్చాయి. క్షయకు కారణమైన బ్యాక్టీరియాపై ఈ టీకా సమర్థవంతంగా పోరాడి.. ఎలుకల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించినట్టు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. దీంతో ఈ టీకాను మనుషులపై ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు తొలిసారిగా ఎంఆర్ఎన్ఏ టీకాల అభివృద్ధి జరిగింది. కాగా, ప్రస్తుతం క్షయ రోగులకు బీసీజీ టీకాలు ఇస్తున్నారు.

మహా కుంభమేళా @ 60 కోట్లు!

» ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల పోటు .. 26నాటికి ఈ సంఖ్య 65కోట్లు దాటే అవకాశం

మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 22: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమం వద్ద మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసిన భక్తుల సంఖ్య 60 కోట్లు దాటిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించింది. దేశంలో సనాతన ధర్మం పాటించే 110 కోట్ల మందిలో సగం మందికి పైగా (55%) స్నానాలు చేశారని తెలిపింది. జనవరి 13న ప్రారంభమైన కుంభమేళా మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26తో కొనసాగనుంది. 26న జరిగే చివరి అమృత్ స్నానాల నాటికి ఈ సంఖ్య 65కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నట్లు యూపీ ప్రభుత్వం వివరించింది. ఒక్క నేపాల్ నుంచే 50 లక్షల మందికి పైగా వచ్చి నదిలో స్నానం చేశారని పేర్కొంది. ఇదిలాఉండగా, మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేస్తున్న మహిళా భక్తుల వీడియోలను పోస్టు చేసిన వివిధ సోషల్ మీడియా ఖాతాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళల ఫొటోలు, వీడియోల ప్రచురణపై అలహాబాద్ హైకోర్టు 2019లో నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో యూపీ పోలీసులకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం ఇటువంటి ఖాతాలపై 24 గంటలూ నిఘా పెట్టి, కేసులు నమోదు చేస్తోంది. కొత్వాలి పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే 17 ఖాతాలపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇలాంటి వీడియోలు విక్రయిస్తున్న ముగ్గురిని అహ్మదాబాద్ క్రైం బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, మహా కుంభమేళాలో స్నానాలు చేయాలని భావించే ఖైదీల కోసం యూపీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 75 జైళ్లలో ఉన్న దాదాపు 90 వేల మందికి పైగా ఖైదీలకు సంగమ జలాలతో స్నానం చేసే అవకాశం కల్పించింది. లఖ్‌నవూ, అయోధ్య, అలీగఢ్‌లో ఉన్న జైళ్లకు త్రివేణీ సంగమం నుంచి పవిత్ర జలాలను అధికారులు తీసుకొచ్చి జైళ్లలోని ట్యాంకర్లలో కలిపారు. అనంతరం ఖైదీలంతా అక్కడే పవిత్ర స్నానాలు ఆచరించారు.



త్రివేణి సంగమంలో యోగి, జేపీ నడ్డా స్నానం









ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● ఆదివారం 23 ఫిబ్రవరి 2025

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో వస్తున్నా



- సందీప్ కిషన్

'నా గత చిత్రాల్లో వరుసగా సీరియస్ పాత్రలు చేశాను. ఈసారి వాటికి భిన్నంగా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఉండాలని 'మజాకా' చిత్రం చేశాను. ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇప్పటివరకూ మరో చిత్రం రాలేదు' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. ఆయన హీరోగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన చిత్రమిది. రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో మాట్లాడారు.

- గతంలో 'బీరువా, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' లాంటి కొన్ని హాస్య చిత్రాల్లో నటించాను. కానీ వాటిలో పూర్తి స్థాయి కామెడీ పాత్ర చేయలేదు. 'మజాకా'లో ఆద్యంతం వినోదాన్ని పంచేలా నా పాత్ర ఉంటుంది. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు, ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్నాయి. 'మజాకా' క్లీన్ కామెడీ ఎంటర్‌టైనర్. నా కెరీర్‌లో ఇదే తొలి పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్.
- బంధువులు, స్నేహితులతో సంబంధం లేకుండా బతికే తండ్రీ కొడుకుల జీవితంలో జరిగిన సంఘటనల ఇతివృత్తంగా కథ సాగుతుంది. ఈ సినిమాలో అన్షు గారిని తీసుకోవాలనే ఆలోచన త్రినాథరావు గారిదే. అంత అందగత్తెను రావు రమేశ్ ప్రేమించే క్రమంలో పుట్టే వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఒక సన్నివేశాన్ని ఎలా తీస్తే పండుతుందో త్రినాథరావుకు తెలుసు. అందుకే ఆయన వరుస హిట్లు కొడుతున్నాడు.
- విజయ్‌గారబ్బాయి సంజయ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. న్యూ ఏజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. సంజయ్ బాగా కష్టపడుతున్నాడు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ కోసం ఒక వెబ్‌సిరీస్ చేస్తున్నాను. త్వరలో 'ఫ్యామిలీ మాన్ 3' రాబోతోంది.

ఆగస్టులో 'మిరాయి'



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న చిత్రం 'మిరాయి'. రితిక నాయక్ హీరోయిన్‌గా, మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్నారు. కాగా, ఈ చిత్రాన్ని తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, మరాఠీ భాషల్లో ఈ ఏడాది ఆగస్టు 1న 2డి, 3డి ఫార్మెట్‌లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం



- తమన్నా

'మహా కుంభమేళాలాంటి గొప్ప ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొనే అవకాశం అరుదుగా వస్తుంది. 'ఓదెల 2' లాంటి సినిమా చేయడం కూడా నాకు అరుదైన అవకాశమే. ఈ సినిమా నా సినీ కెరీర్‌లో చాలా ప్రత్యేకం' అన్నారు కథానాయిక తమన్నా. అశోక్‌తేజ్ దర్శకత్వంలో డి. మధు నిర్మించిన చిత్రమిది. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ కీలకపాత్రలు పోషించారు. తమన్నా నాగా సాధువు పాత్రలో కనిపించనున్నారు. చిత్రబృందం శనివారం మహా కుంభమేళాలో టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సంపత్ నంది మాట్లాడుతూ 'ఓదెల 2' లాంటి సినిమాలు అరుదుగా వస్తాయి, కథను, కంటెంట్‌నూ నమ్మి చేస్తున్న సినిమా ఇదని తెలిపారు. 'ఓదెల రైల్వే స్టేషన్, ఓదెల 2' చిత్రాల్లో అవకాశం ఇచ్చిన సంపత్‌నందికి రుణపడి ఉంటానని అశోక్‌తేజ్ చెప్పారు. 'సంపత్‌నంది పర్యవేక్షణలో సినిమా అద్భుతంగా తెరకెక్కింది, ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆదరించాలి' అని డి. మధు కోరారు.

రావణుడొచ్చాడు!



రావణుడు వచ్చేశాడు.. శ్రీరామునిపై యుద్ధం ప్రారంభించాడు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రంలో కన్నడ హీరో యశ్ రావణుడి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. తన తాజా చిత్రం 'టాక్సిక్' కోసం ప్రస్తుతం ముంబైలోనే ఉన్న యశ్ ఇప్పుడు 'రామాయణ' మీద దృష్టి పెట్టారు. శుక్రవారం ముంబైలోని అక్సా బీచ్‌లో కీలకమైన యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించారు. అందులో యశ్ పాల్గొన్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉన్న సన్నివేశాలను చిత్రీకరించినట్లు యూనిట్ సభ్యులు చెప్పారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా 'రామాయణ' చిత్రం తయారవుతోంది. తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి విడుదలవుతుంది.

ప్రతి శనివారం ఇక సినీ వారం







సర్వ కళల సమాహారం సినిమా.. తెరపై తమ పేరు చూసుకోవాలనుకునే కళాకారుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చుకోవాలంటే ఎక్కడో సాయం అందాలి.. సినీ రంగం వైపు అడుగులు వేస్తున్న ఔత్సాహికుల కళాత్మకతను, సృజనాత్మకతను గుర్తించే వారుండాలి. ఈ ప్రయత్నంలో ఉన్న వారికి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మంచి అవకాశం కల్పిస్తోంది. రవీంద్రభారతిలోని థియేటర్‌కు పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ గా నామకరణం చేసి యువతరం తీసిన షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలను ఈ వేదికపై ప్రదర్శింపజేస్తున్నారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు మామిడి హరికృష్ణ నేతృత్వంలో 2016లో సినివారం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ప్రతి శనివారం సినివారం' పేరిట ప్రారంభమైన ఈ వేదికపై వందలాది లఘు చిత్రాలను ప్రదర్శించారు. తెలుగు సినిమా రంగానికి చెందిన దిగ్గజ దర్శకులను ఆహ్వానించి ఈ వేదికపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల, వంశీ పైడిపల్లి, హరీష్ శంకర్, ఎన్.శంకర్, నర్సింగరావు, తరుణ్ భాస్కర్, వేణు ఊడుగుల, ప్రవీణ్ సత్తారు, శ్రీనాథ్, సందీప్ రెడ్డి వంగా, సంకల్ప్ రెడ్డి, వీ.ఎన్.ఆదిత్య, బాహుబలి రచయిత వి జయేంద్రప్రసాద్ వంటి ప్రముఖలతో ఔత్సాహిక కళాకారులతో ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ ప్రయాణంలో భాగంగా సినివారం ఇప్పుడు 3వ వెర్షన్‌ను పునః ప్రారంభించింది.

సినివారం టు సినిమా దర్శకులుగా..

సినివారం వేదికగా తమ షార్ట్ ఫిల్మ్‌లను ప్రదర్శించిన వారు పెద్ద సినిమాలతో దర్శకులుగా తెలుగు చిత్రసీమకు పరిచయం అయ్యారు. ఇప్పటివరకూ 15మంది దర్శకులు సినీ ఇండస్ట్రీకి పరిచయం కావడం విశేషం. వీరి ఫోటోలు పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ హాల్‌లో ఏర్పాటు చేశారు. తరుణ్‌భాస్కర్ (పెళ్ళిచూపులు), కేవీఆర్ మహేంద్ర(దొరసాని), సాహిత్ మోత్కూర్ (సవారి), ఉదయ్ గుర్రాల (మొయిల్), బడుగు విజయ్‌కుమార్ (తమసోమ జ్యోతిర్గమయా), వేణు ముల్కాల (విశ్వక్), సంపత్ కుమార్ (సూరాపానం), గంగాధర్ అద్వైత (సురభి 70ఎంఎం), సూర్య తేజ(ఫోకస్), ధ్రువ (కిరోసిన్), జాన్ జక్కి (2020గోల్‌మాల్), అక్షరకుమార్ (షరతులు వర్తిస్తాయి), నవీన్ కుమార్ గట్టు (శరపంజరం) వంటి వారు తెలుగు సినిమా రంగానికి దర్శకులుగా పరిచయమయ్యారు.

సినివారం కోసం సంప్రదించండిలా..

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సినివారం పేరిట రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో లఘు చిత్రాలను ప్రదర్శిస్తారు. దీని కోసం రవీంద్రభారతి ప్రాంగణంలోని భాషా సాంస్కృతిక కార్యాలయంలో సంప్రదించవచ్చు. తమ సినిమా వివరాలతో అక్కడ నమోదు చేసుకోవాలి. లఘు చిత్రాల సంఖ్యను బట్టి ప్రతి శనివారం ఒకటి లేదా రెండు సినిమాలు ప్రదర్శిస్తారు. అక్కడికి రెగ్యులర్‌గా వచ్చే ప్రేక్షకులతో పాటు సినిమాకు సంబంధించిన ప్రేక్షకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కార్యాలయంలో నమోదు చేయడం కుదరని వారు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

రవీంద్రభారతి (ఆంధ్రజ్యోతి)

సినిమా కలను సినివారంతో సాకారం చేసుకోండి

సినిమాలు, కళల ద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించే ప్రతిభావంతుల కోసం సినివారం తలుపులు తెరిచి ఉంటాయి. మీ చలన చిత్రాలకు వేదికనందించి మీ సృజనాత్మకతను ప్రపంచానికి పరిచయం చేస్తాం. ప్రస్తుతం తెలంగాణ నేపథ్యమున్న కథలు, సినిమాలు...కళాకారులు, టెక్నీషియన్‌లు విజయాలు సొంతం చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రతిభ లక్ష్యంగా 2016లో సినివారం ప్రారంభించాం ఈ ఎనిమిదేళ్లలో వందల లఘు చిత్రాలను తెరపై ప్రదర్శించడంతో పాటు సినీ రంగ నిపుణులతో నేరుగా పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాం

మామిడి హరికృష్ణ, సాంస్కృతిక శాఖ సంచాలకుడు

ఇన్ ప్రోగ్రెస్

ప్రతి మహిళా చూడాల్సిన చిత్రం



నటి ఆమని లీడ్ రోల్ పోషించిన చిత్రం 'నారి'. దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. శనివారం నిర్మాత దిల్‌రాజు 'నారి' ట్రైలర్‌ను ఆవిష్కరించి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఆమని మాట్లాడుతూ 'ప్రతి మహిళా చూడాల్సిన చిత్రమిది. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, అన్యాయాలను దర్శకుడు ఆకట్టుకునేలా తెరకెక్కించారు' అని కోరారు.

కామెడీ థ్రిల్లర్



త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా నటించిన కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. మార్చి 7న విడుదలవుతోంది. 'ప్రముఖ హాస్య నటులంతా మా చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు' అని యూనిట్ తెలిపింది.

రెడ్డి మామా.. బరాబర్ ప్రేమిస్తా



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'బరాబర్ ప్రేమిస్తా' చిత్రంలోని 'రెడ్డి మామా' అంటూ సాగే మాస్ సాంగ్‌ను నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. సురేశ్ గంగుల రాసిన ఈ పాటను నకాష్ అజీజ్, సాహితి చాగంటి పాడారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్. సంపత్ రుద్ర దర్శకత్వంలో గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మిస్తున్నారు.

అందెల రవమిది అలరిస్తుంది



ఇంద్రాణి దవులూరి ప్రధాన పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అందెల రవమిది'. చిత్రబృందం శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్‌శంకర్ 'అందెల రవమిది' టీజర్‌ను విడుదల చేశారు. మన సంప్రదాయ నృత్య కళలను బతికించుకోవాలనీ, వాటి గురించి ప్రపంచానికి చాటి చెప్పాలనేదే తన ప్రయత్నమని ఇంద్రాణి తెలిపారు.

బంగారీ.. బంగారీ



శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మేన్షన్ హౌస్ మల్లేష్'. రాజేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా హీరో అడివి శేష్ 'బంగారీ.. బంగారీ' పాటను విడుదల చేశారు. రామజోగయ్య సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందించారు. హరిణి ఇవటూరి అద్భుతంగా ఆలపించారు.



హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న జనిపల్లి శ్రీనివాసరావు కుటుంబం

వైసీపీ అకృత్యాలకు బలైన దళితుల కేసులు పునర్విచారణ

- హోం మంత్రి వంగలపూడి అనిత హామీ
- కోడికత్తి కేసును పోలీసు శాఖకు బదిలీ చేయాలని నిందితుడి వినతి

నక్కపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అకృత్యాలకు బలైన దళిత బాధితుల కేసులను పునర్విచారణ చేయిస్తామని, ఎస్పీల నుంచి నివేదికలు తీసుకుంటామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) నాయకుడు బూసి వెంకటరావు నేతృత్వంలో కోడి కత్తి కేసు నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు, వెంకటాయపాలెం శిరోముండనం కేసుకు సంబంధించి వీధి సుబ్రహ్మణ్యం, విశాఖ జైలులో మృతిచెందిన వ్యక్తి కుటుంబీకులు శనివారం నక్కపల్లిలో హోంమంత్రి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. కోడికత్తి వ్యవహారంలో టెర్రరిస్ట్ కుట్ర, రాజకీయ కుట్ర లేదని ఎన్ఐఏ నివేదిక ఇచ్చినందున కేసును రాష్ట్ర పోలీస్ శాఖకు బదిలీ చేయాలని వెంకటరావు, నిందితుడు శ్రీనివాసరావు కోరారు. వైసీపీ ప్రభుత్వంలో వేధింపులకు గురైన కుటుంబాలకు న్యాయం చేయాలని వెంకటరావు కోరారు.

మహా కుంభమేళాలో మంత్రి సత్యకుమార్



మహా కుంభమేళాలో పుణ్యస్నానం ద్వారా కలిగే అనుభవం అనిర్వచనీయమైనదని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఉదయం ఆయన పవిత్ర గంగానదిలో పుణ్యస్నానం ఆచరించారు. ఈ పవిత్ర స్నానం తనను అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవంతో పులకింప చేసిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆయన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తొలుత ఆయన కేంద్ర జలశక్తి మంత్రి ఎస్.దేవ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేది కాదు

- ప్రజా తీర్పును జగన్ శిరసావహించాలి
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్ష హోదా వైఎస్ జగన్ అడిగితే ఇచ్చేది కాదు. ప్రజలు నిర్ణయిస్తారు' అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని మౌర్యాఇన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమహంసతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అధికారం ఉంటేనే ప్రజల గురించి పట్టించుకుంటాను, ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వైఎస్ జగన్ చెప్పటం విడ్డూరంగా ఉంది. వైసీపీ పాలనలో ప్రజలకు మంచి జరిగి ఉంటే గత ఎన్నికల్లో ఒక్క మంత్రి మినహా మిగిలిన మంత్రులు అందరూ ఎందుకు ఓటమి పాలయ్యారు? కూటమి ప్రభుత్వంలోని మంత్రులను లక్ష్యంగా చేసుకుని తమకు అనుకూలమైన మీడియాలో నిత్యం అసత్య ప్రచారం చేయడం తగదు. కూటమి ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలి. 8 నెలల్లోనే అద్భుతాలు జరగవు. వైఎస్ జగన్ అసెంబ్లీలో మాట్లాడాలి' అని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతులు, ప్రజలను జలచోరులుగా, దోపిడీదారులుగా చిత్రీకరించి మాట్లాడిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. తన పదవిని కాపాడుకునేందుకే ఆయన రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన తరువాత ఆర్థిక కష్టాల నుంచి ఏపీ నిలదొక్కుకుంటుంటే, అన్నీ ఉన్న తెలంగాణను అక్కడి పాలకులు అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని విమర్శించారు.

ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ సర్పంచి టోకరా

- ఆట స్థలం కబ్జా చేసిన ఆ పార్టీ నాయకులు
- టీడీపీ ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదులు



పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న టీడీపీ మాజీ మంత్రి నెట్టెం రఘురాం, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన సర్పంచి గత ప్రభుత్వంలో పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తానంటూ తమ నుంచి సుమారు రూ.12 లక్షలు వసూలు చేశాడని విజయనగరం జిల్లా గంట్యాల మండలం నరవ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని టీడీపీ నేతలను కోరారు.టటీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావినతుల కార్యక్రమంలో మాజీ మంత్రి నెట్టెం రఘురాం, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కోటాలపల్లిలో ప్రభుత్వ పాఠశాల ఆటస్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని పాఠశాల విద్యాకమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఉపాధి నిధులు మురగబెట్టేశారు

- వైసీపీ పాలనలో భారీగా అవినీతి: లంకా దినకర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకం నిధులను మురగబెట్టేశారని, ఖర్చు చేసిన వాటిలో భారీ అవినీతి జరిగిందని 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఆరోపించారు. విశాఖపట్నంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ 15 జిల్లాల్లో పర్యటించి, అధికారులతో సమీక్షించాకే తాను ఈ విషయం చెబుతున్నానన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 2019-24 మధ్య కాలంలో దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన మెటీరియల్ కంపోనెంట్ ఎంటైటిల్‌మెంట్ వినియోగించుకోకపోవడం వల్ల నిధులు మురిగిపోయాయన్నారు. ఇక రాష్ట్రం మొత్తం లెక్క వేసుకుంటే ఎంత ఉంటుందో ఆలోచించాలన్నారు. ఈ పథకంలో సిమెంట్‌ను సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పేరుతో సరఫరా చేశారని, నాటి అధికార పార్టీ పెద్దలకు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, అక్కడి నుంచే సరఫరా జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తంచేశారు. వీటన్నింటిపైనా విచారణ చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ విశాఖ అధ్యక్షులు పరశురామరాజు, పూర్వ అధ్యక్షులు ఎం.రవీంద్ర, అధికార ప్రతినిధి సుహాసినీ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పూచీ మాదే!

(మొదటి పేజీ తరువాయి)

నిల్వ చేసుకునే మిర్చి రైతులకు బ్యాంకు రుణాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కృష్ణపట్నం పోర్టు టెర్మినల్ ద్వారా మిర్చి కంటైనర్ల రవాణాకు అనుమతిస్తామని చెప్పారు. పల్నాడు జిల్లాలోని స్పైసెస్ పార్కుకు మౌలిక వసతులు కల్పిస్తామని, గుంటూరు మిర్చి యార్డులో లారీ యజమానుల తీరుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ-క్రాప్ లో నమోదు అయిన రైతుల వివరాలు లేదా యార్డులో పంట అమ్ముకున్న వివరాల ఆధారంగా సాయం చేసే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం చెప్పారు. మిర్చి ధరల తగ్గుదల, కేంద్రం జోక్యం వంటి అంశాలపై శనివారం అమరావతి సచివాలయంలో మిర్చి రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులతో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన ఈ భేటీలో వారి సమస్యలు, అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చినట్టుగా క్వింటా లెక్కన బోనస్ ఇవ్వాలని సీఎంను వారు కోరారు. రైతుకు ఏ విధంగా సాయం చేస్తే నేరుగా అందుతుందో ఆలోచన చేసి తనకు నివేదించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

ఎగుమతులకు అనుమతించండి: వ్యాపారులు

కృష్ణపట్నం పోర్టు నుంచి చైనా బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండోనేసియా దేశాలకు మిర్చి ఎగుతుమలకు అనుమతించాలని ఎగుమతి దారులు కోరారు. రాష్ట్రంలో పండే మిర్చిలో 60 శాతం ఎగుమతి చేస్తున్నామని చెప్పారు 410 మంది ప్రధాన ఎగుమతి దారులలో ప్రస్తుతం 250 మందే చురుగ్గా ఉన్నారని





సీఎంతో సమావేశం అనంతరం మాట్లాడుతున్న మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మిర్చి వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ

తెలిపారు. కృష్ణపట్నం నుంచి రవాణాకు అవకాశం లేకపోవడంతో చెన్నై పోర్టు నుంచి ఎగుమతి చేయాల్సి వస్తోందని, దానివల్ల ఖర్చులు పెరుగుతున్నాయని సీఎంకు వివరించారు. కోల్డ్ స్టోరేజీలలో మిర్చి నిల్వలు ఎక్కువైనప్పుడు యార్డుకు తెస్తున్నారని, డిమాండ్ మేరకు రైతులకు ధర ఇస్తున్నామని వ్యాపారులు చెప్పారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ, మిర్చి ధర తగ్గి రైతులు ఇబ్బంది పడకుండా చూడటమేప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ధరల తగ్గుదలపై కేంద్రానికి మూడు లేఖలు రాశానని, రైతులను గట్టెక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, ఎగమతి దారులు సహకరించాలని కోరారు.

ఆ లారీ యజమానులపై చర్యలు

మిర్చి రైతుల నుంచి కిరాయి ఎక్కువ వసూలు చేస్తున్న లారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రవాణా వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకొని రైతులను ఇబ్బంది పెడితే సహించవద్దన్నారు. మిర్చి యార్డులో ఎలక్ట్రానిక్ కాటాలు ఏర్పాటు చేసి తూకం వేయగానే రైతుల ఫోన్‌లకు మెసేజ్‌లు పంపాలన్నారు. కోల్డ్ స్టోరేజీల్లో టిక్కీలు నిల్వ చేసిన రైతులకు బాండ్లపై రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్పైసెస్ పార్క్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని హామినిచ్చారు. తెగుళ్లు, పెట్టుబడుల తగ్గుదలకు రైతులకు సూచనలు ఇవ్వాలని వ్యవసాయ నిపుణులను సీఎం కోరారు. ధర తగ్గితేకేంద్రం 50శాతం, రాష్ట్రం 50శాతం భరించాల్సి ఉంటుందని, దానివల్ల పక్క రాష్ట్రాల్లోని వ్యాపారులు ఏపీకి పంట తెచ్చి అమ్ముకునే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. దీనిపై మరోసారి కేంద్రంతో చర్చిస్తామని సీఎం చెప్పారు. గతంలోధర తగ్గినప్పుడు ఎకరాకు రూ.1,500 బోనస్ ఇచ్చామని, రైతులకు ఇచ్చే ప్రతి రూపాయి రైతులకే చెందాలని, మధ్యవర్తులకు కాదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో మామిడి, మిర్చి బోర్డుల ఏర్పాటుపై త్వరలో చర్చిస్తామని సీఎం చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ , ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు రాజశేఖర్, విజయ సునీత, శ్రీనివాసులు, రైతు ప్రతినిధులు మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకుంటాం

- ధరల పతనంపై దృష్టి సారించాం
- టమాటా రైతులకు చేయూతనిస్తాం
- రైతులతో చర్చించి త్వరలోనే చర్యలు
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని మిర్చి రైతులను ఆదుకుంటామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. టమాటా రైతులకు చేయూత ఇచ్చేందుకు కూడా కేంద్రం చర్యలు చేపట్టిందని తెలిపారు. శనివారం, 'పూస కృషి విజ్ఞాన్ మేళా 2025'ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతుల సంక్షేమానికి అవసరమైన అన్ని నిర్ణయాలూ తీసుకుంటున్నామని, రైతులు చింతించవద్దని విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం రైతులతో, రైతు సంఘాలతో చర్చలు జరిపి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను, ముఖ్యంగా పండ్లు, కూరగాయలను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా ఒక మార్గాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. పంటపోలాల వద్ద ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉన్నాయని, వినియోగదారులు మాత్రం అధిక ధరలకు కొంటున్నారని అన్నారు. ఎవరు ఆ లాభాన్ని తీసుకుంటున్నారని శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశ్నించారు.

మిర్చి కష్టాలివీ...

1 మిర్చి సాగు ఆర్థికంగా భారంగా మారింది. ఈ ఏడాది పెట్టుబడి ఎకరాకు రూ.3.5లక్షలు పెట్టాల్సి వచ్చింది. ఇందులో పురుగు మందులకు రూ. 1.50 లక్షలు, కూలి ఖర్చు రూ.లక్ష, విత్తనాలు, నారు పెంచేందుకు మరో రూ. లక్ష అయింది.


1 కూలీలు దొరకడం లేదు. కూలి రేట్లు పెరిగాయి.

1 మిర్చికి యార్డులో ఉదయం పూట నిర్ణయించిన ధర సాయంత్రానికి ఉండటం లేదు. క్వింటాకు ఐదొందలు వ్యాపారులు తగ్గిస్తున్నారు.

1 యార్డుకు మిర్చి తేవాలంటే లారీ బాడుగ ఎక్కువ అవుతోంది.యూనియన్‌లో లేని లారీల్లో రవాణా చేస్తే యజమానులు కేసులు పెడుతున్నారు.

నాకంతా తెలుసు..!

- సమన్వయంతో పనిచేసుకోండి
- ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన



అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): "నాకంతా తెలుసు. ఫైబర్‌నెట్‌లో అసలు ఏం జరిగిందో ఇంటెలిజెన్స్ నుంచి నాకు సమాచారం ఉంది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలసి సమన్వయంతో పని చేసుకోండి" అని సీఎం చంద్రబాబు ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డికి సూచించారు. అంతేకాదు.. ఫైబర్ నెట్ విషయంలో ఏం చేయాలో.. ఎలా చేయాలో కూడా తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. "మీరు తెలివైన వారు. మీ తెలివితేటలను సంస్థ పురోభివృద్ధికి ఉపయోగించండి. పార్టీ కోసం మీరు చేసిన కృషి నాకు తెలుసు" అని జీవీ రెడ్డిని ఉద్దేశించి సీఎం అన్నారు. శనివారం సచివాలయంలో సీఎం చంద్రబాబుతో జీవీ రెడ్డి భేటీ అయ్యారు. రెండు రోజుల కిందట ఫైబర్‌నెట్ ఎండీ దినేశ్‌కుమార్‌పై చైర్మన్ జీవీరెడ్డి తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇది ప్రభుత్వ రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం అయింది. దీంతో ముఖ్యమంత్రిని కలిసి వివరణ ఇవ్వాలని జీవీ రెడ్డి నిర్ణయించారు. ఈ క్రమంలో జీవీ శనివారం సచివాలయంలో సీఎంను కలసి.. మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలకు వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ.. తనకంతా తెలుసునని.. అందరూ కలిసి పనిచేసుకోవాలని జీవీకి చంద్రబాబు సూచించారు.

జగన్ హయాంలో 3 వేల మంది కౌలు రైతుల ఆత్మహత్య

- వారి కోసం కూటమి ప్రభుత్వంలో కొత్త చట్టం: మంత్రి నాదెండ్ల

సంగం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మూడు వేల మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటే జగన్మోహన్‌రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం, సంగంలో శనివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. సంగం పీఏసీఎస్‌లో రూ.20.5 కోట్లతో నిర్మించిన గోదాము భవనం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'జగన్ ఓడిపోయిన తరువాత సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. కౌలు రైతుల కోసం కూటమి ప్రభుత్వం త్వరలో కొత్త చట్టం తీసుకురానుంది. తేమ శాతం విషయంలో రైతులు, మిల్లర్ల నుంచి ఎదుర్కొనే సమస్యకు ఓ పరిష్కారాన్ని ఎంచుకున్నాం. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు మిల్లర్లు, రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతం నిర్ధారించే ఒకే బ్రాండ్ యంత్రాలను తెచ్చి వాటిని తూనిక, కొలతల శాఖ అధికారులే నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం. ధాన్యం ఆరబోసుకునేందుకు రైతులకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి నిధులతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్‌ఫారాల ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు' అని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ హజీజ్, టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు రెండు విప్లవ పార్టీల విలీన సభ

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు విప్లవ పార్టీల విలీన ప్రక్రియ ఓ కొలిక్కివచ్చింది. కేంద్ర కమిటీల స్థాయిలో విలీన ప్రక్రియ ఇప్పటికే పూర్తికాగా... ఆదివారం రాష్ట్రంలో రెండు పార్టీలు విలీన సభను ఏర్పాటు చేస్తున్నాయి. విజయవాడలోని ఎంబీ భవన్‌లో ఈ సభను నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ తెలిపారు. చిట్టిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే ఈ సభలో వై.సాంబశివరావు, జేవీ చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, పార్టీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్, పార్టీ రాష్ట్ర నేతలు విష్ణు, కె.పోలారి తదితరులు పాల్గొంటారు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో న్యూడెమోక్రసీలో చీలికలు ఏర్పడ్డాయి. చంద్రం గ్రూప్‌గా ఏర్పడిన పార్టీ సుదీర్ఘ కాలం మనుగడ సాధించలేకపోయింది. ఏ వ్యక్తిని నమ్ముకొని విడిపోయారో అతని పనితీరుపైనే నాయకులు, కేడర్‌కు అపనమ్మకాలు ఏర్పడ్డాయి. ఆనాడు జరిగిన చీలికపై సమీక్ష చేసుకున్న ఆ గ్రూపులోని మెజారిటీ నేతలు తిరిగి సొంత పార్టీలో విలీనమవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రెండు కేంద్ర కమిటీల స్థాయిలో చర్చలు జరిగాయి. అటు కేంద్రంలోనూ, ఇటు తెలంగాణ రాష్ట్రంలోనూ విలీన ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు ఏపీలో విలీన కార్యక్రమాలు ముగిశాయి. లాంఛనంగా విలీన సభను ఏర్పాటు చేస్తున్నట్లు న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ తెలిపారు. నేటి ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విప్లవ కర్తవ్యాలను రూపొందిస్తామని ఆయన చెప్పారు. ప్రజలు, ప్రజాసంఘాలు విలీన సభను విజయవంతం చేయాలని ప్రసాద్ కోరారు.

నేడు 'మార్క్సిస్టు ఆలోచనాపరుల' సదస్సు

- పాల్గొంటున్న 15 కమ్యూనిస్టు వామపక్ష నిర్మాణాలు

విజయవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు ఉద్యమ శతవార్షికోత్సవం సందర్భంగా 'భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం ఆవశ్యకత, అవకాశాలు - అవరోధాలు' అన్న అంశంపై ఆదివారం సదస్సు జరుగుతుందని 'మార్క్సిస్టు ఆలోచనాపరులు' తెలిపారు. ఈ సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు చిగురుపాటి భాస్కరరావు, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా, అడ్వకేట్ పిచ్చుక శ్రీనివాస్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేస్తూ... 'విజయవాడ బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్‌లో ఈ చారిత్రక సదస్సు జరగనుంది. ఈ సదస్సులో సీపీఐ, సీపీఎం, వివిధ సీపీఐ(ఎంఎల్) పార్టీలు, విప్లవ రచయితల సంఘం ప్రతినిధులు పాల్గొంటున్నారు. మొత్తంగా 15 కమ్యూనిస్టు వామపక్ష నిర్మాణాల రాష్ట్ర నాయకులు తమ అభిప్రాయాలను పంచుకుంటారు. ప్రస్తుతమున్న ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, వర్గ, కుల సమాజం స్థానంలో నిజమైన గణతంత్ర, ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ రాజ్యం ఏర్పాటు కావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఆకాంక్ష సఫలం అయ్యేందుకు కమ్యూనిస్టు ఉద్యమ పురోగమన అవకాశాలు, అవరోధాలపై వామపక్ష పార్టీల అభిప్రాయాలను ఒకే వేదికపై నుంచి తెలుసుకుని ప్రజలకు తెలియజేయాలన్నదే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం' అని వివరించారు.

పీఛేముడ్!



- విపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తా
- ఇన్నాళ్లూ భీష్మించిన వైఎస్ జగన్
- సభ్యత్వం పోయే పరిస్థితి రావడంతో వెనక్కి
- రేపు ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీకి..

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే శాసనసభ సమావేశాలకు హాజరవుతానని ఇన్నాళ్లూ భీష్మించిన వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఎట్టకేలకు మెట్టు దిగారు. సోమవారం నుంచి మొదలవుతున్న 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశాలకు తన ఎమ్మెల్యేలతో కలిసి ఆయన హాజరు కానున్నారు. తొలిరోజు సభలో జరిగే గవర్నర్ ప్రసంగానికి వీరంతా హాజరవ్వనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీకి 11 సీట్లు లభించిన విషయం తెలిసిందే. దానివల్ల ప్రతిపక్ష హోదాను జగన్ కోల్పోయారు. అయినా, విపక్ష హోదా కోసం ఇన్నాళ్లుగా ఆయన వాదిస్తూనే ఉన్నారు. న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి, అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసినప్పటినుంచీ జగన్, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లడంలేదు. అసెంబ్లీ సమావేశాల సమయంలో తాను వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వంపై సంధించే ప్రశ్నలకు .. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి, మంత్రులు సమాధానం చెప్పాలని ఇటీవల జగన్ హూంకరించారు. ఈ క్రమంలో అసెంబ్లీ నిబంధనల ప్రకారం వరుసగా అరవై రోజులు ఏ కారణం లేకుండా, సమాచారం ఇవ్వకుండా నిరవధికంగా సభకు గైర్హాజరు అయితే సభ్యుల సభ్యత్వం రద్దవుతుందని సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు అధికారికంగానే స్పష్టం చేశారు. శాసనసభకు హాజరుకాకపోతే .. సభ్యత్వం రద్దయితే .. ఉపఎన్నికలను ఎదుర్కోనాల్సి వస్తుందని జగన్ భావించారోఏమోగానీ... అనూహ్యంగా వెనక్కి తగ్గారు. శాసనసభా సమావేశాలకు హాజరవుదామంటూ శనివారం జగన్‌కు శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ సూచించినట్టు తెలిసింది. ఇందుకు జగన్ తలూపారు. అయితే..శాసనసభా సమావేశాలకు ఎంతకాలం జగన్, ఆయన ఎమ్మెల్యేలు హాజరవుతారనేది మాత్రం స్పష్టత లేదు. శాసనసభలో గవర్నర్ ప్రసంగం తర్వాత వేరే కార్యకలాపాలు లేకుండానే సభ ఆ రోజుకు వాయిదా పడుతుంది. తిరిగి మంగళవారం సమావేశమవుతుంది. మరి... జగన్, ఎమ్మెల్యేలు తొలి రోజు మాత్రమే వస్తారా? లేక బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేవరకు కొనసాగుతారా అనేది తెలియాల్సి ఉంది. కాగా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును శాసనసభలో నిలదీస్తామంటూ సోషల్ మీడియాలో వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. కాగా.. ఆదివారం బెంగళూరు నుంచి తాడేపల్లికి జగన్ చేరుకుంటారు. ఆ వెంటనే, అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలతో ఆయన సమావేశమవుతారు. ఈ సమావేశంలో అసెంబ్లీకి ఎన్ని రోజులు హాజరయ్యేదీ ఆయన స్పష్టతను ఇస్తారని వైసీపీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

వర్గీకరణకు జగన్ వ్యతిరేకం

- గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలే నిదర్శనం
- సుప్రీం తీర్పును దేశమంతా స్వాగతించింది
- జగన్ మాత్రం ఒక్క ప్రకటనా చేయలేదు
- కమిషన్ నివేదిక పారదర్శకంగా ఉండాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ




అనంతపురం సభలో ప్రసంగిస్తున్న కృష్ణ మాదిగ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా వైసీపీ అధినేత జగన్ గతంలో చేసిన వ్యాఖ్యలు వర్గీకరణకు వ్యతిరేకంగా ఉన్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి మందకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసి చంద్రబాబు దళితులను చీల్చారని సీఎంగా ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీలో మాట్లాడారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు వద్దన్నా, రాజ్యాంగ విరుద్ధమని తెలిసినా వర్గీకరణ అమలు చేశారని చంద్రబాబుపై ఆయన చేసిన అసత్య ఆరోపణలను మాదిగలు మరువకూడదన్నారు. సుప్రీంకోర్టులో వర్గీకరణ విచారణపై తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదులను నియమించినా, ఏపీలోని వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, ఈ అంశంపై జగన్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. వర్గీకరణకు జగన్ మద్దతు లేదని అప్పట్లోనే తేలిపోయిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తాజా తీర్పును దేశం మొత్తం స్వాగతించినా జగన్ మాత్రం ఒక్క ప్రకటన కూడా చేయలేదని, ఆయన మాలలవైపే ఉన్నారనడానికి ఇదే సాక్ష్యమని పేర్కొన్నారు. జగన్ వైఖరిని గమనించాలని కార్యకర్తలను మందకృష్ణ కోరారు. చంద్రబాబు మాదిగల వైపు ఉన్నారన్నారు. టీడీపీకి, ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణలో అండగా నిలిచామని చెప్పారు. ఎలాంటి అనుమానాలు లేకుండా కమిషన్ నివేదిక రావాలని కోరుకుంటున్నామని అన్నారు. వర్గీకరణ కోసం ఎంతోమంది కార్యకర్తలు అసువులు బాశారని, వారి త్యాగఫలాలను అందుకోబోతున్న సందర్భంగా మార్చి 1న ఎమ్మార్పీఎస్ అమర వీరుల దినోత్సవాన్ని ఊరువాడా సంబరాలుగా నిర్వహించాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. మరో ముఖ్యఅతిథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ నాయకత్వం... మాదిగల ఆత్మస్థైర్యం, అస్తిత్వం, ఆత్మగౌరవమన్నారు. ఆయన 30ఏళ్ల నిజాయితీ, ఉద్యమ గౌరవానికి పద్మశ్రీ నిదర్శనమని పేర్కొన్నారు. వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వానికి, మాదిగలకు వారధిగా కృషి చేస్తానని చెప్పారు. అణగారిన వర్గాల్లోని అట్టడుగు వర్గం నుంచి ఉదయించిన సూర్యుడని, ఆయన పద్మవిభూషణ్‌కు అర్హుడన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగను గజమాలతో సత్కరించి, 'పోరు దండోరా' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 28న బడ్జెట్.. అదే రోజు ఉదయం కేబినెట్ భేటీ



అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు 24 నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ఉభయసభలు ప్రారంభం అవుతాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. సోమవారం మధ్యాహ్నం 12గంటలకు బీఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే బిల్లులు ప్రవేశపెట్టాలనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. 26, 27 అసెంబ్లీకి సెలవు. 28న 2025-26 ఆర్థికసంవత్సరానికి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెడతారు. దానికిముందు ఉదయం 9 గంటలకు కేబినెట్ సమావేశం జరుగుతుంది. అందులో బడ్జెట్‌కు ఆమోదం తెలియచేస్తారు. మార్చి 1, 2 సెలవులు. 3నుంచి అసెంబ్లీ తిరిగి కొనసాగుతుంది. బడ్జెట్ సమావేశాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మీడియా, విజిటర్లు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక పాస్‌లు జారీ చేశారు. అసెంబ్లీ, మండలిలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు వివిధ కలర్ కోడ్‌లతో పాస్‌లు సిద్ధం చేశారు. గేట్-1 నుంచి మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎంను అనుమతిస్తారు. గేట్-2 నుంచి మంత్రులు, గేట్-4 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అనుమతి ఇస్తారు.



మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సినీ హీరో విజయ్ దేవరకొండ

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- సినీ హీరో విజయ్ దేవరకొండ పిలుపు
- విశాఖలో పోలీసులతో కలిసి కరపత్రాల విడుదల

విశాఖపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రముఖ సినీ హీరో విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు. సినిమా షూటింగ్ కోసం విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు వచ్చిన విజయ్ దేవరకొండను వన్‌టౌన్ సీఐ జీడీబాబు కలిశారు. మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి జీవితాలను బుగ్గిపాల్జేసుకుంటున్నారని, వారిలో చైతన్యం కలిగించేందుకు వీలుగా సందేశం ఇవ్వాలని కోరారు. అందుకు విజయ్ సుముఖత వ్యక్తం చేశారు. 'మీ కోసం- మీ పోలీస్' పేరుతో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు రూపొందించిన కరపత్రాలను శనివారం ఉదయం సీఐతో కలిసి విజయ్ దేవరకొండ ఆవిష్కరించారు.

'వికసిత్ భారత్'లో కార్మికులది కీలకపాత్ర

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ 2047 కలను సాకారం చేసేలా అన్ని రంగాల్లో దేశాన్ని ఆత్మ నిర్భర్ భారత్ దిశగా శరవేగంగా అడుగులు వేసేందుకు కార్మికుల భాగస్వామ్యం అవసరమన్నారు. శనివారం భువనేశ్వర్‌లో నిర్వహించిన భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అనుబంధ పారిశ్రామిక విభాగానికి చెందిన పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ నేషనల్ కాన్ఫెడరేషన్ సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన ఈ శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటి వరకు 30 కోట్ల మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. 70 ఏళ్లుగా శ్రామికులు, కార్మికుల పక్షాన ఉంటూ, వారి కోసం పనిచేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంస్థ బీఎంఎస్ అన్నారు.

ప్రకృతి సేద్యం విస్తరణకు కీలక ఒప్పందం

- రైతు సాధికార సంస్థతో అమెరికా సంస్థల ఎంవోయూ

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రైతు సాధికార సంస్థతో అమెరికాకు చెందిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్ ట్రస్ట్ త్రైపాక్షిక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. శనివారం విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో స్పెషల్ సీఎస్ రాజశేఖర్ సమక్షంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్, పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ సీఈవో క్రేగ్ కోగట్, ప్రొడ్యూసర్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో 10- 60లక్షల మంది రైతులను భాగస్వామ్యం చేయడం, నిధుల సమీకరణ, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, కృత్రిమ మేధ ఆధారిత పరిశోధన, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా పెగాసస్ సీఈవో క్రేగ్ కోగట్, ప్రొడ్యూసర్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా మాట్లాడారు. ప్రకృతి సేద్యానికి సీఎం చంద్రబాబు ఇస్తున్న ప్రాధాన్యతను చూస్తే గర్వంగా ఉందన్నారు.

'టెస్లా' రేసులో ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నాలు ముమ్మరం చేసింది. టెస్లాను ఆకర్షించడానికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ (ఈడీబీ) రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో పోర్టు కనెక్టివిటీతో ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికిప్పుడు కార్ల తయారీ యూనిట్‌ను నెలకొల్పకపోయినా.. పోర్ట్ యాక్సెస్‌తో టెస్లా రెడీమేడ్ కార్లను దిగుమతి చేసుకోవడానికి వీలుగా అవసరమైన భూమితో పాటు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆఫర్ చేస్తోంది. ఆ తర్వాత క్రమంగా కార్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు టెస్లా కంపెనీకి పూర్తి సహాయ సహకారాలు అందించనుంది. రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో టెస్లా కార్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా ఆటోమొబైల్ కంపెనీలు, బ్యాటరీ తయారీ యూనిట్లు నెలకొల్పడానికి అవసరమైన ఎకోసిస్టమ్ రెడీగా ఉంది. గణాంకాల ప్రకారం భారత్‌లో 60 శాతం ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ కార్ల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే టెస్లా ఈవీ కార్ల తయారీ యూనిట్‌ను ఏపీలో నెలకొల్పేందుకు 2017లోనే ఆ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. రాయలసీమలో 4 మెగా వాట్ల సామర్థ్యంతో రెండు సౌరశక్తి నిల్వ యూనిట్ల స్థాపనకు సాంకేతిక నైపుణ్యాన్ని విస్తరిస్తామని టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌కు హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఇటీవల తన అమెరికా పర్యటనలో భాగంగా టెస్లా కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వైభవ్ తనేజాను కలిసి ఏపీలో టెస్లా ఈవీ కార్ల తయారీ యూనిట్ నెలకొల్పే అంశంపై చర్చలు జరిపారు. ఇప్పుడు ప్రధాని మోదీ అమెరికా పర్యటనతో భారత్‌లో అడుగు పెట్టేందుకు టెస్లా సిద్ధమైంది. దీంతో కూటమి ప్రభుత్వం మరోసారి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.



టన్నెల్‌లో ప్రాణాలు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మన్నెవారిపల్లి వైపు నీటిని తరలించే ఇన్ లెట్ భాగం నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట సమీపంలో శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టన్నెల్‌లో రాళ్లు, మట్టి పడటంతోపాటు పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో టన్నెల్‌లో పనిచేసేందుకు వెళ్లిన కార్మికులు, ఉద్యోగుల్లో 8 మంది అందులో చిక్కుకుపోయారు. 46 మంది ప్రాణాలతో బయటపడ్డారు. టన్నెల్‌లో 8 మీటర్ల మేర నీరు చేరడం, 124 మీటర్ల దూరం వరకు పెచ్చులూడి పడటంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో అత్యవసరంగా మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆరా తీసి.. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారందరికీ మెరుగైన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎం ఆదేశాలతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెలికాప్టర్‌లో హుటాహుటిన దోమలపెంటకు చేరుకున్నారు. ఆయనతోపాటు జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఫైర్ సేఫ్టీ డీజీలు దోమలపెంటకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తక్షణ సహాయక చర్యల గురించి సమీక్ష నిర్వహించారు. చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు రెస్క్యూ టీంలను రంగంలోకి దించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌ఆర్డీఎఫ్ బృందాలు కూడా ప్రమాద స్థలికి చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు అధికారులు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారికి అవసరమైన ఆక్సిజన్‌తో పాటు ఆహారం పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తామని సీఎంకు చెప్పారు. పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని హామీ ఇచ్చినట్లు సీఎం కార్యాలయం తెలిపింది.



ప్రమాదంలో ధ్వంసమైన యంత్ర సామగ్రి; నీటి లీకేజీ

ప్రమాదం జరిగింది ఇలా..

నల్లగొండ జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరు అందిచాలన్న ఉద్దేశంతో 2005లో అప్పటి ప్రభుత్వం నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు శ్రీకారం చుట్టింది. దోమలపెంటలోని కృష్ణా నది నుంచి మన్నెవారిపల్లి మీదుగా 44.50 కిలోమీటర్ల దూరం టన్నెల్ పనులు జరుగుతున్నాయి. అయితే నాలుగేళ్ల నుంచి టన్నెల్ తవ్వకం పన్నులు పెడింగ్‌లో ఉన్నాయి. ఈ పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక పనులు చేపడుతోంది. దీంతో నాలుగు రోజుల క్రితమే తిరిగి ప్రారంభమయ్యాయి. రోజూ రెండు షిఫ్టులుగా పనులు జరుగుతున్నాయి. మొదటి షిఫ్టు ఉదయం 7 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, రెండో షిఫ్టు సాయంత్రం 3 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నడుస్తోంది. కాగా, శనివారం ఉదయం మొదటి షిఫ్టులో పని చేయడానికి మొత్తం 54 మంది టన్నెల్ లోపలికి వెళ్లారు. అయితే 14వ కిలోమీటరు వద్ద టీబీఎం త్వవకం పనులు చేపడుతుండగా నీరు, మట్టి లీకేజీ కారణంగా టన్నెల్‌లో సిగ్మెంట్ బ్లాక్ ఆకస్మికంగా విరిగిపడి ప్రమాదం సంభవించింది. దీంతో ఆకస్మికంగా నీటి వరద రావడంతో పాటు రాళ్లు, రప్పలు మట్టి పడటం ప్రారంభమైంది. కేవలం అర గంట వ్యవధిలో 8 మీటర్ల మేర నీరు చేరడంతో ఒక్కసారిగా కలకలంరేగింది. 124 మీటర్ల దూరం వరకు టన్నెల్‌లో పెచ్చులూడిపడ్డాయి. దీంతో టన్నెల్ బోర్ట్ మెషిన్ వెనుకభాగంలో ఉన్న 46 మంది బయటకు పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. టీబీఎం ముందు భాగంలో ఉన్న 8 మంది టన్నెల్‌లోనే చిక్కుకుపోయారు.

చిక్కుకుపోయినవారు వీరే..

టన్నెల్ తవ్వకంలో టీబీఎం పనులను అమెరికాకు చెందిన రాబిన్ కంపెనీ చూస్తుండగా, సెగ్మెంట్ బ్లాకులను బిగించి.. ఊటనీటితోపాటు మట్టి కూలకుండా చేయడం జేపీ అసోసియేట్స్ చేపడుతోంది. కాగా, ప్రమాదంతో టన్నెల్‌లో జేపీ కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులతోపాటు రాబిన్ కంపెనీకి చెందిన ఇద్దరు టెక్నికల్ ఉద్యోగులు, నలుగురు కార్మికులు చిక్కుకున్నారు. వీరిలో జమ్ము కశ్మీర్‌కు చెందిన సన్నీ సింగ్(35), పంజాబ్‌కు చెందిన గురుప్రీత్‌సింగ్(40), ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్ కుమార్(51), శ్రీనివాస్(50), జార్ఖండ్‌కు చెందిన సందీప్ సాహు(38), జగత్ సెస్(37), సంతోష్ సాహు(37), అంజు సాహు(25) ఉన్నారు. వీరిని కాపాడేందుకు తక్షణమే తెలంగాణ, ఏపీకి చెందిన 145 మంది ఎన్డీఆర్ఎఫ్ బలగాలతోపాటు ఎస్డీఆర్ఎఫ్ బలగాలతో సహాయక చర్యలు చేపట్టారు. వారికి ఆక్సిజన్‌తో పాటు ఆహారం పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో టన్నెల్ లోపలకు డ్రోన్‌కు లైట్లు అమర్చి.. పంపించే ప్రయత్నాలు చేపట్టారు.



ఆక్సిజన్ సిలిండర్లతో వెళ్తున్న సహాయక సిబ్బంది

ఆక్సిజన్ అందేనా..?

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఆక్సిజన్ అందుతుందా? లేదా? అనేది సందేహంగా ఉంది. సముద్ర మట్టానికి 834 అడుగుల దిగువన టన్నల్ పనులు జరుగుతున్నాయి. అయితే శనివారం జరిగిన ప్రమాదంలో టన్నెల్ లోపలికి వెళ్లిన ఇంజనీర్లు, సిబ్బందికి ఆక్సిజన్ సిలిండర్లు లేవు. టన్నెల్ పైభాగం కూలిపోవడంతో వెనుక, ముందు భాగం నుంచి ఆక్సిజన్ అందే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో టన్నెల్ బోరింగ్ మెషిన్ ముందు భాగంలో చిక్కుకున్న వారికి ఊపిరి ఆడే పరిస్థితి ఉండదని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. రెస్క్యూ టీంలు కూడా సహాయక చర్యలు ప్రారంభించాలంటే కచ్చితంగా ఆక్సిజన్ సిలిండర్లతో వెళ్లాల్సిందే. డీవాటరింగ్ ప్రకియ, మట్టిదిబ్బలు తొలగించకుండా రెస్క్యూ టీం ముందుకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. టన్నెల్‌లో చిక్కుకున్న వారి పరిస్థితిపై వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. శనివారం పొద్దుపోయాక రెండు వాహనాల్లో రెస్క్యూటీం సభ్యులు, నాగర్‌కర్నూలు కలెక్టర్ టన్నెల్‌లోకి వెళ్లారు. అయితే వారు ఎంతవరకు వెళ్లగలరనేది అంచనా రాలేదు.

గుంటూరులో మరో మూడు

జీబీఎస్ కేసులు

- బాధితుల్లో గర్భిణీ.. 13కు చేరిన కేసుల సంఖ్య
- ప్రకాశం జిల్లాలో ఏఎన్ఎంకు వైరస్ లక్షణాలు
- విజయవాడ ఆసుపత్రికి తరలించిన వైద్యులు



గుంటూరు(మెడికల్)/కనిగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్ర జ్యోతి): గుంటూరులో మరో మూడు గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) కేసులు వెలుగు చూశాయి. బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రి న్యూరాలజీ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గడిచిన మూడు రోజుల్లో కొత్తగా ఈ మూడు కేసులు నమోదైనట్లు ఆసుపత్రి అధికార వర్గాలు తెలిపాయి. జీబీఎస్ బాధితుల్లో గర్భిణి కూడా ఉన్నట్లు పేర్కొన్నాయి. ఆమె ఆరోగ్య పరిస్థితి కొంత విషమంగా ఉందని న్యూరాలజీ వైద్యులు తెలిపారు. మిగిలిన ఇద్దరు సాధారణ వార్డుల్లోనే చికిత్సలు పొందుతున్నారు. దీంతో ఈ నెలలో గుంటూరు జీజీహెచ్‌లో చేరిన జీబీఎస్ కేసుల సంఖ్య 13కి చేరింది. బాధితులలో ప్రకాశం జిల్లాకు చెందిన కమలమ్మ(55), గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన షేక్ గోవర్‌జాన్‌బీ(60) మృతి చెందారు. మిగిలిన వారిలో ఆరుగురు కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ఐదుగురు చికిత్స పొందుతుండగా, వీరిలో గర్భిణి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆమె కోసం వెంటిలేటర్‌ను సిద్ధం చేశారు. ఇక ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామ వైద్య సేవా కేంద్రం ఏఎన్ఎంకు జీబీఎస్ లక్షణాలు కనిపించాయి. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు క్లినిక్ వైద్యురాలు డాక్టర్ స్వప్న తెలిపారు.

అది పబ్లిసిటీ కోసం వేసిన పిల్

- అనధికార పేకాట క్లబ్‌లపై పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు
- పిటిషనర్‌కు రూ. 50 వేలు జరిమానా

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనధికార పేకాట క్లబ్‌లను నియంత్రించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను హైకోర్టు కొట్టివేసింది. ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా పబ్లిసిటీ కోసమే పిల్ వేశారని వ్యాఖ్యానించింది. పేకాటను ఏ క్లబుల్లో అనధికారంగా అనుమతిస్తున్నారు? ఆ క్లబ్బులు నిర్వహిస్తున్నది ఎవరు? ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు ఎవరు? వంటి వివరాలు ఏమీ లేకుండా పిల్ దాఖలు చేశారని ఆక్షేపించింది. ఈ పిల్ వేసిన విజయవాడకు చెందిన మల్లవరపు లక్ష్మణరావుకు రూ. 50 వేలు జరిమానా వేసి.. రెండువారాల్లో ఏపీ న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని స్పష్టం చేసింది. ఆ సొమ్మును వినికిడి, దృష్టి లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంక్షేమానికి వినియోగించాలని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఇటీవల తీర్పు ఇచ్చింది.

యాదాద్రి జిల్లా నేలపట్లలో బర్డ్‌ఫ్లూ

- తెలంగాణలో తొలి బర్డ్‌ఫ్లూ కేసు

చౌటుప్పల్ రూరల్/ఐనవోలు, ఫిబ్రవరి 22: తెలంగాణలో మొదటి బర్డ్‌ఫ్లూ కేసు నమోదైంది. యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్లలోని ఓ కోళ్లఫారమ్‌లోని కోళ్లకు బర్డ్‌ఫ్లూగా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ప్రభుత్వ ఆదేశాలతో వివిధ శాఖల అధికారులు శనివారం ఆ కోళ్లఫారాన్ని సందర్శించి శానిటైజ్ చేశారు. చౌటుప్పల్ మండలం నేలపట్లలోని కోళ్లఫారమ్‌లో ఈనెల 14,15 తేదీల్లో వెయ్యి కోళ్లకు పైగా మృత్యువాతపడ్డాయి. ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూతోనే మృతిచెందినట్టు హైదరాబాద్ ల్యాబ్ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గ్రామంలోని నాటు కోళ్లను, బ్రాయిలర్ కోళ్లను చంపివేయాలని ఆదేశించారు. సమీప గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో ఉన్న కోడి గుడ్లను పారబోశారు. ఇతరులు ఈ గ్రామంలోకి రాకుండా.. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇదే మండలంలోని స్వాములవారి లింగోటంలో 5 వేల కోళ్లు మృతిచెందాయి.

2వేల నాటు కోళ్లు మృత్యువాతపడిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలో కలకలం లేపింది. తొలుత బర్డ్‌ఫ్లూగా భావించి ఆందోళన చెందగా, వెటర్నరీ వైద్యులు బర్డ్‌ఫ్లూ కాదని తేల్చారు. కొక్కెర వ్యాధితో మృతి చెందినట్లు స్పష్టం చేశారు. కోళ్ల మృతిచెందడంతో పెంపకందారులైన స్వయం సహాయక బృందం(ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలు నోముల సంగీతకు రూ.8లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. కోళ్ల పెంపకంతో అప్పులపాలయ్యానని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని సంగీత కోరుతున్నారు.

తొక్కిసలాట ఎలా జరిగింది?

- తిరుపతి ఘటనపై మలివిడత న్యాయ విచారణ ప్రారంభం
- పార్కులోకి పంపేసి తాళాలు వేసేశారు
- ఒక్కసారిగా గేట్లు తెరవడంతో అంతా అటువైపు పరుగులు
- అక్కడ భక్తులను కట్టడి చేసే పరిస్థితి లేదు
- ఏకసభ్య కమిషన్ ముందు బాధితుల వాంగ్మూలం

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ మలివిడత విచారణ శనివారం ప్రారంభమైంది. తిరుపతి కలెక్టరేట్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి ఎదుట 11 మంది బాధితులు హాజరై వాంగ్మూలమిచ్చారు. అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయా? సకాలంలో వైద్యం అందిందా? టీటీడీ నుంచీ పరిహారం అందిందా? వంటి ప్రశ్నలు వేసి కమిషన్ ఛైర్మన్ వివరాలు నమోదు చేసుకున్నారు.

వెనుక నుంచి నెట్టేశారు: బైరాగిపట్టెడలో వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ కేంద్రం పక్కనే ఉన్న పద్మావతీ పార్కులోకి తమను గుంపులుగా తోసేసి గేట్లకు తాళాలు వేశారని బాధితులు కమిషన్‌కు వెల్లడించారు. టోకెన్ల కోసం ఆత్రంగా వేచిచూస్తుండగా గేట్లు తెరవడంతో అందరూ ఒక్కసారిగా అటువైపు పరుగులు తీశారని, వెనుక నుంచి భక్తులు నెట్టుకుంటూ ముందుకు రావడంతో తాము కిందపడిపోయి గాయపడ్డామని అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురం నుంచి వచ్చిన తొమ్మిది మంది బాధితులు చెప్పినట్లు తెలిసింది. తోపులాటను ఎవరూ కట్టడి చేసే పరిస్థితి లేకపోయిందన్నట్లు సమాచారం. అప్పట్లో గాయపడ్డ తాను ఇప్పటికీ మెడ నొప్పి, వినికిడి సమస్యలతో బాధ పడుతున్నానంటూ ఓ మహిళ వెల్లడించినట్లు తెలిసింది. తొక్కిసలాట ఘటనలో గాయపడిన విశాఖవాసులు దూరాభారంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా విచారణకు హాజరు కాలేకపోతున్నామని తెలపడంతో వారితో జూమ్ లేదా వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి విచారించాలని కమిషన్ నిర్ణయించినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం కేటాయించిన ఎస్కార్ట్ వాహనాన్ని కమిషన్ ఛైర్మన్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. గత నెల 8న తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందడంతో పాటు మరో 44 మంది గాయపడిన సంగతి తెలిసిందే.





అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పవన్‌కల్యాణ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పవన్‌కల్యాణ్‌కు స్కానింగ్, తత్సంబంధిత పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మరికొన్ని వైద్య పరీక్షలు అవసరం ఉందని చెప్పారు. ఈ నెలాఖరున లేదా మార్చి మొదటి వారంలో మిగిలిన వైద్య పరీక్షలు చేయించుకోనున్నారు. కాగా, ఈ నెల 24వ నుంచి ప్రారంభం కానున్న ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు పవన్ కల్యాణ్ హాజరు కానున్నట్లు ఆయన సన్నిహిత వర్గాల సమాచారం.

ఖాతాదారుల నగలు తనఖా పెట్టి..
5,498 గ్రాములతో 2.35 కోట్లు లూటీ

- ఇందులో రూ.12లక్షల నగలను బ్యాంకులోనే మళ్లీమళ్లీ కుదువపెట్టి రూ.1.34 కోట్లు కొల్లగొట్టిన వైనం
- బ్యాంకు డిప్యూటీ మేనేజర్ ఘరానా మోసం
- తిరుపతి జిల్లా నాగలాపురం యూబీఐలో ఘటన
- డిప్యూటీ మేనేజర్, మేనేజర్‌పైనా కేసు నమోదు

సత్యవేడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేసిన చందంగా.. బ్యాంకు ఖాతాదారుల బంగారాన్ని ఆ బ్యాంకు ఉద్యోగే ఎత్తుకెళ్లాడు. ఎంచక్కా.. బయట కుదువ అంగళ్లలో తనాఖా పెట్టి రూ.కోటికి పైగా లూటీ చేశాడు. మరికొందరు ఖాతాదారుల నగలను బ్యాంకులోనే వేర్వేరు బినామీల పేరిట మళ్లీ మళ్లీ కుదువ పెట్టి మరో కోటిన్నర వరకు దోచేశాడు. ఇలా మొత్తంగా నాలుగు కోట్ల విలువైన బంగారంపై రూ.రెండున్నర కోట్ల వరకు కొల్లగొట్టాడు. చివరికి ఆడిట్ తనిఖీల్లో అడ్డంగా దొరికి పోయాడు. ఈ వ్యవహారంలో మరో బ్యాంకు అధికారి పాత్ర కూడా ఉన్నట్లు తేలడంతో ఇద్దరిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లా నాగలాపురం యూనియన్ బ్యాంకులో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది. వివరాలివీ.. ఈ బ్యాంకులో అరవ సూర్యతేజ్ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. 2024 మే నుంచి 2025 ఫిబ్రవరి 10వ తేదీ వరకు బ్యాంకులో బంగారు నగలపై రుణాలు పొందిన 67 మంది ఖాతాదారులకు సంబంధించిన 5,498 గ్రాముల నగలను ఎత్తుకెళ్లి మొత్తం రూ.2.35 కోట్లు కాజేశాడు. ఇందులో 30 మంది ఖాతాదారుల నగలను పుత్తూరు పరిసర ప్రాంతాల్లోని కుదువ అంగళ్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో కుదువ పెట్టి రూ.కోటీ నాలుగు లక్షలు తీసుకున్నాడు. మరో 37 మంది ఖాతాదారులకు సంబంధించిన నగలను అదే బ్యాంకు (నాగలాపురం యూనియన్ బ్యాంకు)లోనే బినామీ పేర్ల మీద రొటేషన్ పద్ధతిలో మార్చుకుంటూ కుదువ పెట్టి రూ.1.31 కోట్లు కాజేశాడు. ఇటీవల బ్యాంకులో జరిగిన ఆడిట్‌లో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది. విచారణ జరిపిన అధికారుల బృందం ఖాతాదారులు తమ అవసరాల నిమిత్తం బ్యాంకులో తనఖా పెట్టిన నగలను ఆ బ్యాంకు ఉద్యోగే లూటీ చేసినట్లు నిర్ధారించారు. యూనియన్ బ్యాంక్ తిరుపతి రీజియన్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్, మేనేజర్ శేఖర్ తిరువరాజ్‌లపై నాగలాపురం ఎస్ఐ సునీల్ శుక్రవారం కేసు నమోదు చేశారు.

అవే నగలు బినామీ పేర్లతో మార్చి మార్చి..

విచారణలో బ్యాంకు ఉద్యోగి నగలు కాజేసిన తీరు చూసి అధికారులకు దిమ్మతిరిగింది. డిప్యూటీ మేనేజర్ అరవ సూర్యతేజ్ ఖాతాదారుల నగలను బినామీ పేర్లతో మళ్లీ మళ్లీ బ్యాంకులోనే కుదువ పెట్టి భారీ మోసానికి పాల్పడ్డట్టు గుర్తించి విస్తుపోయారు. ఇందులో కొందరు ఖాతాదారులు తాకట్టుపెట్టిన కేవలం రూ.12 లక్షల విలువ కలిగిన నగలను 11 మంది బినామీ పేర్లతో మార్చి మార్చి కుదువ పెట్టినట్లు చూపించి రూ.1.34 కోట్లు కొల్లగొట్టినట్లు గుర్తించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.